నివాళి

## యద్ధనపూడి సులోచనారాణి

1940 - 2018

# సాహిత్య ప్రస్థానం

జూన్ 2018

వెల రూ. 20

## పెద్దిభొట్ల సుబ్బరామయ్య

15.12.1938 - 18.05.2018



## మాదాల రంగారావు

25.05.1948 - 27.05.2018

సాహితీస్రవంతి

# రాజమహేంద్రవరంలో మే 27న జరిగిన కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సంవత్సరం ప్రారంభ కార్యక్రమ దృశ్యాలు



కందుకూరి శతవర్ధంతి ప్రారంభ ప్రసంగం చేస్తున్న తెలకపల్లి రవి



కందుకూరి వేషధారితో కందుకూరి మాస్క్ ధరించిన
కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు



కోటిపల్లి బస్టాండులోని కందుకూరి విగ్రహం



సాహిత్య ప్రస్థానం మాసపత్రిక కందుకూరిపై
వెలువరించిన ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



రాజమహేంద్రవరంలో కోటిపల్లిలోని కందుకూరి విగ్రహం నుండి
ప్రభాత [illegible] వేదిక వరకూ నిర్వహించిన ర్యాలీ దృశ్యం



రాజమహేంద్రవరంలోని గౌతమీ గ్రంథాలయ మందిరంలో జరిగిన సభ



విజయవాడలో ప్రెస్‌మీట్‌లో
కందుకూరి శతవర్ధంతి సంవత్సర
ప్రారంభ కార్యక్రమాల పోస్టర్ విడుదల

ప్రస్థానం
జూన్ 2018

సంపుటి : 17 | సంపాదకీయం | సంచిక : 6

# ముగ్గురు మూర్తులు

ఈ నెలలో తెలుగు కళా సాహిత్య రంగం ముగ్గురు మూర్తులను కోల్పోయింది. ఆ ముగ్గురూ తమ తమ మార్గాల్లో సాంస్కృతిక వికాసానికి దోహదం చేసిన వారు. చివరి వరకూ అందుకే అంకితమై కృషి చేసినవారు. అందుకే ఈ నెల సాహిత్య ప్రస్థానం వారికి ముఖచిత్రంతో నివాళి అర్పిస్తున్నది. పెద్దిభొట్ల సుబ్బరామయ్య ప్రసిద్ధ ప్రగతిశీల కథకుడు. నిరాడంబరంగా నిష్కల్మషంగా సాహితీ సేవ చేసిన అక్షర తపస్వి. ఆయన కథలు కొత్తగా కలం పట్టిన వారికి పాఠాలుగా వుండదగ్గవి. సాహిత్య ప్రస్థానానికి ఆయన గతంలో ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పినట్టు మధ్య తరగతి మనుషుల మనుగడనూ మనోసీమలనూ కూడా అనితర సాధ్యంగా ఆవిష్కరించారాయన. తన కథాంశాలు, కథన శిల్పమూ కూడా విలక్షణమైనవి. వ్యక్తిగా ఆయన వివాదరహితుడూ, విశాల హృదయుడూ, జీవితాంతం గీటు దాటని నిబద్ధ ప్రగతివాది సుబ్బరామయ్య.

ఎనభయ్యవ దశకంలో మూస వ్యాపార ధోరణిలో కొట్టుమిట్టాడుతున్న తెలుగు సినీ రంగంలో తళుక్కున మెరిసిన అరుణతార మాదాల రంగారావు. ఆయన యువతరం కదిలిందితో నిజంగానే చిత్రసీమలో చైతన్యం కదిలింది. ఎర్రమల్లెలు విరబూశాయి. తర్వాత ప్రజాశక్తి, విప్లవశంఖం వంటి చిత్రాల తర్వాత జనం మనం అన్న టైటిల్‌తోనే కళలను జనానికి అంకితం చేయాలని సందేశమిచ్చిన సాహసికుడు మాదాల. సాహిత్య రంగం ఆయనను ప్రత్యేకంగా చెప్పుకోవడం ఎందుకంటే ఎందరో కొత్త రచయితలకు అవకాశమిచ్చారు. అప్పటివరకూ ప్రజాఉద్యమాల వేదికలకే పరిమితమైన ప్రజా గీతాలు చలన చిత్ర గీతాలై మార్మోగాయి. నాంపల్లి టేషను కాడ, నేను రాను బిడ్డో, కొంతమంది కుర్రవాళ్లు, నేడే మేడే తదితర గీతాలు జనాదరణ పొందడం ప్రజాపక్ష రచయితలకు ప్రేరణ నిచ్చింది.

పరిచయం అక్కర్లేని ప్రసిద్ధురాలు నవలా రాణిగా పేరొందిన యద్దనపూడి సులోచనా రాణి. యాభై ఏళ్ల కిందటి సమాజంలో మరీ ముఖ్యంగా మహిళలలో పఠనాసక్తిని, రచనాశక్తిని పెంచిన రచయిత్రి. జనాదరణకు మారుపేరుగా నిలిచిన ప్రతిభాశాలి. అత్యధిక ముద్రణలు పొందిన నవలలు ఆమె స్వంతం. ప్రగతిశీల సామాజిక భావజాలం ప్రధానంగా తీసుకోకపోయినా మానవీయత, మహిళల ఆత్మగౌరవం, అభివృద్ధి కాంక్షలను అక్షరీకరించిన ఆధునికురాలు. మూఢత్వం చొరనీయకుండా నూతన విద్యాధిక యువతుల అస్తిత్వ పోరాటాలకు అద్దం పట్టాయి ఆమె నవలలు. చలన చిత్రాలుగానూ విజయం సాధించాయి. అందుకే వాణిజ్య పోకడలున్నా ఆమె సాహితీ లోకానికి స్ఫూర్తిగా నిలిచి వుంటారు. ఈ త్రిమూర్తులకు నివాళులర్పిస్తూ అదే తరహాలో ప్రతిభావంతమైన కృషికి అంకితం కావలసిన బాధ్యత ఈ తరం రచయితలపై వుంది.

♦♦♦

కందుకూరి వీరేశలింగం ప్రత్యేక సంచికగా వెలువడిన గత నెల సంచికను అనేక మంది అభినందించారు. ఆయన శత వర్ధంతి కార్యక్రమాలు కూడా ప్రారంభమైనాయి. ఈ ఏడాది పొడుగునా ఆయన గురించిన విశేషాలు, విశ్లేషణలూ కొనసాగుతుంటాయి. ♦

సంపాదకవర్గం:
తెలకపల్లి రవి ప్రధాన సంపాదకుడు
వొరప్రసాద్ వర్కింగ్ ఎడిటర్
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి
కెంగార మోహన్
కె.లక్ష్మయ్య, మేనేజర్

కవర్ డిజైన్ : బ్రౌన్
బొమ్మలు: తుంబలి శివాజి
గంగాధర్ వీర్ల
చిదంబరం

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!
1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 /
◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-
Bank Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada
A/c No. 52001500585, IFSC: SBIN0020343
చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

**కథలు**

**పూనమ్** – రాజీవ్‌త్యాగి (అను: కె. సత్యరంజన్)........ 5
**కార్పొరేట్ అంబలి** – ఎల్. శాంతి...................... 23
**రంగుల హరివిల్లు** – కె. ఉషారాణి..................... 41

**కవితలు**

**ఆకుపచ్చని వసంతం** – గంగవరపు సునీత............. 4
**ప్రశ్నంటే** – శ్రీనాగాస్త్ర..................................... 6
**అతడు మరణించడానికి వీల్లేదు**– డా॥ ఎన్. గోపి....... 7
**మా పల్లె నేలపూసిన జాబిల్లి**– బి. కళాగోపాల్.......... 7
**రక్తం కురుస్తున్న ఆకాశం**
–యామినీదేవి కోడే................................ 17
**అరుదైన చిత్రకారిణి**– జంధ్యాల రఘుబాబు............ 18
**నిశ్శబ్ద యుద్ధం**– కెంగార మోహన్..................... 18
**దప్పు చెప్పిన మాట**– బి. గోవర్ధనరావు.................. 22
**యౌవన రహస్యం** – అద్దేపల్లి రామమోహనరావు...... 27
**మర ప్రపంచం** – సత్యభాస్కర్.......................... 32
**స్వేచ్ఛ** – పాయల మురళీకృష్ణ........................... 32
**దర్శనం** – పల్లిపట్టు నాగరాజు.........................40
**దరిద్రపు ఆకలి** – గోసల నారాయణస్వామి........... 47
**శ్రీశ్రీ**– మహ్మద్ ఖాజామైనుద్దీన్.......................... 47
**నదిలాంటి మనిషి**– ఉదయమిత్ర........................ 50
**అక్షర తలంపు** –జూటూరి షరీఫ్........................ 53
**ఎలా జీవించనూ?** – డా॥ దేవరాజు మహారాజు.......56
**తెల తెల్లని రెపరెపలు**
– చిత్తలూరి సత్యనారాయణ...................... 57
**1947ను జ్ఞాపకం చేసుకుంటూ**
– డా॥ వెన్నా వల్లభరావు........................... 61
**నిశానీనే** – మెరాజ్ ఫాతిమా............................. 61

**వ్యాసాలు**

**నాటి చాసో బృందం లేఖలు – నేటి సాహిత్య రేఖలు**
– తెలకపల్లి రవి.................................... 8
**ప్రజా రంగస్థలం**– రోమెన్ రోలాండ్.................... 11
**చలం జీవిత కథ** – మందరపు హైమవతి.............. 13
**అల'ల సవ్వడి** – రత్నాల బాలకృష్ణ...................... 19
**మధ్యతరగతి జీవితం కథలకు మాగాణం (ఇంటర్వ్యూ)**
– పెద్దిభొట్ల సుబ్బరామయ్య........................29
**పాఠకులనూ, రచయిత్రులనూ పెంచిన సులోచనారాణి**
– తెలకపల్లి రవి.................................... 33
**నిశ్శబ్ద విప్లవాన్ని ధ్వనిస్తున్న సత్యాగ్ని కథలు**
– తవ్వా వెంకటయ్య................................ 35
**సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ నెల పురస్కారాలు** .......... 44
**ఒక మెత్తటి రహస్తంత్రీ గానం**– శ్రీరాం................. 45
**నిశ్చయ ప్రకటనకి స్వాగతం**– కె.ఎన్. మల్లీశ్వరి...... 48
**నిన్ను నీవు గెలిచాక.. పలికే కవిత్వం**
– బొల్లోజు బాబా.................................. 51
**అంటరాని యాసను ధిక్కారస్వరంగా మార్చిన కటికపూలు**
– పిళ్ళా కుమారస్వామి............................. 54
**స్వీకారం**.......................................................58
**డైరీ** .........................................................62

**కవిత**

## ఆకుపచ్చని వసంతం

బతుకును నిర్భయంగా
బతుకుతున్న నేనిపుడు
వైరాగ్య వస్తువును కాదు
ఆశల శిఖరం వైపు
ఆర్తిగా అడుగులేస్తున్న
ఎర్రని సూర్య కిరణాన్ని

గుండె మైదానం నుంచి
బహిష్కరించబడిన
సంఘర్షణా స్మృతులను
మనో నేత్రంతో వీక్షిస్తున్న
మౌన వేదాంతిని

మెత్తటి మనసు పొరల్ని
అవిచ్ఛిన్నంగా
విచ్ఛిన్నం చేస్తూ
అల్లుకుంటున్న
అస్పష్ట యోచనల్ని



– సునీత గంగవరపు
9494084576

పండు వెన్నెల్లో
శుద్ధి చేసుకుంటున్న
ఆకుపచ్చని వసంతాన్ని!
ఆశయాల కుటీరాన్ని!!

# పూనమ్

ఆంగ్ల మూలం : రాజీవ్ త్యాగి
తెలుగు : కె. సత్యరంజన్



పూనమ్‌ది వానా కాలపు చదువు. గంతకు తగ్గ బొంత అని ఒక సంబంధం కుదిర్చి పెళ్ళి చేసేసారు రెక్కల కష్టం మీద బతికే ఆమె తల్లిదండ్రులు. అతగాడా పచ్చి తాగుబోతు. ఆ తాగుడు అలవాటు మూలంగా ఏ పనిలోనూ నిలదొక్కుకోలేకపోయాడు. తన చాతకానితనాన్ని అంతా భార్యని చావచితక కొట్టడం ద్వారా వదిలించుకుంటూ ఉండేవాడు. ఇద్దరు ఆడపిల్లలకి తల్లి అయిన పూనమ్ సంసారం నడిపించే బాధ్యత అంతా తన నెత్తిన వేసుకుంది. ఒళ్ళు మర్దనా చెయ్యడం నేర్చుకుని ఇంటింటికి తిరిగి ఆయమ్మ ఈయమ్మ ఒళ్ళు పట్టి నాలుగు డబ్బులు సంపాదించుకు వచ్చి ఇల్లు నెట్టుకొస్తా ఉండేది. అనోటా ఈనోటా పూనమ్ పనితనం ఊరంతా పాకి మొత్తానికి తను సంపాదనతో ఒక స్కూటర్ కొనుక్కుని దీనిమీద కాస్త దురాబారాలు కూడా వెళ్ళి ఒళ్ళు మర్దనా చేసి వచ్చేదాకా పెరిగింది. ఇంటి బాధ్యత లేకపోడంతో మొగుడుకి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. పగలూ, రాత్రి తాగుడుతోనే సావాసం. ఆ సావాసం కోసం పూనమ్ కష్టపడి సంపాదించి ఇంట్లో దాచిపెట్టుకున్న సొమ్ముని దొంగతనం చేసయినా తీసుకుపోయే స్థాయికి దిగజారిపోయాడు. చేతికి డబ్బు దొరకకుండా చేసిన రోజున పూనమ్‌ని తన్ని మరీ తన తాగుడుకు కావాల్సిన డబ్బు గుంజుకు పోయేవాడు. తన వృత్తిలో భాగంగా చాలా పెద్ద కుటుంబాల ఆడవాళ్ళతో పూనమ్‌కి పరిచయాలు ఏర్పడ్డాయి. ఆ ఊరి మేజిస్ట్రేటు గారి భార్యకూడా పూనమ్‌కి అలానే పరిచయం అయింది. పూనమ్ సంసారం గురించి తెలుసుకున్న ఆవిడ "అలాంటి తాగుబోతు వెధవని ఇంకా భరించేది దేనికి, ఏ నీకాళ్ళ మీద నువ్ నిలబడలా ఇన్నాళ్ళు . అయ్యగారితో మాట్లాడి ఆ పాపిష్టోడితో నీకు విడాకులు అయ్యేలా చూస్తాలే" అని సముదాయించింది.

విడాకులు అనేసరికి ఇద్దరు ఆడపిల్లలని ఇంటికి మగదిక్కయి ఇన్నాళ్ళుగా సాకుతూ వచ్చిన పూనమ్ ముందు చాలా గుంజాటన పడింది. లోకం ఏమనుకుంటుంది అని పరిపరివిధాలా ఆలోచించింది. తన ఇద్దరు బిడ్డల భవిష్యత్తును తీర్చిదిద్దడం కోసం తాను మొగుడ్ని వదిలేసిన ఆడది అన్నమాట పడడం పెద్ద విషయం కాదు" అని నిర్ణయం చేసుకుంది. ఆ పళానే మేజిస్ట్రేటుగారి భార్య సాయంతో కోర్టులో విడాకులు తీసుకుని తాగుబోతు మొగుడి పీడ వదిలించుకుంది. ఇద్దరు ఆడపిల్లలకి తల్లీదండ్రీ తానే అయి చదివించింది. హైస్కూలు చదువులు పూర్తికాగానే పెద్ద కూతురికి బ్యూటీషియన్ కోర్స్ నేర్పించి స్వంతంగా ఒక పార్లర్ పెట్టించింది. కొద్ది రోజుల్లోనే పార్లర్‌కి మంచి పేరొచ్చింది. పూనమ్ కుటుంబానికి మంచి సంపాదన తెచ్చిపెట్టింది.

పెద్ద కూతురుకి పంతొమ్మిదో ఏడు నిండేసరికి పూనమ్ ఆ పిల్లకి పెళ్ళికొడుకుని వెతకడంలో పడింది. ఎట్టకేలకి ఒక ఫార్మాస్యూటికల్ కంపెనీలో సేల్స్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్న ఓ కుర్రాడిని చూసి ఈడుజోడుగా ఉంటారని సంబంధం ఖాయం చేసుకుంది. తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

కొన్ని వారాలు గడిచాక పూనమ్ వియ్యాలవాళ్ళ ఇంటికి వెళ్ళింది. పెళ్ళి ముహూర్తం నిర్ణయించుకుని పెళ్ళిలో పాటించాల్సిన పద్ధతులూ అవీ మాట్లాడుకు వద్దామని. పిల్లాడి తల్లిదండ్రులు మాత్రం పూనమ్ వాళ్ళ ఇరుగుపొరుగు వాళ్ళ కులాలు ఏమిటని ఆరాలు తీస్తూ మీ ఇరుగూ పొరుగులో తురకోళ్ళు లేరు కదా అనడిగారు. 'లేకేం భేషుగ్గా ఉన్నారు. వాళ్ళిళ్ళకి మా ఇంటికి రాకపోకలు బాగానే సాగుతుంటాయి. నాకూ, నా కూతురికి కూడా చాలమంది సాయిబు స్నేహితురాళ్ళు ఉన్నారు' అని బదులిచ్చింది పూనమ్. పిల్లాడి తల్లిదండ్రులు మొహాలు చీదరగా పెట్టి "ఆ స్నేహాలు మా ఇంటిదాకా తీసుకురాబాకండి. ఆఖరికి పెళ్ళికి కూడా 'వాళ్ళ'ని పిలవకూడదు, సరా" అని చెప్పారు.

పూనమ్ కోబోయే అల్లుడికేసి చూసి 'నీదీ మీ అమ్మానాన్నా మాటేనా' అనడిగింది. కుర్రాడు జనకుడి మాట జవదాటని రాముడిలా తలూపాడు. అంతే పూనమ్ దిగ్గునలేచి 'ఏం మనుషులర్రా మీరూ, ఇంత మతం తలకెక్కేసి ఉన్నారు. ఇరుగూ పొరుగులో కులాలు, మతాలు లెక్కలేసే మీబోటి వాళ్ళ కొంపకి నా కూతుర్ని కోడలిగా పంపనుగాక పంపను' అని ఖరాఖండిగా చెప్పేసి వచ్చేసింది.

ఆ మరుసటి రోజు మా ఇంటికి వచ్చింది. మనిషి మనిషిగా లేదు. మా ఆవిడ దగ్గరికి వచ్చి 'అమ్మా మీతో నా బాధ చెప్పుకోవచ్చా' అనడిగి మరీ పూసగుచ్చినట్లు తన కూతురు పెళ్ళి వ్యవహారం అంతా విడమర్చి చెప్పింది. ఏదైనా తప్పు చేసానా అన్న దిగులు ఆమె మొహంలో కనిపిస్తుంది. మా ఆవిడ 'శభాష్ పూనం మంచి పన్జేసావ్' అంటూ మనస్ఫూర్తిగా మెచ్చుకోగానే పూనమ్ మొహంలో దిగులు మబ్బు తొలగిపోయింది. 'మరేం చెయ్యమంటారు అమ్మగోరూ. మనుషులని చూడాల్సిన చోట మతాల్ని చూస్తున్న ఆ మరుగుజ్జు బుర్రల్తో నా కూతురు ఎలా వేగుకొస్తుందీ అనిపించి ఈ సంబంధం కాలదన్నేసాను అమ్మగోరు' అని చెప్పింది కొండంత తృప్తితో.

ఇదంతా వింటున్న నాకు అనిపించింది – "ఈ జాతిని పూనమ్ లాంటి వందల వేల తల్లులు నిర్మిస్తారు తప్ప, దేశ ప్రధానులు మాత్రం కాదని". మీకేం అనిపిస్తుందీ..?

*('ఏ క్రాకర్‌జాక్ లైఫ్' కథాసంకలనం నుండి. రచయిత ఫేస్‌బుక్ ఐడి RaJivTYAGI. పుస్తకం అమెజాన్.ఇన్‌లో లభిస్తుంది)*

♦

---

**కవిత**

## ప్రశ్నంటే ?

**ఓ** ధిక్కారస్వరం
ఓ జ్ఞానచక్షువు

ప్రశ్నించడమంటే?
విజ్ఞానాన్ని తవ్వితీయడం
అజ్ఞానాన్నిచంపి పాతేయడం

ప్రశ్నించడమంటే?
సత్యానికి దన్నుగా నిలబడటం
అన్యాయాన్నెదిరించి పోరాడటం

ప్రశ్నించడమంటే?
మూడో కన్నును భళ్ళున తెరవడం
ఛెర్నాకోలాతో ఛెళ్ళున చరచడం

ప్రశ్నించడమంటే?
బానిసత్వ సంకెళ్ళను పటపటా
త్రెంచడం
మందుగుండును రాతిబండలో పెట్టి
పేల్చడం

ప్రశ్నించడమంటే?
మూగగొంతులో ఫిరంగి గర్జించడం
ఆత్మాభిమానం రొమ్మిరిచి మీసం
మెలేయ్యడం

ప్రశ్నంటే ?
భూగోళంపై
కొడవలి జెండాను ఎగరేయడం

**శ్రీ నాగాస్త్ర**
**7013939600**



♦

## అతను మరణించటానికి వీల్లేదు

- డా॥ ఎన్. గోపి



అతడు మరణించటానికి వీల్లేదు
చలనం లేకుండా
ఒక్క క్షణమైనా ఉండలేని
చైతన్య మూర్ధన్యుడు
అతడు నిశ్చలమైపోవడాన్ని
ఊహించలేను.

జీవితంలో
మట్టిని బంగారం గావించిన
రసోన్మత్తుడు.
మనకు బంగారాన్ని మిగిల్చి
తాను మట్టిలో కలిసిపోవడాన్ని
అంగీకరించను.

అతని ఫలిత కేశాలు
కాలంతో కలిసి
కుట్రచేసినప్పుడే అనుకున్నాను.
పరిసరాలు వొణుకుతున్నప్పుడే
అతని నడక తడబాటును
గ్రహించాను.
నిశ్శబ్దాన్ని
కారుణ్య శతాబ్దిగా మార్చినవాడు
ఇప్పుడా నిశ్శబ్దమ్మీదే పడుకున్నాడు.

నోరు తెరిచి ఉన్నా
పాట వెలువడటం లేదు
కళ్ళు తెరిచివున్నా
చూపులు ప్రసరించటం లేదు.

రోజులను
తలవంచుకొని
వెళ్ళిపోనివ్వని ధీరుడు.
నిరాశకు
నిలువ నీడ లేకుండా చేసిన
నిలువెత్తు సూర్యుడు.

పగలు రాత్రితో కలిసే
ఎరుపైన సన్నివేశం
అందమైందే కావచ్చు,
కాని చీకటి
అతన్ని కూడా కబళించటాన్ని
జీర్ణించుకోలేము.

**('వృద్ధోపనిషత్' (Old age poems)**
**అముద్రిత కావ్యం నుండి)** ❖

---



## మా పల్లె.. నేల పూసిన జాబిల్లి.!


- బి. కళాగోపాల్
9441631029

సుట్టూ పూసిన తంగేడు గుట్టల్ని సుట్టుకుదురుగా
తలకెత్తుకున్న మా పల్లె.. ఆకుపచ్చ సూర్యోదయాన్ని దిద్దుకుంది!
తలాపున పారే ఒర్రెల.. కయ్యల కుతినింపుతూ..
విడిపోలేని దోస్తానా మనదంటున్న మా ఊర చెరువు
పల్లె దిద్దుకున్న నీటి బొట్టై మెరిసింది!
పసుపు కుంకుమలు అద్దుకున్న మా అడెల్లిపోశవ్వ గుడి
రావిచెట్టు నీడల కింద.. ఉప్పస బతుకు ముల్లెల్ని
ఇప్పుకుంటున్న పగిడీల ఎన్కటితరం !
మా ఊరి పెద్ద కచ్చురపు సవారీయై దర్పాన్ని ఒలకబోసింది !
కచ్చేరీలు, రచ్చబండలకాడ దేశంబోయిన మాపల్లె పొల్లగాండ్ల
ఆగమైన జిందగీ ముచ్చట్లను మోసుకొచ్చిన కారట్ ముక్కల
అక్షరాల్లో.. 'జెరపయిలం బిడ్డా!" అంటూ మా ఊరు
పెద్దాయి ఆత్మీయ కౌగిలై హత్తుకుంది!
ఈదుర్లు, తాటిముంజెలతో నిండిన ఎనుగు* కట్టుకున్న
మా పల్లె.. నా గోస బతుకును పంచుకునే జిగిరీ బంధం!
తీరొక్క పూల ఆదిబన్నసరమై..*
గజ్జె కట్టిన కళారూపాల జాతరలో..
మా పల్లె.. బోనమెత్తిన పెద్దమ్మ తల్లి ఆశీర్వాదమైంది!
నన్ను రమ్మంటూ.. యాద్జేస్తున్న మా పల్లె..
నా కొరకే ఎదురుచూస్తున్న కట్టమీద పాలపిట్టైంది!!

*** ఎనుగు = కంచె * ఆదిబన్నసరము = పాపిడిబిళ్ల** ♦

చర్చ

# నాటి చాసో బృందం లేఖలు - నేటి సాహిత్య రేఖలు



- తెలకపల్లి రవి

***తమ రచనలపై చర్చ జరగాలనే తపన అప్పటి నుంచి ఇప్పటి వరకూ రచయితలకు ఒకేలా వుంది. కాకపోతే అప్పుడు మీడియా ఇంత విస్తరించలేదు. పుస్తక ప్రచురణ ఇంత సులభం కాదు. కనుకనే మహాకవులు కూడా నానాయాతన పడ్డారు. ఇప్పుడు మనకు రావలసినంత గుర్తింపు లేదా పొగడ్త రాలేదని విచారించే వర్తమానులు గతంలోకి ఒకసారి చూడటం మంచిది మరి! ఈ లేఖలు రాసిన వారు స్పందించిన వారు తమ రచనలపై సమీక్షలు కోరడమే గాక విమర్శలను ఆహ్వానించిన తీరూ, ఇతరులను గౌరవించిన తీరు ఇప్పుడు కొరవడుతున్నదని నిస్సందేహంగా చెప్పొచ్చు. సాహిత్యరంగం విశాల దృక్పథం లేకుండా సజీవం కాదు.***


ప్రస్థానం పరిమాణం పెరిగాక మొదటి సంచికలో నేను ఈనాటి సాహిత్యకారుల తీరుతెన్నులపై ఒక విమర్శ రాశాను. చర్చకు ఆహ్వానించాము. ఒకరిద్దరు తప్ప మరెవరూ ఆ చర్చలో పాల్గొనకపోవడం నేనుచేసిన వ్యాఖ్యల వాస్తవికతనే వెల్లడించింది. అందువల్ల అందులో ప్రస్తావించిన అంశాలకు సంబంధించిన మరికొన్ని కోణాలను నేనే ఇప్పుడు ముందుకు తెస్తున్నాను.

ప్రస్తుత కాలంతో పోలిస్తే గతంలో సాహిత్యం అనేది ఇప్పుడు జీవన సూత్రంగా భావించి దాని చుట్టే తిరిగే లక్షణం ఎక్కువగా వుండేదా? చాగంటి సోమయాజులు–చాసోకు నాటి రచయితలతో కవులతో సాగిన ఉత్తర ప్రత్యుత్తరాలు గమనిస్తే అలాగే అనిపిస్తుంది. దాదాపు యాభై ఏళ్ల పరిధికి సంబంధించిన ఈ లేఖాయనంలో భావి మహాకవుల వేదనలూ వాదనలూ కనిపిస్తాయి. వారు ఆ స్థాయికి రావడానికి ఎంతగా శ్రమించారో ఎన్ని కలలు కన్నారో అర్థమవుతుంది. తద్వారా ఈనాటి కవులు రచయితలు చేయవలసిందేమిటో కూడా తెలుస్తుంది. ఇకపోతే సాహిత్యకారులు ఎప్పుడూ తమ రచనలు వాటి ప్రాచుర్యం గురించే ఆలోచిస్తుంటారన్న వ్యాఖ్య గతానికి కూడా వర్తిస్తుందని ఈ లేఖల సంపుటి మనకు చెబుతుంది. గతంలో ఒకసారి రామతీర్థ వీటిపై పరిచయం లాటిది రాసినట్టున్నారు. చాసో, శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ, ఆరుద్ర, సోమసుందర్, జరుక్ శాస్త్రి లేఖలు ఎక్కువగానూ ప్రభావశీలంగానూ వున్నాయి. కృష్ణశాస్త్రి, పురిపండా అప్పల స్వామి, కొకు, కెవిఆర్, పురాణం, రాంషా, సినారె, అవసరాల వంటి వారి లేఖలు చెదురుమదురుగా వున్నాయి. ఇక మన మధ్య వున్న వారిలో వరవరరావు, రామసూరి వంటి వారి ఉత్తరాలు కనిపిస్తాయి.

మొదటి అసంపూర్ణ ఉత్తరం నారాయణబాబుది. తనకు చాసో ఇచ్చిన సాహిత్య మార్గదర్శనానికి కృతజ్ఞతలు చెబుతున్నట్టు మొదలుపెట్టి రుధిర జ్యోతి గేయాలు పిఠాపురం రాజావారికి వినిపించనుండడం దానికి సఫలతగా రాశాడు. తర్వాతి లేఖ ఢిల్లీలో ఆకాశవాణిలో పనిచేస్తున్న శ్రీశ్రీ రాసింది.


తన అడ్రసు సరిగా రాయలేదని చెప్పడానికి రుచినామా అనే పదం మొదటి పేరాలోనే రాయడం శ్రీశ్రీ చమత్కార సూచిక. మహాప్రస్థానం ముద్రణ ఏ స్థితికి వచ్చిందో తెలియడం లేదని, రంగాచార్యుల గారిని కలుసుకుని విషయ సూచిక జాబితా పంపించేలా చూడాలని చాసోను కోరతాడు శ్రీశ్రీ. అది 1940లో రాసిన లేఖ కనుక మరో పదేళ్లకు గాని ఆ పుస్తకం అచ్చుకాలేదు. అదీ మరొకరి ద్వారా. దూరం నుంచి చూస్తుంటే విజయనగరంలో ఎంత ప్రతిభ వృథా అయిపోతుందో అర్థమవుతున్నదని కూడా కితాబిచ్చాడు. చాసో కథ బాగుందని శ్రీపాద అంచులకు చేరిందని మెచ్చుకుంటూనే చివరలో కథ కంట్రోలు తప్పిపోతొందని హెచ్చరించాడు,

తర్వాతి లేఖ 1941 నారాయణబాబుది. చాసో అనారోగ్యం గురించి పరామర్శిస్తూనే తన బాధలు రాశాడు. కంపెనీ తనను దగా చేసిందని వాపోయాడు. ఆయనే 42లో రాసిన లేఖలో పిఠాపురం రాజా ఆధ్వర్యంలో తెనాలిలో జరగనున్న నవ్య కళాపరిషత్తుకు అధ్యక్షత వహిస్తున్నట్టు రాశారు. చాసో కూడా వచ్చేట్టయితే ఖర్చులు పంపే ఏర్పాటు చేస్తాననీ, ఆ సందర్భంగా వేసే సంకలనంలో ఒక పద్యం ప్రచురిస్తానని ఆఫర్ ఇచ్చాడు. అప్పుడు ఆంధ్ర పత్రికలో వున్న జరుక్‌నాథ శాస్త్రి 1942 అక్టోబరులో రాసిన లేఖలో చాసో కథలను మెచ్చుకుంటూనే తను వున్నన్నాళ్లు ఢోకా లేకుండా వచ్చేట్టు చేస్తాననీ, ఒక వేళ తిరుగుముఖం పడితే మాత్రం చికాకు పడొద్దని కోరుకున్నాడు. మరో రెండు నెలలకు ఆయనే రాసిన లేఖలో మనసు వికలమై వుందని క్షోభలో వున్నానని పేర్కొన్నాడు. ఈ లేఖల క్రమంలో ఆరుద్ర శ్రీశ్రీ నారాయణబాబుల విరసాలు సరసాలు ఆరోపణలు దర్శనమిస్తాయి. నారాయణబాబును శ్రీశ్రీని కలిపి శ్రీరంగం సోదరులు ఇక్కడ వేసవి విహారం చేస్తున్నారని కూడా జరుక్ 1944లో రాశాడు. ఇవన్నీ అయ్యాక 1961 అక్టోబరు2న ఆరుద్ర రాసిన లేఖ నారాయణబాబు మరణవార్త చెబితే మనసు కలుక్కుమంటుంది. పొద్దుట 7.30 గంటలకు



రాయపేట ఆస్పత్రిలో తను చనిపోయాడనీ శ్రీశ్రీ, తానూ, పూసపాటి కృష్ణంరాజు దగ్గరుండి అంత్యక్రియలు చేశామని విషాద వార్త చేరవేశాడు. తర్వాత కాలంలో నారాయణబాబు రుధిర జ్యోతి ఆరుద్ర చొరవతో అచ్చుకావడం, దాన్ని శ్రీశ్రీకి అంకితం ఇవ్వాలన్న అతని కోర్కెకు ఆయన ఆమోదం చెబుతారో లేదోనని సందేహం చాసోకు రాయడం, నారాయణ బాబు కవి గొప్ప కవి అనడానికి కూడా తనకు అభ్యంతరం లేదనీ, ఆద్యుడు అనడంతోనే పేచీ అని శ్రీశ్రీ స్పష్టంగా మరో సందర్భంలో రాయడం ఆసక్తికరమైనవి. నారాయణబాబుని పైకెత్తెస్తే సంంతోషమేననీ, నిజాలు ఎన్ని బయిటపెట్టినా ఇష్టమేగాని ఆరుద్ర పురుగులాగా పనిగట్టుకుని అబద్దాలు ప్రచారం చేయొద్దని' శ్రీశ్రీ 1970లో రాశాడు. నారాయణబాబు నెగిటివ్ అప్రోచ్, ఎక్స్‌ప్రెషన్ అబ్‌స్ట్రాక్ట్‌గా వుండటం వల్లనే శ్రీశ్రీ పైచేయి అయ్యాడని మరో లేఖలో సెట్టి ఈశ్వరరావు విశ్లేషించారు.

శ్రీశ్రీ తొలి ఉత్తరాల్లో తను అస్తిమితంగా వున్నాననీ అంటూనే ఏవో చిన్న చిన్న ఉద్యోగావకాశాల గురించి చెప్పడం, ఆకాశవాణిలో చాసోకు కూడా అవకాశం ఎలా వస్తుందో సూచించడం ఇవన్నీ చూస్తే జీవిక కోసంవారెంత కష్టపడ్డారో కళ్లకు కదుతుంది. విజయ అనే పత్రిక కోసం ఆరుద్రను రమ్మని రాస్తే నెలకు 120 చొప్పున ఏడాదికి 1440 బ్యాంకులో వేస్తే వస్తానని ఒక తేదీలేని లేఖలో రాశాడు. ఈ మొత్తం ఉత్తరాల్లో ఆరుద్ర, సోమసుందర్ రాసినవి చిక్కగానూ వివాదాస్పద విస్పష్ట భావాలతోనూ వుండటం చూస్తాం. శ్రీశ్రీ లేఖల్లో తనదైన భావోద్వేగమూ, భాషోద్రేకమూ, వివాదాస్పద అంశాలపై అనుకున్నది చెప్పేయడమూ గమనిస్తాం. 1970లో తన షష్టిపూర్తికి శ్రీశ్రీ ఆహ్వానించడమూ, తదుపరి విరసం ఏర్పడ్డాక అరసం పునరుద్ధరణ కోసం ప్రయత్నాలూ, ప్రతిపాదనలూ దర్శనమిస్తాయి. అనేక గృహ ఛ్చిద్రాల మధ్య చిక్కుకుని జవాబు రాయలేకపోయాయని 1971లో కూడా కొకు రాశారు. సృజన 1970 పూర్తిగా శ్రీశ్రీ పై వస్తుంది




గనక దానికి ముందు సంచికలో చాసో కథలు ఎక్కువ పేజీలైనా వేస్తామని వరవరరావు రాసిన లేఖ కూడా బావుంది.

ఇప్పుడు మరోసారి నేను మొదలుపెట్టిన ఇతివృత్తంలోకి వస్తాను. ఈ లేఖల్లో సగానికి పైగా ఆయా కవులూ రచయితలూ తమ తమ రచనల గురించీ ప్రచురణ గురించీ రాసినవే. కథ కవిత వచ్చిందనో వస్తుందనో చూసి అభిప్రాయం రాయాలనో అడుగుతుంటారు. లేదా వారే పరోక్షంగా ఆ ప్రస్తావనలు తెస్తుంటారు. తమ తమ రచనా ప్రణాళికలు ఏకరువు పెడుతుంటారు. ఆవిష్కరణలూ సాహిత్య సభల వార్తలు మహోత్సాహంగా వినిపిస్తుంటారు. తెలంగాణలో జరిగిన సభలకు సంబంధించినవి కొన్ని లేఖలున్నాయి. మొత్తంపైన అదో ప్రపంచం.

ఎవరిదాకానో ఎందుకు? చాలా లేఖల్లో చాసో కథలపై స్పందనలు ఆయనకు రాశారు. మెచ్చుకున్న వాళ్ళు, మెచ్చుకుంటూనే మెరగులు సూచించిన వారు లేదా విమర్శించిన వారు వున్నారు. చాసో రాసిన లేడీ కరుణాకరం పాత కథనూ, 1972లో రాసిన చెప్పకు చెప్పకు కథనూ పోల్చి సోసు చేసిన వ్యాఖ్యలు వాటిపై ఆయన సమాధానం కూడా వుంటుంది. ఈ విమర్శలతో సహా తన కథలపై ఏదైనా పత్రికా ముఖంగానే రాయవలసిందిగా చాసో ఆయనను కోరాడు మరో లేఖలో. సంపాదక లేఖలు రాయడానికి ఏదో అడ్డు వస్తోందని సోసు చేసిన వ్యాఖ్యపై ఒకింత కోపంగా స్పందించారు. 'నేను జంక్షనులో బడ్డీ' అన్న కథ జ్యోతి మాసపత్రికలో ప్రచురించినప్పుడు (ఈ మధ్య కాలంలోనే) శ్రీశ్రీ, ఆరుద్ర పాఠకులుగా వారి అభిప్రాయాలు తరువాత నెలలో ప్రచురించారు. నిన్న జ్యోతిబాసు (కమ్యూనిస్టునాయకుడు) ఒక సంపాదకునికి లేఖను స్టేట్స్‌మన్ పాఠకునికి జవాబుగా నాలుగు రోజుల క్రితం అచ్చువేశారు. కథ మీకు ఎలాగ నచ్చలేదో రాయొచ్చు కదా? నేను మెచ్చుకోలు రాయమనలేదే?"


వజ్రహస్తం కథలో కథ వుంది. సరియైనదే. దానికి ఒక కీలకం వుంది. మళ్లా చదివి ఆ కీలకం పట్టుకోండి... వజ్రహస్తం రచయితగా నన్ను సంతృప్తి పరచిన కథ. అందుకే మీ అందరి అభిప్రాయాలు కావాలి. ముఖ్యంగా వ్యతిరేకతతో కూడిన మీ అభిప్రాయమే కావాలి. అందుకే తప్పక రాయండి. మొహమాటపడకండి..." ఇవన్నీ చాసో స్వయానా రాసిన వాక్యాలు. ఆయననూ ఆయన కాలాన్ని, కలం యోధులనూ అర్థం చేసుకోవడానికి అంతరంగాలు అవలోకించడానికి ఈ పుస్తకం గొప్ప సాధనం.

అంటే తమ రచనలపై చర్చ జరగాలనే తపన అప్పటి నుంచి ఇప్పటి వరకూ రచయితలకు ఒకేలా వుంది. కాకపోతే అప్పుడు మీడియా ఇంత విస్తరించలేదు. పుస్తక ప్రచురణ ఇంత సులభం కాదు. కనుకనే మహాకవులు కూడా నానాయాతన పడ్డారు. ఇప్పుడు మనకు రావలసినంత గుర్తింపు లేదా పొగడ్త రాలేదని విచారించే వర్తమానులు గతంలోకి ఒకసారి చూడటం మంచిది మరి! ఈ లేఖలు రాసిన వారు స్పందించిన వారు తమ రచనలపై సమీక్షలు కోరడమే గాక విమర్శలను ఆహ్వానించిన తీరూ, ఇతరులను గౌరవించిన తీరు ఇప్పుడు కొరవడుతున్నదని నిస్సందేహంగా చెప్పొచ్చు. సాహిత్యరంగం విశాల దృక్పథం లేకుండా సజీవం కాదు. ♦

# ప్రజా రంగస్థలం

ఆంగ్ల మూలం: **రోమెన్ రోలాండ్**
తెలుగు: **అనంతలక్ష్మి**
**9491672311**

*ప్రేక్షకులకు వారి నిజ జీవిత అనుభవాలకు భిన్నంగా, అదనంగా ఏమీ అందించకపోతే వినోదం కోసం కాబరేను ఆశ్రయిస్తారు. వారి కష్టాల్ని మరచిపోవడం కోసం వినోదం పేరుతో అవే సంఘటనలను యధాతథంగా రంగస్థలంపై చూపించడం క్రూరమైన విషయం. వీజేల్ తన గుడ్లను తానె తిన్నట్లుగా ఉన్నత వర్గీయులు బాధను దిగమింగటం ద్వారా ఆనందాన్ని పొందుతారు. కాని సామాన్య ప్రజల నుండి అంతటి స్థిత ప్రజ్ఞతను ఆశించలేము.*



**Romain Rolland**
**29.01.1866 - 30.12.1944**

పెట్టుబడి(డబ్బు) సమీకరించబడి, ప్రజలు సిద్ధంగా వున్నప్పుడు రంగస్థలం తన లక్ష్యాలను చేరడానికి (విజయవంతమవ్వడానికి) ఆవశ్యకమైన ఇతర విషయాలేమిటి?

ఏ నియమమూ శాశ్వతమైనది కాదు. అయితె కొన్ని మంచి నియమాలు దీర్ఘకాలం పాటు మనగలగడం వల్ల సమాజంలో ఒక మంచి మార్పు సాధ్యమౌతుందని మనం గమనంలో వుంచుకోవాలి. జనబాహుళ్య కళ కూడా అనివార్యంగా మార్పు చెందుతుంది.

ప్రజా రంగస్థలానికి ఆవశ్యకమైన మొదటి లక్షణం ప్రేక్షకులకు వినోదాన్ని పంచడం. రోజంతా పనితో అలసిన శ్రమజీవులు ఆనందంతో శారీరకంగా, మానసికంగా సేదతీరాలి. శ్రోతలకు బాధ, విసుగు కలిగించకుండా వారికి ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చే విధంగా నాటక రంగాన్ని తీర్చి దిద్దవలసిన గురుతర బాధ్యత నాటక రంగ రూపసశిల్పుల మీద వుంది. ఆధునిక వినోదం పేరుతో స్వార్థపూరిత, తెలివి తక్కువ ఆలోచనతో నీతి మాలిన కళను ప్రోత్సహించినట్లయితే అది ప్రజల మెదళ్ల మీద ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. బాధల బరువుతో కుంగిపోతున్న సగటు జనానికి ఉన్నతవర్గాల వారి బాధలు, సందేహాలు చెప్పి వారిపై మరింత భారాన్ని మోపడం సరికాదు. ప్రజలను బాగా అర్థం చేసుకున్న టాల్‌స్టాయ్ కూడా ఈ తప్పిదానికి అతీతంగా ఉండలేక పోయారు. 'ది పవర్ ఆఫ్ డార్క్ నెస్' లో ఆయన ప్రేక్షకులకు అందించిన మంచి విషయాలకంటే తన అభిప్రాయాలను వారిపై రుద్దాలనే అత్యుత్సాహం ప్రదర్శించి వారిని నిరుత్సాహపరిచారు. ప్రేక్షకులకు వారి నిజ జీవిత అనుభవాలకు భిన్నంగా, అదనంగా ఏమీ అందించకపోతే వినోదం కోసం కాబరే ను ఆశ్రయిస్తారు. వారి కష్టాల్ని మరచిపోవడం కోసం వినోదం పేరుతో అవే సంఘటనలను యధాతథంగా రంగస్థలంపై చూపించడం క్రూరమైన విషయం. వీజేల్ తన గుడ్లను తానె తిన్నట్లుగా ఉన్నత వర్గీయులు బాధను దిగమింగటం ద్వారా ఆనందాన్ని పొందుతారు. కాని సామాన్య ప్రజల నుండి అంతటి స్థిత ప్రజ్ఞతను ఆశించలేము. తమ నిజ జీవితంలో ఎంత అసంతృప్తికి లోనైనా, తమకిష్టం లేని సంఘటనలు ఎన్ని జరిగినా పెద్దగా పట్టించుకోని ప్రేక్షకులు తమ కలల నాయకుడి పట్ల మాత్రం (ఎనలేని విశ్వాసంతో) ఆశావహ దృక్పథంతో వుంటారు. ఒకవేళ నాటక చివరి అంకం విచారకరంగా ముగిస్తే వారు తట్టుకోలేరు. దీని అర్థం కన్నీటి

గాథలన్నింటికీ ఎలాగోలా సంతోషకరమైన ముగింపును ఇవ్వాలని కాదు. అభూత కల్పనలతో కూడి, అత్యంత నాటకీయత కలిగిన నాటకాలన్నీ ప్రజలకు మత్తునిచ్చి, నిద్రవుచ్చే సాధనాలుగా మారి వారిని అనుభూతి రహితులుగాను, స్తబ్దులుగాను చేస్తున్నాయి. కళ వినోద ప్రధానమైనదే కాని అది నైతిక శక్తి స్థానాన్ని అతిక్రమించజాలదు. దీనికి భిన్నంగా మానవుని నైతిక శక్తిని పెంపొందించే వినోదాన్ని కళలు అందించాలి.

రంగస్థలానికి అవశ్యకమైన రెండవ లక్షణం. రంగస్థలం శక్తి(నిచ్చే) కేంద్రంగా వుండాలి. ప్రేక్షకుడ్ని నిరుత్సాహపరిచే, మానసికంగా క్రుంగిపోయేట్లు చేసే వానికి విరుగుడుగా మెదడును ఉద్దీపింప చేసే విషయానికి ప్రాధాన్యత నివ్వాలి. రంగస్థలం పంచే వినోదం ప్రజలు మరుసటిరోజు తమ పనిని రెట్టించిన ఉత్సాహంతో చేసుకోవడానికి సహాయపడాలి. ఒక ఆరోగ్యవంతమైన సగటు మనిషి జీవితకాలం నటన లేకుండా సంపూర్ణం కాదు. రంగస్థలం నటనకు ఒక వేదిక. ప్రేక్షకులు కథా నాయకుడిని తమ జీవిత ప్రయాణ సహచరునిగా భావిస్తారు. అందుకే అతను చురుగ్గా, చతురతతో, ఉల్లాసంగా, నాయకత్వ లక్షణాలతో వుండాలని భావిస్తారు. అతను అందించే హాస్యంతో సేదతీరుతారు. అలసటను మర్చిపోతారు.

ప్రేక్షకులకు అందించవలసిన సందేశాన్ని ఇస్తూనే వారిని వారి గమ్యస్థానాలకు చేర్చవలసిన బాధ్యత వారు తమ సహచరునిగా భావించే నటుడిది. ఇది రంగస్థలానికి ఆవశ్యకమైన మూడవ లక్షణం.

రంగస్థలం మేధో వికాసానికి వెలుగు చూపేదిగా వుండాలి. ఆలోచనా రాహిత్యంతో కుంచించుకు పోయిన మెదడుకు జ్ఞానం అనే కాంతిని ప్రసరింప చేయాలి. రంగస్థలం ప్రతి విషయాన్ని వివరించి చెప్పకుండా ప్రేక్షకుల వివేచనకు (విచక్షణకు) వదిలి వేయాలి. శ్రామికులు తాము పని చేసేటపుడు ఆలోచించలేరు. అందువలన వారి మెదడుకు పని కల్పించే విధంగా విషయాలను చెప్పాలి. వారు ఎంత తక్కువ అవగాహన చేసుకోగలిగినప్పటికీ అది వారికి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. చాలా కాలం క్రియా రహితంగా వున్న మెదడుకు ఒకేసారి పెద్ద పనినిస్తే సగటు మనిషి బాగా సంతృప్తి పొందుతాడు. జరుగుతున్న సంఘటనలను తనకు తానుగా అర్థం చేసుకునేలా, వాటిపై తీర్పునిచ్చేలా ఒక సగటు మనిషి అవగాహనను పెంపొందించడమే రంగస్థల లక్ష్యం.


వినోదం, శక్తి, మేధోవికాసం – ప్రేక్షకులకు అందించడం రంగస్థలం యొక్క ప్రాథమిక ఆవశ్యకాలు. నైతిక ప్రమాణాలు, సామాజిక సంఘీభావం గురించి ఎక్కువగా కలత చెందనవసరం లేదు. శాశ్వత రంగస్థలం వుండి ఎక్కడైతే ప్రజల భావోద్వేగాలు వ్యక్తీకరించాబడటానికి అవకాశముంటుందో అక్కడ కాలక్రమంలో సహోదరత్వం పెరుగుతుంది. నైతిక విద్య స్థానంలో వారికి వినోదాన్ని, మానసిక శక్తిని, మేధో వికాసాన్ని రంగస్థలం అందించినట్లయితే నైతిక ప్రమాణాలు వాటంతటవే పెరుగుతాయి. ప్రజలు స్వభావసిద్ధంగా చెడ్డవాళ్ళు కారు. తమ అజ్ఞానం వల్ల చెడ్డవాళ్ళుగా వున్నారు. అజ్ఞానం వల్ల తికమకతో బాధపడే మెదడులో విజ్ఞానపు వెలుగులను, స్వచ్ఛమైన వాతావరణాన్ని ఒక క్రమ పదతిలో నింపడమే రంగస్థల కర్తవ్యం. ప్రజలను అలోచింపచేయటం, పని చేయించటం (పని నేర్పటం) అనే కర్తవ్యం నిర్వర్తిస్తే చాలు. వారికోసం ఎవరూ ఆలోచించాల్సిన, ఏమీ చేయాల్సిన పని లేదు. నీతి సూత్రాలను ప్రత్యేకంగా బోధించడం వదిలివేయాలి. లేకపోతే ప్రజలు తమ నిజమైన మిత్రులను తిరస్కరించే అవకాశం వుంది.

ప్రజా రంగస్థలం రెండు విషయాలను దూరంగా ఉంచాలి. 1. జీవం లేని నీతి బోధనలను వల్లించడం. 2. ఏదో ఒక విధంగా అనైతిక అంశాల ద్వారానైనా వినోదాన్ని కలిగించడం. అవి ప్రేక్షకులకు నవ్వు తెప్పించినప్పటికీ వారికి పూర్తి సంతృప్తి నివ్వవు. కేవలం నైతిక అంశాల బోధన లేక కేవలం వినోదం మాత్రమే రంగస్థల లక్ష్యం కాదు. నైతికత అనేది మెదడుకు, హృదయానికి సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇవ్వగలిగేదే. అందువలన మానవుల సంపూర్ణ ఆరోగ్యం, ఉల్లాసం కోసం రంగస్థలాన్ని సంపద్వంతం చేయాలి.

ఉల్లాసం– ప్రకృతిలోని అపారమైన శక్తి.. ప్రపంచ గడియారాల ముల్లులను, అంతరిక్ష గోళాలను తిప్పుతుంది .. విత్తనం నుండి పుష్పాలను వికసింపచేస్తుంది.. విశ్వం నుండి సూర్యులను ఉద్భవింప చేస్తుంది. ♦

విశ్లేషణ

# చలం జీవిత కథ




**- మందరపు హైమవతి**
**9441062732**

***చలం అంటే తెలినీ ఈ తరం వారికి ఈ పుస్తకం చలం జీవితాన్ని, సాహిత్యాన్ని పరిచయం చేస్తుంది. తెలుగు సాహిత్యంలో అతని స్థానాన్ని తెలియచెప్తుంది. జీవిత కథను నవలీకరించడం చాలా కష్టం. దానికన్నా నవల రాయడమే తేలిక. తాను ప్రతిపాదించిన స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం వలన చలం జీవితంలో పడిన కష్టాలు, విషాద సంఘటనలు పాఠకుల మనసులో ముద్రపడేలా అక్షరీకరించారు నవీన్. పుస్తకం మొదలు పెట్టిన దగ్గరనుంచి చివరివరకు ఆద్యంతము ఆసక్తి కరంగా చదివిస్తుంది.***

**తు**ఫానులా ముంచెత్తే కోరిక, గోదావరి వరదలాట మోహం, అణచుకోలేని కామం, ప్రాణాన్నైనా ఇవ్వగల స్నేహం, సంప్రదాయాల సంకెళ్ళు తెంచే సాహసంగల స్త్రీ పాత్రలను సృష్టించాడు చలం. సంప్రదాయ ప్రపంచంలో కలవరం రేపాడు. ఇలాంటి చలం జీవిత చరిత్రను "ప్రేమకు ఆవలితీరం" నవలగా చిత్రీకరించారు ప్రముఖ నవలా రచయిత అంపశయ్య నవీన్.


మామూలుగా మనకు కథలు నవలలు, జీవిత చరిత్రలు ఆత్మకథలు పరిచితమే. గాంధీ, నెహ్రూల జీవిత చరిత్రలు, హంపీ నుండి హరప్పాదాకా "కథలు, గాధలు" మొ॥ఆత్మకథలు మనం చదివినవే కానీ ఒక రచయిత జీవితగాథను నవలా వస్తువుగా ఎన్నుకొని గొప్ప సాహసం చేసారు నవీన్ గారు.

తన మొదటినవల 'అంపశయ్య'తో అశేషాంధ్ర పాఠకుల హృదయాల్లో అభిమాన రచయితగా చిరస్థానం సంపాదించుకున్నారు. అదేపేరును ఇంటిపేరు చేసికొని అంపశయ్య నవీన్‌గా పేరుపొందారు.

చలంతో సన్నిహిత పరిచయం వున్నవ్యక్తి నవీన్. ఆయనతో కొంతకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపారు. చలంకి ప్రశ్నలు పంపించి మొట్టమొదటిసారి సమగ్రమైన ఇంటర్వ్యూ చేసారు. నవీన్ పంపించిన ప్రశ్నలను చదివి తను చాలా ఎక్సైట్ అయిపోయాననీ చలాన్ని ఇంత బాగా అర్థం చేసుకొన్న వాళ్ళు ఆంధ్రదేశంలో చాలా తక్కువగానే ఉన్నారని అంటూ నవీన్ ప్రశ్నలకు చక్కని సమాధానాలు రాసి పంపించారు చలం.

నవీన్ డిగ్రీ విద్యార్థిగా ఉన్నప్పటినుంచి చలం సాహిత్యాన్ని చదివారు. గొర్రెపాటి వెంకట సుబ్బయ్యతో మొదలెట్టి ఆర్.ఎస్.సుదర్శనం, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, కె.ఎస్.రమణ, వావిలాల సుబ్బారావు, వాగ్దేవు వీరలక్ష్మి దేవి తదితర ఎందరో రచయితలు చలం జీవితాన్ని గూర్చి, సాహిత్యాన్ని గురించి రాసిన పుస్తకాలన్నీ చదివారు. చలం, చింతాదీక్షితులుగారితో పాటు ఎంతోమందికి రాసిన ఉత్తరాలను చదివారు. ఈ పుస్తకాలన్నీ చదివాక చలం జీవితాన్ని గురించిన ఒక సమగ్ర స్వరూపం ఆయనకు దర్శనమయింది. అప్పుడు గానీ రచయిత చలం జీవితాత్మక నవలను రాయడం ప్రారంభించలేదు.

నవల వేరు జీవితకథ వేరు. జీవితకథలో తారీఖులు సంఘటనలు వుంటాయి. కానీ నవలలో పాత్రలు, సంభాషణలు ఉంటాయి. నవలకు జీవిత కథకన్నా చదివించే శక్తి ఎక్కువ వుంటుంది. ఈ నవలను ఒక సారి రాస్తే రచయితకు తృప్తి కలగలేదు. రెండవసారి రాసారు. అప్పుడు నవల వ్రాత ప్రతిని చలం అభిమాని వావిలాల సుబ్బారావు గార్కి పంపించారు. ఆయన చదివి కొన్ని సూచనలు, సవరణలు చేసి పంపించారు. చలం గారు రమణాశ్రమం వెళ్ళాక గడిపిన ఆధ్యాత్మిక జీవితాన్ని రాస్తారా అని రచయిత



సుబ్బారావు గార్ని అడిగితే దాన్ని గూడా తననే రాయమన్నారని నవీన్ గారు అంటారు. ఎన్నో నవలలను అలవోకగా రాసిన నవీన్‌గారు 3,4 ఏళ్ళు ఎంతో శ్రమించి ఈ నవలను పూర్తి చేసారు.

ఈ నవలలో చలం జీవితాన్ని, సాహిత్యాన్ని సమగ్రంగా, కూలంకుషంగా విశ్లేషించారు రచయిత. చలం ప్రతిపాదించింది స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం. స్త్రీ పురుషులిద్దరూ ఒకర్నొకరు ఇష్టపడి శృంగారంలో పాల్గొంటే తప్పులేదని నేననుకొంటున్నాను అంటాడు చలం.

ఈ కేంద్రబిందువు చుట్టూ చలం రచనలన్నీ పరిభ్రమిస్తుంటాయి. మైదానం, అరుణ, అమీనా, జీవితాదర్శం మొ॥ నవలలు, కథలు, నాటకాలు అన్నీ స్త్రీ స్వేచ్ఛ కోసం పరితపించి, రాసినవే. శశిరేఖ, రాజేశ్వరి, అమీనా, అరుణ లాంటి భావోద్వేగాల పాత్రలను సృష్టించాడన్నా, పురూరవ, మొ॥ నాటకాలు రచించాడన్నా తన జీవితంలో తనను అమితంగా ప్రభావం చేసిన స్త్రీలే కారణం.

స్త్రీలు, పురుషులు స్వేచ్ఛగా ఎవరికిష్టమైనట్లుగా వాళ్ళు జీవించాలని చలం అన్నాడు. ఈ సిద్ధాంతాన్ని పట్టుకొని అతని జీవితంలో రత్నమ్మ, లీల, సుమతి తదితరులు ప్రవేశిస్తారు. రంగనాయకమ్మ అంటే తన భార్య రంగనాయకమ్మ అక్కను మాత్రం తానే, ప్రేమిస్తాడు. చలానికి చిన్నప్పటినుంచీ స్నేహితురాళ్ళు ఎక్కువ. స్నేహితులు వుండరు.

చలం ప్రతిపాదించిన స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాన్ని నమ్మి రత్నమ్మ చలంతో, రామ్మూర్తితో ఇద్దరితో ప్రేమ వ్యవహారం కొనసాగిస్తుంది. ఆ తర్వాత సుబ్రహ్మణ్యం అనే అబ్బాయిని పెళ్ళి చేసుకొంటుంది. రామ్మూర్తి రత్నమ్మ పెళ్ళి చేసికొవడాన్ని తట్టుకోలేక పోతాడు. ఆత్మహత్య చేసుకొంటాడు.

రామూర్తి మరణం తర్వాతే చలం 'శశిరేఖ' నవల రాస్తాడు ఈ నవలలో స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం వుంది. ఈ నవలలో శశిరేఖ పాత్రకు రత్నమ్మే ఆధారమని చాలామంది విమర్శకులు అభిప్రాయపడతారు.

చలం అనగానే 'స్త్రీ' గుర్తుకు వస్తుంది. "స్త్రీకి కూడా శరీరం వుంది" అన్న మాటలు ఈ పుస్తకంలోవే. స్త్రీ నీతి, బడిచదువులు, స్త్రీ స్వేచ్ఛ, వివాహబంధం తదితర విషయాల గురించి ఈ పుస్తకంలో ఎన్నో వ్యాసాలున్నాయి.

ఈ పుస్తకాన్ని స్త్రీలకు అంకితమిస్తూ "నాకు ఒక్క నిమిషం విశ్రాంతి నివ్వకుండా మహాప్రణయ మారుత వేగం మీదనో, అగాధ వియోగ భారం కిందనో పీల్చి, నలిపి, ఊపిరాడనీక నా జీవితాన్ని పాలించే స్త్రీలోకానికి నివేదితము" అంటాడు చలం.

చలం అనగానే మనసులో తళుక్కున మెరిసే నవల మైదానం. ఆంధ్రా యూనివర్శిటీ నవలల పోటీపెట్టినపుడు పోటీకి పంపిన నవల అది ఆపోటీలో విశ్వనాథ వేయిపడగల'కు అడవి బాపిరాజు 'నారాయణరావు'కు బహుమతులు వస్తాయి. మైదానంలో నాయిక రాజేశ్వరి తనకు శారీరక సుఖం ఇవ్వని భర్తను వదిలేసి తనకు నచ్చిన ఒక ముస్లిం యువకుడితో వెళ్ళిపోతుంది. అతనితో తాను కోరుకొన్న జీవితాన్ని స్వేచ్ఛగా అనుభవిస్తుంది.

ఈ నవల ఒక పత్రికలో సీరియల్‌గా వస్తున్న రోజుల్లో కొందరు సంప్రదాయవాదులు. ఆ నవలను అలాగే కొనసాగిస్తే సంపాదకుణ్ణి చంపుతామని బెదిరించారు. ఈ నవల ఆనాటి సమాజంలో ఎంతో సంచలనాన్ని కలిగించింది.

నవలలు, కథలే కాకుండా ప్రేమలేఖలు, బిడ్డల శిక్షణ, పూరూరవ, సావిత్రి మొ॥ నాటకాలు రాసాడు చలం.

చలం జీవితాన్ని ప్రభావితం చేసిన వారిలో రత్నమ్మ రంగనాయకమ్మ (తన భార్య అక్క, వొయ్యి) లీల ముఖ్యులు, రత్నమ్మ తనను ఇష్టపడి నందుకు ఆమెతో శృంగార జీవితం గడుపుతాడు ఈ విషయాన్ని చలం భార్యకు చెప్పినపుడు చాలా బాధపడుతుంది. రత్నమ్మతో తెగతెంపులు చేసికోకపోతే ఇంట్లో నుంచి వెళిపోతా నంటుంది.

ఒక వొయ్యి అంటే తన భార్య అక్క, ఆమె బాలవితంతువు. చలం దగ్గరకు వచ్చి తనను డాక్టరు చదివించమంటుంది. అప్పుడు చలం ఆమెను చదివిస్తాడు. డాక్టరును చేస్తాడు. ఈ సందర్భంలో ఆమెను ప్రేమిస్తాడు. ఆమెను వదిన అని పిలవకుండా వొయ్యి అని పిలుస్తాడు. ఆమె దూరంగా వున్నపుడు ఆమెకు ప్రేమ లేఖలు రాస్తాడు.

'ప్రేమ లేఖలు'లో లేఖలు వొయ్యికో ఇంకెవరికో రాసిన లేఖలు.

"ప్రియురాలు దగ్గర లేనప్పుడు ఆమెతో ఇంటి మేట్‌గా మాట్లాడటమే ప్రేమలేఖ".

"కాళిదాసు మేఘసందేశం ప్రేమలేఖలు కాక ఇంకేమిటి? ఆ కవి హృదయంలో ఎంత విరహవేదన లేనిది ఆ కావ్యం

రాసివుంటాడా? ఆదర్శమైన ప్రేమలో వ్యక్తిత్వమే నశించాలి. నేను నువ్వు అనే భావమే అదృశ్యం కావాలి. అంటాడు.

చిత్రాంగి, సావిత్రి, పురూరవ తదితర నాటకాలను హేతువాద దృక్పథంతో, కొత్తగా రాస్తాడు.

చలం రమణ మహర్షి ఆశ్రమానికి వెళ్ళివస్తాడు. ఆ ప్రభావంతో స్త్రీ సాంగత్యాన్ని తగ్గించు కొంటాడు. ఆ సమయంలో లీల అతని జీవితంలో ప్రవేశిస్తుంది. మళ్ళీ ప్రణయవాంఛలు రేకెత్తిస్తుంది. కొంతకాలానికి అతని జీవితంలో నుంచి వెళ్ళిపోతుంది. ఆ రోజుల్లోనే పురూరవ. అనే నాటకం రాసాడు చలం. ఈ నాటక రచనలో చలం లీలతో గడిపిన శృంగార జీవిత ప్రభావం వుంది.

'పురూరవ' శృంగారరస పరాకాష్ఠ. స్త్రీ పురుషుడు ఐక్యమై పోయిన అద్వైతం అని నవలా రచయిత నవీన్ గారంటారు.

'బిడ్డల శిక్షణ' పిల్లల్ని ఎలా పెంచాలో రాసిన పుస్తకం చలం స్నేహితుడు దీక్షితులు చలాన్ని మొట్టమొదట రమణాశ్రమంలోకి తీసుకు వెళ్తాడు. కొంత కాలంతర్వాత అక్కణ్ణుంచి వచ్చేస్తాడు. ఆ తర్వాత భార్య మరణిస్తుంది. వొయ్యి తనువు చాలిస్తుంది. చివరకు మళ్ళీ రమణ మహర్షి దగ్గరకే వెళ్తాడు. అక్కడ ఆయన 'సుధ' "యవోదా గీతాలు", భగవాన్ పాదాల ముందు" "మార్తా" 'భగవద్గీత వ్యాఖ్యానం' వంటి భక్తి రస గ్రంథాలు రాసాడు.

ఈ చలం రచనల లన్నిటిల్లో పాఠకుల్ని ఉద్విగ్న భరితుల్ని చేసే పుస్తకం మ్యూజింగ్స్. కవితాత్మకశైలి, ప్రవాహంలాగాసాగే వాక్యనిర్మాణం మొదలుపెట్టిన దగ్గర నుంచి చివరి వరకు చదివించే అద్భుతమైన రచన.

చలం పుట్టుకనుంచి మరణం దాకా చలం జీవితంలోని ముఖ్య సంఘటనలను అతణ్ణి ప్రభావితం చేసిన వ్యక్తులను చక్కగా అక్షరచిత్రాల్లో ఆ విష్కరిస్తారు నవీన్‌గారు. సరళమైన శైలిలో చివరికంటా చదివింప చేస్తుంది ఈ నవల.

చలం రాసిన పుస్తకాల గురించి, తెలుగు సాహిత్యంలో ఆ పుస్తకాలు కలిగించిన ప్రభావం గురించి విశ్లేషించిన తీరు ఆసక్తికరం.

చలాన్ని ప్రభావితం చేసిన రాసెల్, బెర్నార్డ్‌షా, ఇబ్సన్, మేటర్ మొపాసాల గురించి, వారి ఆలోచనా విధానం, సంప్రదాయ సమాజాన్ని మార్చాలని వారు చేసే ప్రయత్నాల గురించి వివరించారు. ఒకవైపు హేతువాదం, మరోవైపు ఈ మిస్టిసిజమ్ ఈ రెండు విరుద్ధ శక్తులు చలంలో సంఘర్షిస్తునే వున్నాయని అంటారు.

చలం కూతురు చంపకను ప్రేమించిన వజీరు రెహమాన్ "ఎంత అందమో నీ కళ్ళు। నా ముద్దుల భారంతో। తడియారని మైకంలో వొణికినప్పుడు" అని రాసిన కవిత్వాన్ని చదువు తున్నపుడు పాఠకులు పరవశాల ఊయలలో ఊగుతూ పరవశిస్తారు.

ఈ నవలలో నాటకీయత అంతర్లీనంగా పరిమళిస్తుంది. లీల చలం, రత్నమ్మ, చలం, రంగనాయకమ్మల సంభాషణలు చదువుతున్నపుడు నాటకంలో పాత్రలు కళ్ళకు కన్పిస్తున్నట్లనిపిస్తాయి. చలంపై బ్రహ్మ సమాజ ప్రభావం. చలం సమకాలికులు కృష్ణశాస్త్రి, దీక్షితులు, రామ్మూర్తి, రఘుపతి వెంకటర్నం నాయుడు మొ॥ పాత్రలతో ఆనాటి ప్రపంచంలో విహరించిన అనుభూతి కలుగుతుంది.

స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన చలం అలాగే జీవించాడు. దాని వలన వచ్చిన కష్టనష్టాలను అనుభవించాడు. స్త్రీ కానీ, పురుషుడు కానీ తాను కొరుకొన్న వాళ్ళతో కలసి జీవించడం వినడానికి బాగున్నా వాస్తవ జీవనంలో ఆచరణ అసాధ్యం.

ఈ సిద్ధాంతంలో బలి అయ్యేది భార్య మాత్రమే. చలం జీవితంలో అదే జరిగింది. చలంతో ప్రణయ జీవితాన్ని గడిపిన రత్నమ్మ, వొయ్యి, లీల ఆనందించారు. కానీ క్షణక్షణం నరకాన్ని అనుభవించింది భార్య రంగనాయకమ్మ.

ఎవరైనా తన భర్త తనకు మాత్రమే సొంతం. పరాయి వాళ్ళవైపు కన్నెత్తి కూడ చూడగూడ దనుకొంటారు. తద్భిన్నంగా ప్రవర్తిస్తే ఏ కాలంలోనూ తట్టుకోలేరు. దానికి ఉదాహరణగా భర్త చేష్టలకు మతి చలించింది ఆమెకు.

ఏది ఏమైనా స్త్రీలంటే అమితమైన ప్రేమతో స్త్రీల కోసం తపించి జీవించి, ఎన్నో అపురూప పుస్తకాలు రచించిన చలం స్థానం తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ అచంచలం.

ఈ నవలలో చలం జీవితంలో జరిగిన కొన్ని ముఖ్యమైన యథార్థ సంఘటనలు మాత్రమే చిత్రింప బడ్డాయి. ఆయన జీవితాన్ని పంచుకొన్న కొందరు యథార్థ వ్యక్తులే, ఈ నవలలో పాత్రలుగా కనబడతారు.

ఈ నవల చదివిన వాళ్ళకు చలం తన ఆత్మకథ రాసు కున్నాడుకదా. ఇంకా ఈ నవల ఎందుకు అని సందేహం వస్తుంది. నవల వేరు ఆత్మకథ వేరు. ఈ నవల చదివిన వాళ్ళకు చలం అంటే ఎవరో ఆయన వ్యక్తిత్వం ఆయన సిద్ధాంతాలు, ఆయన జీవన విధానం కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది.

ప్రేమకు ఆవలితీరం చదివాక చలం చెప్పిన స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం పాఠకులకు అవగతమవుతుంది. ఆ నవల

స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంత మంటే ఏమిటి? అని చలాన్ని అడిగినపుడు.

స్త్రీ పురుషులు స్వేచ్ఛగా ప్రేమించుకోవాలి. ఒక స్త్రీ ఒకే పురుషునితో జీవితాంతం ఉండిపోవాలనటం ఒక పురుషుడు ఒకే స్త్రీతో శాశ్వతంగా ఉండిపోవాలనటం చాలా పెద్ద తప్పు. వివాహంతో సంబంధం లేకుండా స్త్రీ పురుషులు ప్రేమించుకోవాలి. ప్రేమ, స్వేచ్ఛ ఇవే ముఖ్యమైనవి. ఒక స్త్రీ ఒక పురుషుణ్ణి ప్రేమించిందను కొండి ఆ పురుషుడు కూడా ఆ స్త్రీని ప్రేమించాడను కొండి. వాళ్ళిద్దరు వేరుగా కలిసుండొచ్చు కొంత కాలం తర్వాత వాళ్ళ మధ్య ప్రేమ అంతరించిందనుకొండి. వాళ్ళకు విడిపోయే స్వేచ్ఛ వుండాలి. అలాగే ఒక స్త్రీ లేక పురుషుడు ఒకేసారి ఇద్దరి ముగ్గురి ప్రేమలో పడిపోయాడనుకొండి. ఆ ఇద్దరి ముగ్గురితో కూడా శృంగార సుఖం అనుభవించే స్వేచ్ఛ వాళ్ళకుండాలి" అంటాడు.

చలం రాసిన 'అరుణ' నవలలో ఈ స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం కనిపిస్తుంది. ఈ నవలలో అరుణ చుట్టూ ఆమె ప్రియులు పీటర్, బీస్ట్, నాగన్, రచయిత తిరగటం అకస్మాత్తుగా వాళ్ళ మధ్యకు అరుణ భర్త జయంరావు రావడం చిత్రించబడింది.

ఈ నవలా చిత్రణకు కారణం వాస్తవ జీవనమే అంతకుముందు రత్నమ్మ కేంద్రంగా చలం, రామ్మూర్తి, ప్రకాశం, కృష్ణ శాస్త్రి తిరుగుతారు. వాళ్ళ మధ్యలో సత్యవతి భర్త ప్రకాశం ఉండటం ఈ వాతావరణాన్నే చలం అరుణలో చిత్రించాడు.

రచయితల్లో రెండు రకాలు ఉంటారు. రచన వేరు, జీవితం వేరుగా జీవిస్తారు కొందరు. కొందరికి రచన, జీవితం ఒకటే, తన రచనల్లో దేనినైతే ప్రతిపాదిస్తారో అలాగే జీవిస్తారు. అలాంటి రచయిత చలం.

చలం తనరచల్లో స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. జీవితంలో గూడ అలాగే ప్రవర్తించారు. రత్నమ్మను రామ్మూర్తి, చలం ఇద్దరూ ప్రేమించారు. ఇద్దరూ ఆమెతో శృంగార జీవితం గడుపుతారు. లీల, వొయ్యి, సుశీలలతో ప్రణయ జీవితాన్ని అనుభవిస్తాడు.

చలం బ్రహ్మ సమాజంలో సభ్యుడయ్యాక మెడలో జంధ్యం తీసిపారేస్తాడు. చేపలు తింటాడు. భార్య రంగనాయకమ్మ కూడా మెడలో మంగళసూత్రం తీసేస్తుంది. చలం ఆచార వ్యవహారాలు చూసి ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతాలు విని, ఆయన జీవన విధానం చూసి ఆంధ్రదేశంలో ఎవరూ ఆయనకు అద్దెకుండటానికి ఇల్లు ఇవ్వరు. ఊరికి దూరంగా ఎక్కడో ఆయన కుటుంబం ఉండేది.

సంఘం ఇలా తనను అవమాన పరచినా కొంచెం కూడా భయపడడు. గోదావరి ఒడ్డున ఒక జాలరి పాకను అద్దెకు తీసుకొని వుంటాడు దానికి 'వచ్చపాముపాక' అనిపేరుపెడతాడు. రత్నమ్మ, వొయ్యి, లీల అందరితో ఆపాకలో గడుపుతాడు చలం.

చలం తెలుగు సాహిత్యంలో ప్రవేశించక ముందు కేవలం నాలుగ్గోడల మధ్య వస్తువుల మధ్య వస్తువులా వుండేది స్త్రీ పాత్రలు, పిల్లల్ని కంటూ, వాళ్ళు ఏడ్చినపుడు కొడుతూ హింసిస్తూ, వంటచేస్తూ, రాత్రి కాగానే మల్లెపూలు పెట్టుకొని భర్త వాంఛలు తీర్చే స్త్రీలే కనిపించేవారు. ఏ భావమూలేని రాతిముఖాలు ప్రాణంలేని బొమ్మలు.

కానీ చలం ప్రవేశంతో తనకు ఆనందం ఇవ్వని ప్లీడరు భర్తను, తనకు భద్రత ఇచ్చే నాలుగుగోడల పంజరాన్ని వదిలి పెట్టి తనను ప్రేమించే అమీర్ కోసం బయటకు వచ్చే రాజేశ్వరి, వివాహ వ్యవస్థలో ఇమడలేని శశిరేఖ, ప్రియుల మధ్య స్వేచ్ఛగా తిరిగే అరుణలు కన్పిస్తారు. సంప్రదాయాల కోసం ప్రాణం పెట్టే సమాజాన్ని కుదుపు కుదుపుతారు. ఉక్కిరి బిక్కిరి చేస్తారు. కొన్ని మాటలు అనడమే అపవిత్రత, కొన్ని వాక్యాలు రాయడమే బరితెగించడం అని సంప్రదాయ సమాజం నిషేధాలు విధించిన చోట, ఇరుకు మనస్తత్వాలతో మురికి కంపుకొట్టే కుళ్ళిపోయిన సమాజంలో స్వేచ్ఛా భావనలు ప్రవేశపెట్టి ఎప్పుడూ గలగలా ప్రవహించే నదులతో ధారాళంగా వీచే చల్లని గాలులతో మనసుకు ఆనందంకలిగించే 'మైదానం' సృష్టించి తెలుగు పాఠకులు "ఎరగని స్వేచ్ఛా ప్రపంచానికి తలుపులు తీసాడు చలం. అచ్చమైన ప్రేమకోసం, శృంగారం కోసం జీవిత మంతా పరితపించాడు. చలం వస్తువుకు తోడు అతని శైలి అద్భుతం, అనుకరణీయం ఊపిరి సలపనీయని వాక్య విన్యాసం, కొండ మీద నుంచి దూకే జలపాతం లాంటి అనితర సాధ్యమైనశైలి చదవడం మొదలుపెట్టగానే ఒక పారవశ్యంలో తడిసిపోతాడు. ఒక మాధుర్య ప్రవాహంలో మునిగిపోతాడు. అలైకికమైన ఆనందలోకాల్లో విహరిస్తాడు. మనసులో వేలవేల సీతాకోక చిలుకలు ఎగురుతున్న దృశ్యాలు ఆవిష్కృతమౌతాయి.

"నిన్ను చూస్తుంటే... నీ మాటలు వింటుంటే నా కళ్ళు మిరుమిట్లు కొల్పుతున్నాయి. ఏదో మధుర సంగీతం వింటున్నట్లుగా వుంది. ఎంత కాలానికి కన్పించావు నువ్వు నువ్వు ఇంతకాలం కనబడలేదు కానీ నువ్వునాకు చిరపరిచయువు. నీ రూపమగోచరం. నీ స్వభావం మనోభావానికతీత కానీ నీ కన్న నాకు హృదయాను

## కవిత

# రక్తం కురుస్తున్న ఆకాశం

- యామినీదేవి కోడే
9492806520



చీర కడితే సొల్లు కార్చే
కొన్ని చిత్తకార్తెలుంటాయని విన్నాం అప్పుడు
గౌను తొడగడం రాని పసితనాన్ని
కాటువేసే కాలనాగులున్నాయి ఇప్పుడు..!!
రేగిన హార్మోన్లను అణిచేయక ఉద్రేకాన్నీ వెదజల్లుతూ
ఉప్పెనలా మారి దేహాల దాహం తీర్చుకునేందుకకు
అబలలను ఎంచుకుంటున్న ఈ కలియుగ కీచకుల్ని
నరకాలని నరనరాలూ ఉద్వేగడుతున్నాయి
పసిపాపల చిరునవ్వు మసకబారడం చూసాక
హృదయం ఆక్రోశిస్తూ..
అగ్ని జ్వాలతో దహింప చేయాలనే ఆరాటం
అధికమయ్యి ఘటన తెలిసి
"కళ్ళు కన్నీరు కార్చడం మానేసి రక్తం కురుస్తున్నాయి"
ఆకాశపు నుదుటి ఎర్రబొట్లు
ఇప్పుడు నా రెండు కళ్లలోనూ మండుతున్నాయి
మగాడివెలా అవుతావు మృగాడిలా మారాక..
మగతనమంటే శరీరంలోని అంగమని..
ఆ అంగపు గట్టితనమని..
భ్రమలో పడకు
నీ పశుత్వానికి చిహ్నమయిన ఆ అంగాన్ని నువ్వే నరికేసుకో..
కనీసం మనిషిగా అయినా మిగులుతావు
నువ్వు పక్కింటి అన్నవనీ,
ఎదురింటి పెదనాన్నవనీ..
వెనుకింటి తాతయ్యవనీ కదా
ఆ పాలుకారే పసినవ్వులు నిన్ను నమ్మి వచ్చేదీ..??
మరెందుకిలా..!!
వికారపు మనసుతో వికృతపు చేష్టలతో
ఈ ఆకృత్యాలకు మూలం అవుతావు
బోసినవ్వుల జీవితాలకు కాలనాగువౌతావు
రేగిన నీ కోర్కెల తీర్చుకోడానికి
మనసుల్ని, మనుషుల్ని పిండేస్తావే
ఆడతన్నాన్ని లోకువగా చూసి పాశవికతతో నీవు
చిదిమేసిన ఆ జీవితాలలో నవ్వులు ఎవరిస్తారు

కామం తీరడం కోసం, తీర్చుకోవడం కోసం
పశువులా మారకు
ప్రమాదంలో పడతావ్
మనసుని మంచిగా మలుచుకో
మనిషిగా మిగులుతావు
లేకుంటే..
ఆకాశం వర్షించడం వదిలేసి రక్త కన్నీరు కురుస్తుంది ♦

---

గతమేదీలేదు. నీ నామ మనుశృతం కలలోవిన్న గానం వలె ప్రతినిమిషమూ నా చెవుల్లో నీ మాటల సవ్వడి ధ్వనిస్తోంది. నా వైపు వెతుకుతూ వచ్చే నీ అడుగుల చప్పుడు నా హృదయంలో ప్రతినిమిషం ప్రతిధ్వనిస్తుంది. నువ్వు నా పరమావదివి" కవిత్వం పరిమళించే ఈ శైలికి మంత్రముగ్ధులు కాని వారెవరుంటారు.

చలం అంటే తెలిసీ ఈ తరం వారికి ఈ పుస్తకం చలం జీవితాన్ని, సాహిత్యాన్ని పరిచయం చేస్తుంది. తెలుగు సాహిత్యంలో అతని స్థానాన్ని తెలియచెప్తుంది. జీవిత కథను నవలీకరించడం చాలా కష్టం. దానికన్నా నవల రాయడమే తేలిక. తాను ప్రతిపాదించిన స్వేచ్ఛా ప్రణయ సిద్ధాంతం వలన చలం జీవితంలో పడిన కష్టాలు, విషాద సంఘటనలు పాఠకుల మనసులో ముద్రపడేలా అక్షరీకరించారు నవీన్. పుస్తకం మొదలు పెట్టిన దగ్గరనుంచి చివరివరకు ఆద్యంతము ఆసక్తి కరంగా చదివిస్తుంది. ఈ పుస్తకానికి ముఖచిత్రంగా చిరునవ్వుల వెన్నెలలు చిందించే చలం చిత్రం చలం అభిమానులను అలరిస్తుంది.

ఒక ప్రఖ్యాత రచయిత జీవిత చరిత్రను నవలీకరించి తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ప్రయత్నం చేసి సఫలీకృతులయ్యారు రచయిత. చలం పాఠకులకు, అభిమానులకు ఒక వెలలేని ప్రేమ కానుక **'ప్రేమకు ఆవలి తీరం'.** ♦

## అరుదైన చిత్రకారిణి



- జంధ్యాల రఘుబాబు
9849753298

నా కవితకీ నా కథకీ
వెనుక ఉంది ఆమే

నా ప్రతి కదలికకీ
వెనుక న్యూరాన్ శక్తి ఆమే
నే చేసే పనులకి మూలాధారం
నా సర్వశక్తులకు
నా శరీరంలోని మైటోకాండ్రియా ఆమే
జన్మనిచ్చిన అమ్మే

ఊరకే గాలికి కొట్టుకుపోయే
మేఘంలా కాక
నీటిని తీసుకుపోయే
రుతుపవనంలా నన్ను మార్చింది ఆమే

ఊపునిచ్చే ఉత్సాహానికి
ఊరటనిచ్చే ఓదార్పుకి
మనుగడకవసరమైన సంకల్పానికి
క్రియారూపం సదా ఆమే

జనాంతికమైన రూపుదాల్చని
నా ఆలోచనలకి
శిల్పాకృతినిచ్చే ఉలి ఆమే
నన్నో సప్తవర్ణాల చిత్రంగా గీచిన
అరుదైన చిత్రకారిణి ఆమే

నాలో సగం ఆమే
తనలో సంపూర్ణం ఆమే
సర్వాంతరయామిని నమ్మని నాకు
సదా నమ్మకానిచ్చే
నిరంతర్యామిని ఆమే
విశ్వకణం ఆమే
విశ్వానిక్కారణం ఆమే

నేను పైకి కనిపించే
ఒక ఇల్యూజన్ని మాత్రమే
నా రూపానిక్కారణమైన
శక్తిపుంజం ఎప్పుడూ ఆమే ❖

## నిశ్శబ్ద యుద్ధం..

- కెంగార మోహన్
94933754470




చరిత్ర తిరగరాయాలంటే
ఎన్ని గాయాలు పదునెక్కాలి
మరెన్ని సంగ్రామాలు
కాలానికి సాక్ష్యం కావాలి
నాల్గు కాగితాల సాక్షిగా
కాలం కాన్వాసుపై నెత్తుటి మరకలంటడం కాదు
లక్షల గొంతుకలు తెగిపడ్డం కానే కాదు
నాది మారుతున్న చరిత్ర
గతిని స్థితిని మారుస్తున్న చరిత్ర
మనువు రాతల్ని
ఎడంకాలితో తొక్కే ఆధునిక చరిత్ర
ఏ శంభూకుడు కదనరంగంలో కురికురికి
పోరుచేయాల్సిన పనిలేదు
ఏ అశోకుడు ధర్మ పరిత్యాగ మొనర్చాల్సిన పనిలేదు
ఏ పాశుపతాస్త్రంతో దండెత్తాల్సిన
ఆగత్యం లేదు
ఏ పాలకుల దుర్నీతి చట్టాలు రాసి
తూట్లు పొడవాల్సిన పనిలేదు
పరశురాముడి గండ్రగొడ్డలి
ఏకలవ్యుడి బాణం
ఇవేవి అక్కర్లేదు
నేనిపుడు అక్షరంతోనే తిరగబడతాను
కులహంకార పొగరుబోతు తనానికి
డప్పుగొట్టి మరీ చితిని పేరుస్తాను
జాతి జాతంతా
ఊర్లకు ఊర్లంతా ఉప్పెనై
విరచుకుపడి చీకటి స్వరాలై ఘర్జించి
వెలుతురు నింపి
వెలుగులు జిమ్మే దివిటీలై మున్ముందుకు సాగుతాం ❖



# 'అల'ల సవ్వడి

- రత్నాల బాలకృష్ణ
9440143488



*కవి అయినవాడు కవితా సృష్టికర్తే కాక ద్రష్టకూడా. అంటే భూత, వర్తమానకాలాలలోని మంచి చెడులను బేరీజు వేసి సరికొత్త దృష్టితో నవ్య లోకాన్ని స్వప్నిస్తాడు. సృజనాత్మక శిల్పిగా మారతాడు, వస్తువు చుట్టూ తిరగకుండా వస్తువులోనికి ప్రవహించి సత్యాన్వేషణ సాగిస్తాడు. తనదైన ఊనికతో, లయాత్మక పదాల మేళవింపుతో కావ్యసృష్టిని చేస్తాడు. ఈ లక్షణాలన్నీ 'అల' రచించిన నిప్పులవాగు, మట్టిచెట్టు పిట్టబజనిక, అలల సవ్వడి కవితా సంపుటిలో అద్భుతంగా ప్రతిబింబింపజేసాడు.*

ఒక తాత్విక చైతన్యంతో కవిత్వాన్ని వాహికగా చేసుకొని సమాజంలోని అసమానమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ ఘటనలపై తీవ్ర భావావేశాన్ని ప్రదర్శించిన కవి 'అల'. తను జీవించిన సమాజ పరిధి ఎంత విస్తృతి ఉందో అంత కవిత్వ విస్తృతిని పెంచి దానికి దార్శనికత, సృజనాత్మక భావ చైతన్యాన్ని జోడించి అక్షరంతోనే నిరంతరం మనిషి నుండి మనిషికి ప్రహించాలని పరితపించాడు. తన చుట్టూ జరుగుతున్న అనేకానేక సంఘటనల పట్ల ఆగ్రహం కలగినప్పుడో, దుఃఖం వచ్చినప్పుడో, భావోద్వేగాలకు లోనైనప్పుడో కవిత్వ రచన చేసాడు. కొన్ని చారిత్రక సంఘటనలు, రాజ్యం, మతం, అసమానతలు మానవ జీవితాల్ని ఎలా కల్లోలపరుస్తున్నాయో తన రచనలలో తెలియజేసాడు.

కవన్నవాడు నిన్నలోని కష్టనష్టాల అనుభవాల ఆధారాలమీద, నేడు నడుస్తున్న సాంఘిక వ్యావహారిక ధోరణులలో కనిపించే వక్రమార్గాల సాక్ష్యాల మీద మానసిక ఘర్షణ పొంది రేపటి గురించి కలలు కంటాడు. ప్రజలకు ముఖ్యంగా రైతులకు, వృత్తులు కోల్పోయి దుర్భర జీవితాన్ననుభవిస్తున్న కష్టజీవులకు, ఆర్తులకు, దీనులకు బంగారు భవిష్యత్తు కల్పన చేసే జిజ్ఞాసతో, తపనతో, సృజనాత్మక భావ వీచికా జాలపరంపరతో నవీన సమసమాజ స్థాపనోద్ధరణకు త్రికరణ శుద్ధిగా పాటుపడతాడు. ఆ దిశగా ఆలోచిస్తూంటాడు, మదనపడతాడు, ఆవేశపడుతుంటాడు, ఆశయ సిద్ధికోసం ఖేదపడతాడు, నిరంతరం తనలో తను రమిస్తాడు, ఒక ఉదాత్త, మహోన్నత మానవ సమాజ నిర్మితికి అనంతంగా అనుభూతిస్తాడు.

ఈ రకపు మానసికమైన, మేథో భాధ్యతాయుతమైన వ్యావృత్తితో పోరాటపథంలో పయనిస్తాడు. అక్షరాలను ఆయుధాలుగా చేసుకొని తిరుగుబాటును ప్రకటిస్తాడు. తన కవిత్వంతో జనజాగృతికి, ప్రజాహితానికి దోహదపడతాడు. కవి అయినవాడు కవితా సృష్టికర్తే కాక ద్రష్టకూడా. అంటే భూత, వర్తమానకాలాలలోని మంచి చెడులను బేరీజు వేసి సరికొత్త దృష్టితో నవ్య లోకాన్ని స్వప్నిస్తాడు. సృజనాత్మక శిల్పిగా మారతాడు, వస్తువు చుట్టూ తిరగకుండా వస్తువులోనికి ప్రవహించి సత్యాన్వేషణ సాగిస్తాడు. తనదైన ఊనికతో, లయాత్మక పదాల మేళవింపుతో కావ్యసృష్టిని చేస్తాడు. ఈ లక్షణాలన్నీ 'అల' రచించిన నిప్పులవాగు, మట్టిచెట్టు పిట్టబజనిక, అలల సవ్వడి కవితా సంపుటిలో అద్భుతంగా ప్రతిబింబింపజేసాడు.

అయినంపూడి లక్ష్మీనరసింహరాజు (అల) పూసపాటి కృష్ణంరాజు, దాట్ల నారాయణమూర్తిరాజు, పతంజలి వంటి విజయనగర కథకుల ప్రాంతంలోంచి వచ్చినా వారి నుండి ప్రేరణను మాత్రం పొంది కవితను తన అక్షర మార్గంగా ఎన్నుకున్నాడు. జనసాహితి వంటి సంస్థలతో పాటని పల్లవిగా చేసుకొని ప్రజల మధ్య తిరిగి చైతన్యం రగిలించాడు. ఆ పాటలను పాడి పాడి తనలో అక్షర ధునిని నిరంతరం జ్వలింపజేసుకున్నాడు. కవిత్వాన్నే ఊపిరిగా చేసుకొని తెలుగునేలలో ఎక్కడ సాహిత్యసభ జరిగినా అక్కడకు చేరుకొని తనను తాను పునర్నిర్వచించుకుంటూ ఒక కవితా విహంగమై తిరిగాడు. కాని తన ఆరోగ్యాన్ని ఎప్పుడు లెక్కచేయక పోవడం వలన రెండు దీర్ఘ కవితలను, ఒక కవితా సంపుటిని వెలువరించి అర్థాంతరంగా అక్షరక్రతువుని ముగించి తిరిగిరాని ప్రయాణం చేసాడు.

అతని మొదటి ప్రచురణ "నిప్పులవాగు". నిప్పు చైతన్యానికి ప్రతీక. వాగూ చైతన్యానికి ప్రతీకే. మరి నిప్పులే వాగులై తెలుగునాట భూమికోసం, భుక్తికోసం ప్రవహించే తీరును వివరించిందీ నిప్పులవాగు దీర్ఘకవిత. "యుద్ధం" అనే అంశాన్ని నాయకుడిగా చేసి యుద్ధం వల్లనే ప్రజలు ఎత్తుపల్లాలు లేని జీవితాన్ని సాధించుకోగలరన్న పూర్తి నమ్మికతో సాగుతుంది ఈ దీర్ఘకవిత. కష్టజీవి యుద్ధం చెయ్యడం అనివార్యమన్నది 'అల' అభిప్రాయం. అందుకే యుద్ధాన్ని ప్రేమిస్తాడు ఇలా

*ఓ నా యుద్ధమా*
*నిరంతరం సాగే*
*జీవన సంఘర్షణవి*
*అంతర్మథనం నించి*
*బయటపడిన*
*అమృత తరగవి*

అని అంటూ కష్టజీవి తను కష్టాల కొలిమి నుండి బయటకు రావాలంటే యుద్ధాన్ని ఆవాహన చేసుకొని, తనే సర్వస్వమని, తనకోసమే పలవరించి, పరితపిస్తేనే మార్పు సాధ్యమౌతుందని ఉద్బోధిస్తాడు.

*నాగలి మేడిని*
*అదిమిపెట్టే వేలే*
*తెల్లకాగితం మీద*
*ముద్రవేసినప్పుడు*
*కొరడా కర్రని*
*బిగిసిపట్టిన చెయ్యే*
*అప్పులకోసం అర్రులు చాచినప్పుడు*
*యుద్ధం అనివార్యం*

అనాదిగా రైతు వ్యవసాయం చేసి అప్పులు పాలౌతూనేవున్నాడు తప్ప స్థిరమైన, ఆనందకరమైన జీవితాన్ని ఈ ఆధునిక కాలంలో కూడా పొందడం సాధ్యం కావడంలేదు. దీనికి కారణమైన పెత్తందారీ భూస్వామ్యవ్యవస్థ, ప్రపంచీకరణ శక్తులపైన కొరడా ఝుళిపించి తన కష్టానికి తగ్గ ఫలితాన్ని పొందడానికి యుద్ధం అనివార్యం అయ్యిందని ఆక్రోశిస్తున్నాడు. ఇలా "మన వ్యాపారం మీద, మన సకల అలవాట్ల మీద చావు దెబ్బ తీశాడే... వాడి మీద, వాడి కుట్రలమీద యుద్ధం చెయ్యాలి, ఇది పోరాటకారుల యుద్ధం కాదు, పీడితులు, బాధితులు, అణగారిపోతున్న సకల వృత్తుల ప్రజలు తమ మీద తమ సంస్కృతి మీద జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా సమస్త ప్రజలు సామూహికంగా చేయవలసిన తిరుగుబాటుగా అభివర్ణించాడు. ప్రజాయుద్ధ పరిణామాన్ని వస్తువుగా చేసుకొని అత్యంత అవగాహనతో అనివార్యమైన యుద్ధాన్ని చిన్న దీర్ఘ ఖండికలో "అల" యుద్ధారావాన్ని ఆలపించాడు.

రెండవ దీర్ఘ కావ్యం "మట్టి చెట్టు పిట్ట బజనిక". ఇది కూడా ప్రపంచీకరణ నేపథ్యంలో రైతు తన అస్తిత్వాన్ని కోల్పోయి రైతే మట్టి చెట్టుగా మారిపోయి ఆ చెట్టుపై బజనిక (చెట్లను ఆసరా చేసుకొని చెట్ల సారాన్ని పీలుస్తూ చెట్టంతా వ్యాపించే ఒకరకమైన తీగ)గా మారి రైతు జవసత్వాలను పీల్చిపిప్పిచేసి అతని సారాన్నంతా గ్రహిస్తున్న పరాన్నభుక్కులైన కార్పొరేటు శక్తుల ఆధిపత్యజాలాన్ని నిరసిస్తూ ఉత్తరాంధ్రా మాండలికంలో రాసిన ఖండకావ్యం ఇది.

*నల్ల నోట్ల కట్టలు*
*సెలకల్లో చెట్లై కొత్త చిగురు తొడుగుతున్నాయి*
*కార్పొరేటు సాగులో*
*డాలర్ల గరిసెలు*
*విదేశీ బ్యాంకు లాకర్లలో*
*నెట్టులే నెట్టులు*

అంటూ మట్టితో కలిసి చెమట చుక్కలు పండించిన పంటలు ఎలా దోపిడీకి గురియై డాలర్లుగా మారి విదేశీ లాకర్లలో కట్టలుకట్టలుగా మారుతున్నాయోనని ఆక్రోశిస్తున్నాడు.

*చెరువు అగాడీ మన్ను*
*మెట్టుకి మొల్లంబలి*
*వెంపలి, పిల్లి పెసర*
*దమ్ము మడికి బొమ్మిదాల పులుసు*

ఇలా పొలానికి కావలసిన మన్ను, గత్తం సేంద్రియ పద్ధతిలో సిద్ధం చేసిన రైతు ఎంత ఒడుపుగా పొలాన్ని దున్నుతున్నాడో చూడండి.

***గొడ్లలు రాకుండా/గొడ్డుల్ని ఒడుపుగా అదిల్చి/దమ్ముమడి చుట్టూ/ఎద్దై తిరిగి/ఆరై అరిగిపోతాడు/కష్టాల నిప్పుగోళం/అలి నెత్తెక్కి/అంబలి తట్టవుతుందు***

అంటూ ఆరుగాలం పిల్లాపాపలతోటి కష్టించి పంటపండించిన రైతుకు కల్తీ పురుగుల మందులనో, తాలు విత్తనాలవల్లనో, సరైన గిట్టుబాటు ధర రాకపోవడం వల్లనో తను చేసిన అప్పు తీర్చలేక దుక్కిటెద్దును కబేళాకి పంపించి, నాగలిని పొయ్యిలోకి దూకించి తను ఉరికొయ్యకి వేలబడుతున్న దీనస్థితిని అద్భుతంగా చిత్రీకరించాడు.

అందుకే ఈ స్థితికి కారణమైన ఈ వ్యవస్థ ముఖచిత్రం మారాలని ఈ మార్పు రావాలంటే సంఘటితమైన తిరుగుబాటు ప్రకటించాలని ఆవేశపడుతున్నాడు.

***ఏక ధృవ ఆధిపత్యానికి అప్పసం వేసి/కోల్పోయిన సంపదల్ని పిండుకోవడానికి/సన్నకారు ప్రపంచకం/జట్టుకట్టి నిట్టలా నిలబడాలి/....../బతుకు మడిలో/విస్తరిస్తున్న హలఖడ్గం/కళ్ళముందు కదులుతూనే ఉంది/ఇంకా ఇప్పుడు యవక లేలయ్యింది/తెల్లారడానికి ఎంతో దూరం లేదు***

ఇక మూడవది పాతికేళ్ళ సుదీర్ఘ రచనా వ్యాసంగ కాలంలో అల రాసిన కవితల సంపుటి "అలల సవ్వడి". కవిత్వ రహస్యం తెలిసిన కవి సమాజంలోని అసమానమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ ఘటనల కారణంగా సమాజంతో ఎలా విభేదిస్తాడో ఈ కవితలలో చూస్తాము. తీవ్ర సంక్షోభం నుంచి జనించిన భావావేశం ఈ కవితలలో ధ్వనిస్తుంది. ఈయన కవితా తాత్వికతంతా తిరుగుబాటే. ఎదురుతిరిగి ప్రశ్నిస్తే కాని, తిరగబడి యుద్ధం చేస్తే కాని మన హక్కులు, మన జీవితాలను సాధించలేమని ప్రగాఢంగా విశ్వసిస్తాడు అల. అందుకే వీలైన దగ్గరల్ల తిరుగుబాటునే ఆయుధంగా చేసుకోవాలని పరితపిస్తాడు.

**"స్తబ్దతా మరణమే!"** అనే కవితలో

*మీ జలల తలల్ని*
*కష్టాల రాళ్లకు ఢీకొట్టి*
*నిర్భయంగా*
*ప్రతిఘటన లోయల్లోకి*
*జలపాతాలై దూకండి!*

అంటూ పిలుపునిస్తాడు. ఇతని కవితల్లో చిక్కని కవిత్వంతో కూడిన వైప్లవిక స్వప్నం అంతర్గతంగా ప్రవహిస్తూ వుంటుంది.

*"బహుశా!"* అనే కవితలో

***ఎవరో/చుక్కల్ని ఏరి/పెరటి నందివర్ధన మొక్కకు/అద్దినట్టున్నారు/అడవి/ఆకుల మీద నెత్తుటిని/ఆకాశానికి పులిమినట్టున్నారు***

మతాన్ని, మతం చేస్తున్న దాష్టీకం పైన తన తీవ్రమైన ఆగ్రహాన్ని ఇలా వెళ్ళగక్కుతున్నాడు

*"ఇంకానా...! ఈ కోవెల...!* అనే కవితలో

***కోవెల ప్రవేశమూ వద్దు/కోవెల వద్దు/మనుషుల మధ్య అంతరాన్ని పెంచే/ఈ కోవెల సంస్కృతి మీద/కాండ్రించి తుప్పున ఉమ్మాలని ఉంది***

ఇప్పుడు జరుగుతున్న దేశాల మధ్య యుద్ధాలలో అంతిమంగా ఏకధృవ యుద్ధాలేనని సామ్రాజ్యవాద వ్యాప్తికి, బహుళ జాతి సంస్థల ఆధిపత్యాన్ని నిలుపుకోడానికి జరుగుతున్న పోరాటాలేనని ఈ ఆధిపత్యజాలం పోవాలంటే

**"యుద్ధం ముగియలేదు"** అన్న కవితలో

***అధికారానికి, ఆధిపత్యానికీ/కేంద్రం మట్టి మనిషే!/ఈ మట్టి పోరుతోనే/యుద్ధాలకీ, సామ్రాజ్యయుద్ధాలకీ అంతం/శ్రమజీవుల సుందర ప్రపంచం కోసం/జరిగే ఈ పోరు/నీతోనే ప్రారంభం కాలేదు/మాతోటి ముగిసిపోదు"***

అంటూ ప్రతి శ్రమజీవిని తట్టిలేపుతున్నాడు. ఇలా తన ప్రతి కవితలోను అల "అలల సవ్వడి" యొక్క తీవ్రతను తెలియజేస్తూ సముద్ర తరంగాల ఉప్పెన హోరును తన కవితల ద్వారా ప్రవహింపజేస్తూ తారతమ్యాలులేని సమసమాజ నిర్మాణాన్ని కాంక్షిస్తూ అల తన కవితా ప్రయాణాన్ని సాగించాడు. ఇంకా కొనసాగించాల్సిన సమయంలో హఠాత్తుగా కేన్సర్ కారణంగా తన అలల ఉధృతి ఒక్కసారి ఆగిపోయింది. ఇది తెలుగు కవితా లోకానికి ముఖ్యంగా ఉత్తరాంధ్ర మాండలికానికి తీరనిలోటు.

♦

## పాట

# డప్పు చెప్పిన మాట

- బి.గోవర్ధనరావు
9441968930

*సాకీ:* **అడుగడుగున - నిన్నవమానించారే**
**అత్యాచారం చేసి - అంతమొందించారే**

ఎంత ఏడ్చినా - నీ బ్రతుకు తెల్లారదే
ఎన్ని చెప్పినా - నీ వేదన చల్లారదే
నిను కన్నోళ్ళ - గుండె పగిలిందే
నీ కథ విన్నోళ్ళు - పెనుమంటలయ్యారే

*పల్లవి:* చిన్న మాటే కాదిది - చెల్లెలా
నేడున్నమాటే ఇది - చెల్లెలా
నీడనై - నీ చెంతనుంటా - చెల్లెలా
అన్ననై - నీవెంట వస్తా - చెల్లెలా
నిప్పునై - నే చెప్పే మాటిది - చెల్లెలా
డప్పునై - నే పాడే పాటిది - చెల్లెలా

*చరణం:* ఆడపిల్లకు - చదువెందుకంటారు
బడికెల్తానంటే - బుద్ధేలేదంటారు
మగపిల్లాడైతే - చదవాలంటారు
ఎదిగివాడే - ఉద్ధరిస్తాడంటారు
చదువు వద్దంటూ - చీకట్లో వుంచేసి
హక్కుల్ని కాలరాసి - నిన్ను దగాచేసి
మనువు గారి - అధర్మాన్ని బోధించి
మల్లెలాంటి - నీ మనసును విరిచేసి
ప్రతీ పనిలో - చిన్న చూపు చూస్తారు
పనికిరాని - మాటలెన్నో చెబుతారు
నమ్మకు - ఈ గాజుగోడల నీడల్ని - చెల్లెలా
నమ్మకు - ఈనేతి బీరల చందాన్ని - చెల్లెలా

కన్నీరు పెట్టి - కడతేరిపోకు - చెల్లెలా
కన్నకలలను - సాధించాలె - చెల్లెలా

// చిన్నమాట //

*చరణం:* అందచందాల - పోటీలంటూ
అతివలకిచ్చే - స్వేచ్ఛంటూ
అంతర్జాతీయ వేదికలెక్కించి
అంగాంగ ప్రదర్శనలు చేయించి
అంగడిలో సరుకును చేసి
అంతకంతకు నిను దిగజార్చి
ఆడదే - అంతటికీ మూలమనీ
ఆమె లేనిదే - అంతా చీకటనీ
చెప్పినవి - నీటిమీద గీతలాయె
రాసినవి - కొండెక్కిన కోతలాయె
నమ్మకు - ఈనీచ సంస్కృతిని - చెల్లెలా
నమ్మకు - ఈ వెట్టి జాతరని - చెల్లెలా

కలత చెందక - కదిలి రావాలే - చెల్లెలా
అణచివేతను - ఎదుర్కోవాలే - చెల్లెలా

// చిన్నమాటే //

*చరణం:* స్త్రీలకు ఇస్తాం - రక్షణ అంటూ
రాజకీయపు - రచ్చను చేసి
మీకున్నాయ్ - ఎన్నో చట్టాలంటూ
అమలు చేయకుండా - అడ్డూకుంటూ
ఆపదొచ్చి - కేసును పెడితే
వాయిదాలతోనే - నెట్టుకొచ్చి
సాక్ష్యమేదని - ప్రశ్నించి - వేధించి
చివరకు - నిన్నే దోషిని చేసి
ఎదిగే - నీ ఉనికిని - దోచేస్తిరి
వెలిగే - నీ భవితను - ఆర్పేస్తిరి
నమ్మకు - ఈ నాటకాలను - చెల్లెలా
నమ్మకు - ఈ బండరాళ్లను - చెల్లెలా
కుంగిపోయి - కుములుపోకు - చెల్లెలా
పోరుబాటలో - నడవాలె - చెల్లెలా

// చిన్నమాటే //

*చరణం:* అంతులేని శ్రమను కోర్చి
మరెన్నో బాధల్ని భరించి
మమతాను రాగాలను పంచి
కుటుంబ వ్యవస్థను నిలబెట్టి
మనిషికి మనుగడనిచ్చి
మానవతతో మంచిని పెంచి
అన్ని రంగాలలో నువ్వున్నా
అడ్డంకులు దాటి నువ్వెదిగినా
నీ ప్రతిభను చూడలేక - కుళ్ళుకుంటారు
నీ ప్రగతిని అడ్డలేక - గొళ్లుమంటారు
ఎదురు తిరగలేదో
నువ్వెదగలేవు - చెల్లెలా
తిరగబడకపోతే
నువ్ బ్రతకలేవు - చెల్లెలా
కాలమంతా - నీతో కలిసొస్తుందిలే - చెల్లెలా
ఎదిగి నువ్వు - ప్రబల శక్తవ్వాలిలే - చెల్లెలా

***(దేశంలో నానాటికి మహిళలపై పెచ్చుమీరుతున్న వివక్షతలకు నిరసనగా)***



# కార్పొరేట్ అంబలి

ఎల్. శాంతి

సుమిత్ర స్కూటీతో నేరుగా ఆ కార్పొరేట్ కంపెనీ కాంపౌండ్‌లోకి దూసుకొచ్చింది. వారిస్తున్న సెక్యూరిటీ వింగ్‌ని నెట్టుకుంటూ లోనికి వెళ్లింది. ఆమె కళ్లు చింత నిప్పుల్లా ఎర్రబడి ఉన్నాయి. ముఖం ఉబ్బి ఉంది. బాగా ఆగ్రహంతో, ఆవేశంతో ఉన్నట్టుంది. అంతకు మించి ఏదో ఆవేదన ఆమెను అతలాకుతలం చేస్తోంది. ఆమె నేరుగా ఎండి ఛాంబర్లోకి చొచ్చుకు వెళ్లింది.

'అయ్యా! ఎండీ గారూ... నమస్కారం. రాత్రి ఎంతమందికి మందు పోయించారు? ఎంతమంది చేత పీకలదాకా తాగించి.. పబ్బులో గెంతించారు? మీకు కనీస బాధ్యత ఉందా?' అని గట్టిగా, ఏడుపుగొంతుతో అడిగింది. ఆ హఠాత్పరిణామానికి ఎమ్డీ అవాక్కయ్యాడు. వెంటనే తేరుకొని 'హే... హు ఆర్యూ? వాట్ నాన్సెన్స్ యూ ఆర్ టాకింగ్? అసలెవరు మీరు? ఎవరు రానిచ్చారు లోపలికి?' అంటూ అరిచాడు.

''అయ్యా.. నా కడుపు మండిపోతోంది. నా గుండె రగిలిపోతోంది. నా ఒక్కగానొక్క బిడ్డ.. నా బంగారు తండ్రి..'' అంటూ సుమిత్ర గొంతు పెగలక ఒక్కక్షణం ఆగింది. ఆమెను దుఃఖం కమ్మేసింది. వెక్కివెక్కి ఏడ్చింది.

మళ్లీ మాట్లాడ్డం మొదలుపెట్టింది. "నా కొడుకు అనీల్ ఇప్పుడు తలపగిలి.. చావుబతుకుల మధ్య పడున్నాడు. మా బాబు మీ ఆఫీస్‌లోనే ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు రూ.80 వేల జీతం అంటే మురిసిపోయాను. కాలేజీ వయసులోనూ సినిమాలు, షికార్లు వంటి సరదాలన్నింటినీ చంపుకొని కష్టపడి చదివాడు నా బిడ్డ. ఈ ఉద్యోగంతో మా మధ్యతరగతి బతుకుల ఆర్థిక ఇబ్బందులు తీరతాయని ఆశపడ్డాను. కానీ .. మీరు.. మా వాడిని నాశనం చేశారు. తాగుడు నేర్పారు" ఆమె గొంతు బిగ్గరగా మారింది.

"మేం తాగుడు నేర్పామా? వాటీజ్ దిస్ న్యూసెన్స్? బయటకు వెళ్తారా, గెంటించమంటారా? సెక్యూరిటీ...

సెక్యూరిటీ.. రాస్కెల్.. ఎవర్ని పడితే వాళ్లని లోనికి రానిస్తావా? ఎలా వచ్చింది ఈమె లోనికి? తీస్కు వెళ్లండి. అవుట్ ... గెటవుట్.. ' గట్టిగా సెక్యూరిటీపై అరిచాడు.

'ఇక్కడ కూర్చోడానికి రాలేదు నేను' సుమిత్ర మళ్లీ మాట్లాడ్డం మొదలుపెట్టింది.

"నాకు సమాధానం కావాలి. కష్టపడి చదివి బతుకు తెరువుకోసం మీ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు నా కొడుకు. నిద్రకళ్లు నులుముకుంటూ డ్యూటీలు చేస్తున్నాడు. అలాంటి పిల్లలకు జీతం పెంచడానికి గ్రేడింగుల పేరుతో వేధించే మీరు... వీకెండ్ పార్టీలకు మాత్రం డబ్బులు కేటాయిస్తున్నారు. ఎవరడిగారు మిమ్మల్ని పబ్బు పార్టీలు? టూర్లు? పండగల పేరుతో.. నైట్‌నైట్ అంతా మద్యం పోయించి, వాళ్ల నడవడిక మొత్తాన్ని కొన్నిరోజుల్లో మార్చి పారేశారు. నా బిడ్డను నాశనం చేశారు. ఆఖరికి ప్రాణం మీదికి తెచ్చారు." ఆమె ఏకధాటిగా ఏడుస్తూనే – అరుస్తోంది. అరుస్తూనే ఏడుస్తోంది.

ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఆమెను రెండు రెక్కలు పట్టుకొని లాగుతున్నారు. ఆమె విదిలించుకొని ఛాంబర్లో టేబుల్ మీద ఉన్న వస్తువులన్నింటినీ చేత్తో చెల్లాచెదురు చేసేసింది! గార్డులు మళ్లీ ఆమె చేతులూ, జుట్టు పట్టుకున్నారు. చీర కొంగును మెడకు చుట్టి నేలపై ఈడ్చుకు పోతున్నారు. అయినా ఆమె అరుస్తోంది.

"ఇదిగో ఇప్పుడే చెబుతున్నా.. నా బిడ్డకు, నా బంగారు కొండకు ఏమైనా జరిగిందా.. అప్పుడు చెబుతా మీ కంపెనీ సంగతి. మీ సంగతి..." అంటూ బిగ్గరగా రోదిస్తూ అరుస్తూనే ఉంది. సిబ్బంది ఆమెను బయటకు ఈడ్చుకొచ్చి గేటు బయట పడేశారు. ఆమె హృదయ విదారకంగా ఏడుస్తూ.. అక్కడే.. ఆ నడి రోడ్డు మీదే వెనుక కాళ్ల మీద కూర్చుండిపోయింది.

♦♦♦

ఆఫీసు లోపలి నుంచి సుజిత్, అవినాష్‌లు బయటకు వచ్చారు. వాళ్ల కళ్లలో నీళ్లు తిరిగాయి.

'సారీ ఆంటీ.. ఇదిగో మీ హ్యాండ్ బ్యాగ్. స్పెట్స్, మీ బైక్ కీ.. చెప్పులు వేసుకోండి" అంటూ ఆ సంఘటనలో లోపల పడిపోయిన ఆమె వస్తువులను భద్రంగా తీసుకువచ్చి ఇచ్చారు.

"ఆంటీ వాటరు తాగండి... మేం అనిల్ కొలిగ్స్‌మి. ఇదే కంపెనీలో పనిచేస్తున్నాం. అనిల్‌కి ఎలా ఉందాంటీ? ఏ హాస్పిటల్లో అడ్మిట్ చేశారు? ఇప్పుడే మాకు తెలిసింది.. ఆంటీ ఏడవకండి.. ఊరుకోండి.. ఈ మంచినీళ్లు తాగండి" చెబుతున్నారు ఇద్దరూ.

సుమిత్ర తలపైకెత్తి ఆ ఇద్దరి ముఖాలవైపు చూస్తూ కాసిన్ని నీళ్లు తాగింది. తన బిడ్డలాగే కనిపిస్తున్నారు. అంతలోనే ఏడుస్తూ పైకి లేచింది. బైక్‌స్టార్ట్ చేసి నేరుగా అనిల్‌ను అడ్మిట్ చేసిన ఆస్పత్రికి బయల్దేరింది.

♦♦♦

సుమిత్ర కొడుకు అనిల్. 24 ఏళ్లు. నిన్నటి రాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కారణమయ్యాడు. కంపెనీ ప్రాజెక్టు పార్టీలో బాగా తాగాడు. ఆ మత్తులో కార్ డ్రైవ్ చేస్తూ తొలుత ఓ బైక్‌కు డ్యాష్ ఇచ్చి.. డివైడర్‌ను ఢీకొట్టాడు. అనిల్ తలకు బలమైన గాయమైంది. రక్తం చాలా పోయింది. బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురైన యువకులు కూడా ఇదే హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి ఫర్వాలేదు. అనిల్ స్థితి విషమంగా ఉంది. తలకు ఆపరేషన్ చేయాలంటున్నారు డాక్టర్లు.

♦♦♦

సుమిత్ర భర్త హర్షవర్ధన్ నాలుగేళ్ల కిందటే హార్ట్ అటాక్‌తో చనిపోయారు. అప్పట్నుంచీ తల్లీబిడ్డలే ఒకరికొకరుగా జీవిస్తున్నారు. భర్త చనిపోయాక సుమిత్ర ఓ ప్రయివేటు స్కూల్లో టీచరుగా చేరింది. అనిల్ ఎప్పుడూ చదువులో ఫస్ట్. ఎంబిఏలో గోల్డ్‌మెడల్ కూడా సాధించాడు. అమెరికా బేస్డ్ కంపెనీ హెచ్ఆర్ విభాగానికి క్యాంపస్‌లోనే సెలక్టయ్యాడు. మంచి ప్యాకేజీ అని సంతోషపడ్డారు. రెండేళ్లలో డిప్యూటీ మేనేజర్ స్థాయికి చేరాడు. అనిల్ చాలా చురుకైనవాడు. అంతకుమించి బాధ్యతైన వాడు కూడా. తల్లీబిడ్డ స్నేహితుల్లా ఉండేవారు.

అలాంటి అనిల్ జాబ్‌లో చేరాక నెమ్మదినెమ్మదిగా చాలా మారిపోయాడు. నైట్ షిఫ్ట్ కావడంతో పొద్దస్తమానం నిద్రపోయేవాడు. కంపెనీ వారు ఇచ్చే పార్టీల్లో కొలిగ్స్ ఒత్తిడితో నెమ్మదిగా మద్యానికి అలవాటు పడ్డాడు. బాధ్యతలతో పాటు కంపెనీ పార్టీలూ ఎక్కువయ్యాయి. ఒక ప్రాజెక్టు విజయవంతంగా పూర్తయితే ఆ రోజు పబ్‌లో పార్టీయే.

రాత్రంతా డ్యూటీ చేసి, డ్యూటీ అనంతరం పబ్బుకు వెళ్లి ఉదయం 6 గంటలకు ఇంటికి వచ్చేవాడు. వస్తూనే మంచంపై వాలిపోయేవాడు. తెలివిలేకుండా నిద్రపోయేవాడు. మధ్యాహ్నం 2 గంటలు అయ్యేసరికి హడావిడిగా నిద్రలేచి క్యాబ్ వచ్చేస్తుందంటూ తిండికూడా సరిగ్గా తినకుండా తయారయ్యేవాడు. ఇటు పని ఒత్తిడి, అటు పార్టీలు...

మధ్యమధ్యలో టూర్లు... కొంత కాలానికి పార్టీల్లోనే కాక బయట కూడా తాగడం మొదలు పెట్టాడు. జీతం బాగానే ఉన్నా ఎప్పుడూ పని ఒత్తిడితో నలిగిపోయేవాడు. ఆ ఒత్తిడి నుంచి బయటపడేందుకు కూడా మద్యం ఆశ్రయించేవాడు. మూడు ప్రెస్టేజియస్ ప్రాజెక్టులు అనిల్ ఆధ్వర్యాన దిగ్విజయంగా పూర్తయ్యాయి. అందుకే అనిల్‌కు మరిన్ని కీలక బాధ్యతలను కంపెనీ అప్పగించింది.

అనిల్ తల్లితో గడిపే సమయం బాగా తగ్గిపోయింది. గతంలో అమ్మ వెనుకే వంటింట్లోకీ, హాల్లోకీ తిరుగుతూ గలగలా కబుర్లు చెప్పే అనిల్ .. ఇప్పుడు అమ్మ ఫోన్ చేసినా తీరికలేదంటూ ఫోన్ పెట్టేస్తున్నాడు. ముఖ్యమైన విషయాలు సైతం ఫోన్‌లోనే మాట్లాడుకునే పరిస్థితి! తాగి ఇంటికి వస్తుండడంతో వచ్చిన వెంటనే తన గది తలుపు గడియ పెట్టుకోవడం అనిల్‌కు అలవాటుగా మారింది. సుమిత్ర ఏదైనా చెప్పబోతే– అంతెత్తున లేవడం, చేతిలో సామాను విసిరి కొట్టడం కూడా నేర్చాడు. ఎనిమిది నెలలుగా ఇదే పరిస్థితి. కొడుకు మీద బెంగతో.. ఒంటరితనంతో కుంగిపోతోంది సుమిత్ర.

♦♦♦

అనీల్ ఆపరేషన్ సక్సెస్ అయింది. ఇంకా స్పృహ రాలేదు. డిశ్చార్జి చేయడానికి వారం రోజులు పడుతుందన్నారు డాక్టర్లు. ఆ తర్వాత నెల రోజులు రెస్ట్ తీసుకోవాలని చెప్పారు. ఆస్పత్రిలో అన్ని సేవలూ తల్లే చేసింది. అన్నం తినిపించడం, దుస్తులు మార్చడం.. వంటివన్నీ చేస్తున్న తల్లివైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసేవాడు అనిల్. డిశ్చార్జి ఇచ్చారు. ఈ నెల రోజులూ సుమిత్ర బిడ్డను చాలా జాగ్రత్తగా చూసుకుంది. అనిల్ ఆఫీసుకు వెళ్లాల్సిన సమయం దగ్గర పడింది. సుమిత్రలో మళ్లీ బెంగ మొదలైంది.

“నాన్నా ఈ ఉద్యోగం వదిలేయ్.. రా.. ఆ జాబ్ వల్ల నువ్వు చాలా మారిపోయావ్, నష్టపోయావ్” అంది ఓరోజు.

అనిల్ తల్లిపై అంతెత్తున లేచాడు. ‘‘ఏం మాట్లాడుతున్నావమ్మా? ఉద్యోగం మానేస్తే ఏం తింటాం? రేపట్నుంచే నేను ఆఫీసుకు వెళ్తాను.’’ అని చెప్పాడు. అన్నట్టుగానే మర్నాడు ఆఫీసుకు వెళ్లాడు.

♦♦♦

అనిల్ వెళ్లగానే కొలిగ్స్ అంతా చుట్టూ మూగారు.

‘అనిల్.. అంతా ఒకేనా? ఎలా ఉంది? అంటూ తలో మాటతో పలకరిస్తున్నారు. అప్పుడే వచ్చిన ఎమ్‌డి అనిల్‌ను తన ఛాంబర్‌కు రమ్మని సైగ చేశాడు. అనిల్ వెళ్లాడు

“ఆర్ యు ఒకె.. అనిల్?” అడిగాడు ఎమ్డీ.

“ఎస్ సార్.. నౌ అయాం కంప్లీట్లీ రికవర్డ్.” అన్నాడు అనిల్.

అప్పుడు ఎమ్డీ అనిల్ ముఖంలోకి చూస్తూ..“మీతో ఒక విషయం మాట్లాడాలి. నీకు బాగాలేనప్పుడు మీ అమ్మగారు మన ఆఫీస్‌కు వచ్చి నానా యాగీ చేశారు. నన్నూ నానా మాటలూ అన్నారు. వస్తువులన్నీ తిరగేశారు. కంప్లీట్లీ న్యూసెన్స్. నీకు ఆక్సిడెంట్ అయితే కంపెనీదా తప్పు? చెప్పు?” అనడిగాడు.

“వాట్..సార్ మా మమ్మీ ఆఫీస్‌కు వచ్చిందా? నాకు తెలీదు సార్..” కొంత గిల్టీ ఫీలవుతూ చెప్పాడు అనిల్.

“ఇట్స్ ఒకే. ఇది మంచి వాతావరణం కాదు. రేపు ఎక్స్‌ప్లనేషన్ లెటర్ తీసుకురా. అది మీ అమ్మ గారికి కూడా తెలియాలి.” అని ముగించాడు ఎమ్డీ.

“ఒకే సార్” అంటూ బయటకొచ్చాడు అనిల్.

♦♦♦

అప్పుడే సుజిత్, అవినాష్ వచ్చి పలకరించారు. అనిల్ ముఖం కందగడ్డలా ఉంది. తల్లిపై చాలా పీకల దాకా కోపం వచ్చింది. . “ఒరేయ్.. తలపగిలిపోతోందిరా.. మా అమ్మ పెద్ద న్యూసెన్స్‌లా తయారైందిరా. ఇంట్లోనూ, బయటా ఒక్కటే నస పెడుతోంది, నా పరువు తీసింది. ఇది సాఫ్ట్‌వేర్ ఆఫీస్ అనుకుంటుందా? ఎలిమెంటరీ స్కూలనుకుంటుందా?” అంటూ ఎమ్డీ అడిగిన ఎక్స్‌ప్లనేషన్ లెటర్ గురించి వాళ్లతో పంచుకున్నాడు

“నువ్వు చాలా తప్పుడు అభిప్రాయంతో ఉన్నావురా. దా.. ఒకసారి బయటకెళ్లి మాట్లాడుకుందాం..” అని తీసుకెళ్లారు.

“అవునురా మీ అమ్మది నసే... చెట్టంత కొడుకు చావు బతుకుల్లో ఉంటే.. గుండె పగిలేలా ఏడ్చిన ఆ తల్లి రోదన ఇప్పటికీ మేం మరచిపోలేకున్నాం. నువ్వు తలపగిలి ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఆంటీ పడ్డ మనోవేదన నీకు తెలీదురా అనీల్. అప్పుడు ఆంటీ ఎమ్డీతో తప్పుగా ఏమీ మాట్లాడలేదురా. గుండె రగిలితే నా తల్లయినా అలాగే మాట్లాడుతుంది. ఆ రోజు ఆంటీ మా అందరికీ అమ్మలా అనిపించిందిరా. ఎందుకంటే ఆమె అడిగిన ప్రశ్నలు నీ గురించే కాదురా. మన అందరి గురించి. ఆంటీ సరిగ్గా అడగాల్సినవే అడిగింది రా.

ఈ జాబ్‌లో చేరకముందు నువ్వెలా ఉండేవాడివి. ఇప్పుడెలా మారావు? అప్పుడు అమ్మ గురించి ఎలా మాట్లాడావు? ఇప్పుడెలా మాట్లాడుతున్నావ్? అసలు అంత పెద్ద ఆక్సిడెంట్‌కు కారణం డ్రంక్ అండ్ డ్రైవ్ కాదా? ఆ రోజు కంపెనీ ఇచ్చిన నైట్ పార్టీ కాదా? అదేరా మన అమ్మ అడిగింది ?" ఆ స్థితిలో ఆమెకు సర్దిచెప్పి పంపాల్సిన మన ఎమ్‌డి ఎలా రియాక్టు అయ్యాడో ఇదిగో నువ్వే చూడరా.. చూడు.. అమ్మను ఎలా జుట్టుపట్టి ఈడ్చారో..." అంటూ సెల్‌ఫోన్‌లో తీసిన వీడియోను అనిల్‌కు చూపించారు.

తల్లిని అత్యంత దారుణంగా సెక్యూరిటీ గార్డులు రెక్కలు, జుట్టు, చీర పట్టుకొని బరబరా ఈడ్చుకు వెళ్తున్న సన్నివేశం చూసి అనిల్ ఒక్కక్షణం నిశ్చేష్టుడయ్యాడు. ఎంతగానో తల్లడిల్లిపోయాడు. గిలగిల్లాడిపోయాడు. "అమ్మా.." అంటూ అక్కడే ఏడ్చేశాడు. "నా బిడ్డ .. నా బంగారు తండ్రి అనీల్.." అంటూ తల్లి గొంతు చించుకొని రోదిస్తున్న వీడియో చూసి తట్టుకోలేకపోయాడు. వెంటనే బైక్ కీ అందుకొని పైకి లేచి అట్నుంచటే ఇంటికి వెళ్లిపోయాడు.

♦♦♦

ఇంట్లో సుమిత్ర డైనింగ్ టేబుల్‌పై నిద్రపోతోంది. తండ్రి ఫొటో ఆమె పక్కనే ఉంది. అనిల్ వచ్చిన అలికిడి లేచింది.

"నాన్నా.. వచ్చావా? మొదటిరోజు డ్యూటీ ఎలా ఉందిరా. తలనొప్పి రాలేదు కదా.. అంతా ఒకేనా?" అని బెదురు బెదురుగా అడిగింది.

"నీ కిష్టమైన కూరలు చేశాను. రా భోంచేద్దాం." అంది.

"నువ్వు తిన్నావా అమ్మా." అమ్మ కళ్లలోకి చూస్తూ అడిగాడు అనిల్.

అనిల్ నోట ఆ మాట విని ఎన్నాళ్లయిందో సుమిత్రకు. ఆమె మనస్సు పొంగింది.

"రా కన్నా అన్నం వడ్డిస్తా." కొడుకుని ప్రేమగా చేయి పట్టుకొని డైనింగ్ టేబుల్ దగ్గరకు తీసుకువెళ్లింది సుమిత్ర.

"అమ్మ నువ్వే తినిపించు." అన్నాడు. ఆ మాటకు సుమిత్ర కళ్లు నీళ్లతో నిండిపోయాయి. బిడ్డ అలా ఆప్యాయంగా అడిగి ఏడాది అయ్యిందేమో. వెంటనే కళ్లు తుడుచుకుంటూ గబగబా ముద్దలు కలిపి ఆత్రంగా కొడుకుకు తినిపించింది.

♦♦♦

ఆ రోజంతా అనిల్ అమ్మతో మాట్లాడుతూనే ఉన్నాడు. ఎన్నో కబుర్లు చెప్పాడు. ఆమె గుండెల్లో బాధ తొలగిపోయేలా మనసునిండా నవ్వులు నింపాడు. ఆ మార్పును చూసి ఒకింత నమ్మలేకపోయింది సుమిత్ర.. తల్లి ఒడిలో తల పెట్టుకున్నాడు అనీల్. "అమ్మా ఐ లవ్ యు అమ్మా.. సారీ అమ్మా.. నేనింకెప్పుడూ నిన్ను బాధపెట్టను" అని చెప్పాడు. ఇద్దరి కళ్లల్లో కన్నీళ్లు చిప్పిల్లాయి. కొడుకు నుదుటన ముద్దుపెట్టింది సుమిత్ర. కొడుకుపై బెంగతో ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపిన సుమిత్ర ఆ రోజు ప్రశాంతంగా నిద్రపోయింది.

మర్నాడు..

ఆఫీస్‌కి వస్తూనే ఎమ్డీ ఛాంబర్లోకి వెళ్లాడు అనిల్ .

"ఇదిగో సార్ లెటర్" అన్నాడు

ఎండి తీసుకుని ఓపెన్ చేసి చూశాడు.

"వాటీజ్ దిస్. రిజైన్ లెటర్? మానేస్తావా? నువ్వు సడన్‌గా మానేస్తే మన ప్రాజెక్టులు ఏం కావాలి?" అన్నాడు.

"ఎస్ సార్. రిజైన్ లెటర్‌తో పాటు ఈ లెటర్ కూడా చూడండి." అన్నాడు అనిల్.

"ఈ కంపెనీ ఎంత టర్నోవరు చేస్తుంది.. ప్రధాన నగరాల్లో ఏఏ పబ్బులతో, సంస్థలతో సంబంధాలున్నాయి? ఈవెంట్స్ పేరుతో ఎంత మొత్తాన్ని నైట్ పార్టీలకు సంస్థ కేటాయించింది? ఎన్ని మిడ్‌నైట్ పార్టీలు ఎన్ని నిర్వహించింది? గోవా టూర్ పార్టీలు ఎన్ని వేసింది. ఇందుకోసం ఎంత కేటాయించింది? ఇలాంటి వివరాలన్నీ అందులో ఉన్నాయి. వీటిని కోర్టుకు, మీడియాకు అందజేస్తా సార్. ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ తన వ్యాపారం ఏదో తాను చేయకుండా ఇక్కడి బేసిక్ కల్చర్‌ని మార్చటానికి ఏవిధంగా కారణమవుతుందో చర్చ జరగాలి. సోషల్ మీడియానూ వేదిక చేస్తాం. ఈ కంపెనీలు వచ్చాక ఎన్నెన్ని ప్రమాదాలూ నేరాలూ జరిగాయో కూడా లెక్కలు తీస్తున్నాం. అవి కూడా డిబేట్‌కి హెల్ప్ చేస్తాయి." అన్నాడు గట్టిగా.

"ఏమైంది? నీకేమైనా పిచ్చిపట్టిందా? ఏమిటిది? ఇదేమైనా గవర్నమెంట్ ఆఫీస్ అనుకుంటున్నావా? మీ మమ్మీ రాద్ధాంతంపై ఎక్స్‌ప్లనేషన్ అడిగాననేగా." అన్నాడు ఎమ్డీ.

"ఆపండి. మా అమ్మ గురించి ఇంకొక్క మాట మాట్లాడితే బాగోదు." అని గట్టిగా అరిచాడు అనిల్. ఆ అరుపులకు కొలిగ్స్, స్టాఫ్ అంతా ఛాంబర్‌లోకి దూసుకొచ్చారు.

"మీరు మా అమ్మను అన్నారనో లేక.. ఎక్స్‌ప్లనేషన్ అడిగారనో నేను రాజీనామా చేయడంలేదు. మా వ్యవస్థపై మాకే వెగటు పుడుతోంది. అందుకే ఇలా.. విదేశీ కంపెనీలను

## కవిత

# యౌవన రహస్యం

మూలం: వ్లాదిమిర్ మయకోవస్కీ
అనువాదం: అద్దేపల్లి రామమోహనరావు.

పార్కుల్లో
కాళ్ళూ చేతులూ బారజాపుకుని పడుకుంటూ
పడవల్లో కూచుని గావుకేకలు వేసూ
అసభ్యపుకూతలు కూస్తూ
పీకలమొయ్యా మందుకొట్టే వాళ్ళ
యువతరం అనకండి

సిగిరెట్టు పొగల్తో
వసంతరాత్రుల్ని మలినం చేస్తూ
మెరిసిపోయే సంచులు పట్టుకుని
చీపురుతో తుడిచినట్లు
వీధులన్నీ తుడిచేవాళ్ళని
యువతరం అనకండి



నెత్తురు వాగుల్లో ప్రవహించే కొత్త
జీవితంలో మొదటి ప్రేమవ్యవహా
ఛిన్నాభిన్నమైపోయేవాళ్ళని
యువతరం అనకండి

యువతరం
అలాంటి పనికిమాలిన వాటితో తయారుకాదు
పద్ధెనిమిదేళ్ళు రాగానే సరిపోదు

పోరాటరేఖ సన్నగిలిపోతున్నప్పుడు
బాలబాలికలందరి తరపున నిలబడి

మేము
ఈ నేల పైన జీవితాన్ని
మళ్ళీ సరికొత్తగా మారుస్తాం
అని హామీ యివ్వగల వాళ్ళే
యువతరం

అంతర్జాతీయ కమ్యూనిస్టు యువకులకీ
శ్రమ చేయడానికి పోరాడే వాళ్ళకీ
మానవులందరి కళ్ళకు వెలుగై
ఆనందమందిచే వాళ్ళకీ
యువతరం
ఒక శాశ్వత శీర్షిక

***(అద్దేపల్లి అముద్రిత అనువాద కవిత)***

❖

---

ఆహ్వానిస్తూ.. వాళ్లకు ఊడిగం చేసేలా మమ్మల్ని తయారు చేస్తోంది మా దేశం. మా చదువు, మా తెలివీ అన్నీ ఈ సంస్థలకే ఉపయోగ పడుతున్నాయి. మేం మా దేశానికి ఏమీ చేయలేకపోతున్నాం. ఏదో చేయాలని తపన ఉన్నా మేమేదీ చేసేలా లేదు వ్యవస్థ. గతంలో బానిసలకు ఇంత అంబలి పోసి పనిచేయించుకునేవారట పాతతరం పెట్టుబడిదారులు. ఇప్పుడు మీరు అంబలికి బదులు అలసట తెలీకుండా మందు పోస్తున్నారు కదా! ఈ సంస్థలో 200 మందికి పైగా మా తెలుగు వారు పనిచేస్తున్నారు. గతంలో మందు ముట్టని సుమారు 70 మందిమి ఇప్పుడు దానికి అలవాటు పడ్డాం. దీనికి కారణం మీరు కాదా? రాయితీపై మీరు ఇస్తున్న పార్టీలు కావా? జీతం పెంచేందుకు వేధించే మీరు... తాగుడు ఈవెంట్లకు మాత్రం ఎందుకంత డబ్బు కేటాయిస్తున్నారు? మేం తెలుసుకోలేనంత వెర్రిబాగుల వాళ్లం కాదు.

ఏమన్నారు? మా అమ్మ మీకు సారీ చెప్పాలా? కాదు సార్.. ఇప్పుడు ఆ 70 మంది తల్లిదండ్రులకు మీరు, మీ సంస్థ క్షమాపణ చెప్పాలి." అని ఆవేశంగా మాట్లాడాడు అనిల్.


"వ్వాట్.. మిమ్మల్ని మేం తాగుబోతులు చేస్తున్నామా. ఏం మీకు తాగడం రాదా? వీధికో బార్‌షాపును పెట్టిస్తున్నదీ మీ లీడర్లు కాదు" ఎమ్డీ వ్యంగ్యంగా ఎద్దేవా చేశాడు.

"అవును. అందుకే ఇందాకే చెప్పాను. మా వ్యవస్థపైనే మాకు వెగటు కలుగుతోందని. వీటిన్నటిపైనా చర్చ జరగాలి. ఇవన్నీ ప్రజలకు, కోర్టులకు తెలియాలి. ఏళ్ల తరబడి పదిలంగా పెంచుకున్న కుటుంబ, సాంస్కృతిక విలువలన్నీ ఒక్క పెట్టున కుప్పకూల్చే దుర్వ్యవస్థ మీది. ఆలస్యంగానైనా అర్థమవుతోంది మాకు. మిమ్మల్ని నిలేసి నిలదీసే ప్రశ్నలమవుతాం.. ఇక.." అంటూ ఆ ఛాంబర్లోంచి, ఆఫీసులోంచి విశాలమైన ప్రపంచంలోకి అడుగు పెట్టాడు అనిల్.

అనిల్‌లో వచ్చిన ఆ మార్పును వెలుగులీనుతున్న కళ్లతో ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ చూస్తూ ఉండి పోయారు సుజిత్, అవినాష్.

❖

## ప్రఖ్యాత కథా రచయిత పెద్దిభొట్ల కన్నుమూత




ప్రఖ్యాత కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పెద్దిభొట్ల సుబ్బరామయ్య (79) మే 18న విజయవాడలో కన్నుమూశారు. 1938 డిసెంబరు 15న గుంటూరులో జన్మించిన ఆయన ఒంగోలులో స్కూలు విద్యను పూర్తి చేశారు. విజయవాడలో ఉన్నత చదువు చదివారు. పెద్దిభొట్ల తాను జీవించిన కాలంలోనే తన శరీరాన్ని గుంటూరు ఎన్ఆర్ఐ ఆస్పత్రికి దానం చేశారు. పూర్ణాహుతి, దుర్దినం, శుక్రవారం, ఏస్ రన్నర్, వీళ్లు (కథా సంకలనం) వంటి కథలు, ముక్తి, చేదుమాత్ర నవలలు పెద్దిభొట్లకు పేరు తెచ్చాయి. 1957 నుంచి 1996 వరకూ విజయవాడ ఆంధ్రలయోలా కళాశాలలో తెలుగు శాఖాధిపతిగా పనిచేశారు. 2012లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. పెద్దిభొట్ల అరసం రాష్ట్ర కమిటీలో అధ్యక్ష వర్గ సభ్యుడిగా చాలాకాలం ఉన్నారు. పెద్దిభొట్ల సుబ్బరామయ్య సమకాలీన రచయితలలో పేరెన్నికగన్నవారు. 1959లో రచనలు చేయడం ప్రారంభించారు. ధృవతార, చేదుమాత్ర, అంగారతల్పం, పంజరం, కాలుతున్న పూలతోట, త్రిశంకుస్వర్గం, వర్ణమాల – అనే నవలలు, నయనతార, ముసురు, పొగమంచు, కళ్లజోడు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు, చిలక హంస, గాంధీని చూసినవాడు– అనే కథా సంకలనాలు వెలువరించారు. 350కు పైగా కథలు, 12 నవలలు రాసిన పెద్దిభొట్ల సుబ్బరామయ్య తెలుగు సాహిత్యానికి చిరపరిచితులు. ఇంగ్లీషులోకి ఒక సంపుటి అనువాదమైంది. కొన్ని కథలు వివిధ భారతీయ భాషల్లోకి, రష్యన్‌లోకి అనువాదమయ్యాయి. ఆయన రచనలు పేద, మధ్యతరగతి కుటుంబాల జీవితాలతో ముడిపడి ఉంటాయి. "చక్రనేమి" అనే కథ ఆయన మొదటి రచన. అది ఆంధ్రపత్రిక (వార పత్రిక)లో ప్రచురితమైంది. ఆ తర్వాత అనేక రచనలు చేశారు. 'భారతి పత్రిక'కు రెండు నవలలను రాశారు. 1957 నుంచి 1996 వరకూ విజయవాడ ఆంధ్రలయోలా కళాశాలలో తెలుగు శాఖాధిపతిగా పనిచేశారు. విమర్శనాత్మకంగా సాహిత్య సృష్టి చేశారు. ❖

## యద్దనపూడి సులోచనారాణి మృతి



సుప్రసిద్ధ రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి (79) మే 21న అమెరికాలో కన్నుమూశారు. అమెరికాలోని క్యుపర్టినో నగరంలో కుమార్తె లక్ష్మీ శైలజ వద్ద కొంతకాలంగా ఉంటున్నారు. సులోచనారాణి స్వగ్రామం కృష్ణా జిల్లా మొవ్వమండలంలోని కాజ గ్రామం. నెమలికంటి వెంకట చలపతిరావు, మహాలక్ష్మి దంపతులకు 1940లో సులోచనారాణి జన్మించారు. కాజ గ్రామంలో ఎస్ఎస్ఎల్‌సీ వరకూ చదువుకున్నారు. కృష్ణా జిల్లా కంచికచర్ల మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన యద్దనపూడి నరసింహారావును వివాహం చేసుకున్న అనంతరం హైదరాబాద్‌లోని పంజాగుట్టలో ఆమె స్థిరపడ్డారు. ఆమె ఏకైక సంతానం శైలజ అమెరికాలో ఉంటున్నారు. 'చదువుకున్న అమ్మాయిలు' చిత్రంతో సులోచనారాణి సినీ కథా ప్రపంచంలోకి అడుగుపెట్టారు. 'మీనా' 'జీవనతరంగాలు' వంటి పలు నవలలు సినిమాలుగా వచ్చాయి. 'సెక్రటరీ' చిత్రం ఓ పెద్ద సంచలనం. మధ్యతరగతి నేపథ్యాన్ని.... సుసంపన్న కుటుంబాల జీవనశైలిని 'మనోభిరామం'గా మలచి చూపడం యద్దనపూడి ప్రత్యేకం. తొలిచూపులోనే ఆకట్టుకునే సోయగం యద్దనపూడి కథానాయికల సొంతం. సోగకళ్లు...తెగబారెడు వాలుజడ...కోలముఖంతో అందాలు చిందుతూ ఆత్మవిశ్వాసాన్ని, అమాయకత్వాన్ని కలబోసుకుని కనిపిస్తాయి. యద్దనపూడి కథానాయికలు ఒక ఎత్తైతే....కథానాయకులు మరో ఎత్తు. మనసు నిండా ప్రేమ నిండిఉన్నా....తొణకని నిగ్రహం, నిజాయితీ, నిరాడంబరత, సహనానికి ప్రతీకలుగా నిలిచే వ్యక్తిత్వాలు యద్దనపూడి 'రాజశేఖరం...సారధి...చంద్రశేఖరం. తదితర కథానాయకుల సొంతం. 'ఏంటి! పడవలాంటి కారులో రాజశేఖరం లాంటి ' వాడు వెతుక్కుంటూ వస్తాడని కలలు కంటున్నారా అంటూ ఇంట్లో పెద్దలు జోకులేసే పరిస్థితిని ఆమె కథానాయకులు కల్పించారనడం అతిశయోక్తి కాదు. ❖



# మధ్యతరగతి జీవితం కథలకు మాగాణం

**- పెద్దిభొట్ల సుబ్బరామయ్య**

***మధ్య తరగతి జీవితం విస్తారంగా, విభిన్నంగా ఉండడం వల్ల అక్కడ జీవనసారం ఉన్న కథాంశాలు పుష్కలంగా దొరకుతాయని ప్రముఖ రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య అన్నారు. పెద్దిభొట్ల సుబ్బరామయ్యకు కథా విభాగంలో 2012 సంవత్సరానికి గాను కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు లభించిన సందర్భంగా సాహిత్య ప్రస్థానం ఆయనతో జరిపిన ఇంటర్వ్యూ విశేషాలు...***

***రచయిత కావడం ఎలా సంభవించింది?***

ఎక్కువ అభ్యాసం చేత వచ్చేది కవిత్వం. మధనపడడం వల్ల వచ్చేది కథ. చిన్నతనంలో మా ఒంగోలు ప్రాంతంలో కాలేజీలు లేవు. మున్సిపల్ హైస్కూల్లో చదివాను. మా తెలుగు మాష్టారు సాహిత్యం గురించి చెబుతుండేవారు. ఆయన సంస్కరణవాది. వితంతు వివాహం చేసుకున్నారు. ఆయన ప్రేరణతో 'భారతి, కోమలి' వంటి పత్రికలు చదివేవాళ్ళం. ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి కెవి రమణారెడ్డిగారు మాకు చరిత్ర బోధించేవారు. ధారా రామనాథశాస్త్రి గారు కూడా ఒక లెక్చరర్. చిన్నప్పుడే కాలేజీ మ్యాగజైన్‌లో కథ రాశాను. అయితే దాన్ని మొదటి కథగా పరిగణించననుకోండి. ఇంటర్మీడియట్లో స్పెషల్ తెలుగు తీసుకున్నా బిఎలో కూడా ఎస్ఆర్ఆర్ కాలేజీలో విశ్వనాథ సత్యనారాయణ, మెట్లపల్లి సీతాపతిరావు, జటావలోక పురుషోత్తమరావు, జొన్నలగడ్డ సత్యనారాయణ వంటివారు మా లెక్చరర్లు. స్పెషల్ తెలుగులో నలుగురమే. విశ్వనాథ కొన్నిసార్లు క్లాసుకు వచ్చేవారు కాదు. వెళ్లి అడిగితే ఇంటికి రమ్మనేవారు. వెళ్తే చాలాసేపు చెప్పేవారు.

బిఎ పూర్తిచేశాక– లయోలా కాలేజీలో ట్యూటర్‌గా ఉద్యోగం వస్తుందని వెళ్లమన్నారు. బస్సెక్కి వెళ్తుంటే విజయవాడ జవహర్ టాకీస్ (ఇప్పటి విజయ)లో సత్యజిత్‌రే 'పథేర్ పాంచాలి' నడుస్తోంది. అక్కడే దిగిపోయాను. ఎందుకంటే ఆ సినిమా గొప్పతనం గురించి, న్యూయార్క్‌లో ఒకే థియేటర్‌లో ఆరు నెలలకు పైగా నడవడం గురించి 'టైమ్' మ్యాగజైన్‌లో చదివి ఉన్నాను. కాలేజీకి వెళ్లడం కుదరలేదని ఇంట్లో చెప్పాను. తరువాత మళ్లీ వెళ్లి ట్యూటర్‌గా చేరాను. తర్వాత ఎంఎ కూడా పూర్తిచేశాను. 1959లో సరదాగా 'చక్రనేమి' అనే కథ రాశాను. అది అనుకోకుండా భారతిలో అచ్చయింది. థ్రిల్ అయ్యాను. భారతిలో 4, 5 కథలు, రెండు నవలలు రాశాను. తర్వాత

విశాలాంధ్ర వారు అనేక సంపుటాలు ప్రచురించారు.

***సాధారణంగా మీరు రచయితలు కాగోరే వారికి స్వయంగా చూసింది రాయమని చెబుతుంటారు, అయితే మీపై చదివిన పుస్తకాల ప్రభావం కూడా చాలా ఉన్నట్లు కన్పిస్తుంది.***

నేను చాలా ఎక్కువగా చదివేవాణ్ణి... తిరుగుతూ చూస్తుండేవాణ్ణి. అయితే ఎలాగైనా రచయిత కావాలని అనుకోలేదు. మనం మటుకు ఎందుకు రాయకూడదని అనిపించి ఉండొచ్చు. సామాజిక వాస్తవికతను సాహిత్యంలోకి తేవాలనిపించింది. 'దో బీఘే జమీన్' వంటి సినిమాల ప్రభావం కూడా ఉంది. వాస్తవికతను చిత్రించడానికి శ్రీశ్రీ పద్ధతి కూడా చాలదనిపించింది. దానిలో భాష పెంచి, ప్లేంబాయింట్‌గా పొంగించి రాయడం జరిగేది. అందుకే నాకు కథ బెస్ట్ అనిపించింది. నవల అల్లుకుపోవచ్చు. కథ కష్టం. నాటికైతే నాలుగు నోళ్లు మాట్లాడతాయి. నవలలో నాలుగు చాప్టర్లు అదనంగా చేర్చవచ్చు. కానీ, కథ చాలా సున్నితమైనది. ఏదైనా మనసులో పడిన తర్వాత మథనం జరుగుతుంది. ఉదాహరణకు రైలు పెట్టెలు ఊడ్చుతూ బతుకు ఈడ్చే పిల్లల గురించి నాలుగు కథలు రాశాను. ఒకసారి పోలీసులు వారిని కొట్టారు. ఎటువారటు పారిపోయారు. ముగ్గురు ఒకవైపు పోతే ఒక్కడు మాత్రం ఇంకో వైపు పోయాడు. కాని ఎక్కడికి పోతాడు? కొన్ని అనుభవాలతో ఎలాగో మళ్లీ స్టేషన్‌కే వచ్చాడు. ఆ కుర్రవాడి సమస్యకు నేనేం పరిష్కారం చూపగలను? వరవరరావు 'కుక్కపిల్ల' కవిత నన్ను బాగా ఆకర్షించింది. ఆ ఇతివృత్తం కూడా ఇలాటిదే. 'లేచిన వేళ' 'నిప్పుకోడి' 'వగైరా' కథలు ఆ కోవకు చెందినవే.

విజయవాడ రామా టాకీస్ పరిసరాల్లో 60వ దశకంలో మురికివాడలుండేవి. కార్లషెడ్డు కూడా ఉండేది. అక్కడ చవకబారు వ్యభిచారం పెద్దఎత్తున సాగుతుండేది. తర్వాత అక్కడ పెద్ద పెద్ద సినిమా కాంప్లెక్సులు వచ్చాయి. సినిమా పోస్టర్లు రాష్ట్రమంతటికీ అక్కడి నుంచే పంపిణీ అవుతాయి. వ్యభిచారులను నిర్మూలించిన చోటు నుంచి సాగే ఈ సినిమా విషం అంతకంటే జుగుప్సాకరమైంది. అపాయకరమైంది కూడా. అంతేగాక ఈ వ్యభిచార గృహాల నిర్వాహకులు చుట్టుపక్కల నిర్మించిన భారీ అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు తీసుకుని అక్కడినుంచి నడపటం మొదలు పెట్టారు. ఈ పరిణామాన్ని 'పంజరం', 'ముక్తి' వంటి నవలల్లో చిత్రించాను.

***మీ పాత్రలు ఎక్కువగా చనిపోతాయనే అభిప్రాయం ఉంది కదా. ప్రధానంగా మీరు కరుణ రసానికే పెద్దపీట వేశారు.***

(నవ్వుతూ) 'సుబ్బరామయ్య కథల్లో పాత్రలు చచ్చిపోతాయి. లేక హాయిగా నిద్రపోతాయి' అని కప్పగంతుల మల్లికార్జునరావు అన్నారు. ప్రయత్నించినా హాస్యాన్ని రాయలేకపోయాను. ప్రసిద్ధ నటుడు కె. వెంకటేశ్వరరావు గొడవపెడితే ఒక నాటకం రాశాను. కాని కంటిన్యూ చేయలేదు. నా కథల్లో కూడా మాటల పొదుపు పాటిస్తాను. ఆర్ద్రత నింపడం, కరుణ రసాన్ని పండించడం చాలా కష్టం. కరుణ రస సూత్రం చాలా సున్నితమైంది. ఎక్కువగా లాగినా పెద్ద నష్టం లేదు. హాస్య రసం అలా కాదు. ప్రతి మనిషికీ ఒక జీవలక్షణం ఉంటుంది. అలాగే ప్రతి సిన్సియర్ రచయితకు ఒక లక్షణం ఉంటుంది.

***మీ పేరు చెప్పగానే గుర్తుకు వచ్చే కథ 'నీళ్ళు' దాని నేపథ్యం చెప్పండి.***

ఇప్పటికి చాలామంది నన్ను 'నీళ్ళు' రచయితగానే గుర్తు పెట్టుకున్నారు. ఒంగోలు, పొదిలి వంటి చోట్ల నీటి కొరత. మా స్నేహితుడు ఒకరు విజయవాడకు టెంపరరీ ఉద్యోగం కోసం వచ్చాడు. ఇక్కడ బావుల్లో నీళ్లు పైనే ఉండడం, కృష్ణా నది ఒరుసుకుంటూ పారడం తనకు అద్భుతంగా అనిపించింది. అంత గొప్పనీటి ప్రవాహం చూడటం వాడి జీవితంలో అదే తొలిసారి. రోజూ స్నానానికి వెళ్లి చాలాసేపు గడిపేవాడు. తర్వాత చచ్చిపోయాడు. మామూలుగానే అనుకోండి. ఆ నేపథ్యంలోనే 'నీళ్లు' కథ రాశాను.

***'ఇంగువ' విషయం?***

అదీ అంతే..! ఇంగువ అంటే ఏమిటి? ఎలా వస్తుంది? అని నా మిత్రుడొకడు మరీ మరీ అడిగాడు. నాకు అప్పుడు తెలియదు. కొన్నాళ్ళ తర్వాత వాడు చచ్చిపోయాడు. జీవితంలో కొన్నిసార్లు ఏవో సందేహాలు తీర్చుకోకుండానే వెళ్లిపోతామని అనిపించింది. ఇప్పుడు సన్నిహితులు కొంతమంది నన్ను 'ఇంగువ' అనే పిలుస్తున్నారు.

***'పూర్ణాహుతి' కథలోనూ పేద బ్రాహ్మడు దయనీయంగా చనిపోతాడు కదా?***

'దుర్దినం', 'పూర్ణాహుతి' వంటి కథల్లో నిరుపేద బ్రాహ్మణుల డెస్పరేట్ జీవితాలను చిత్రించాను. 'వాళ్ళు', 'దళిత బ్రాహ్మణులు'.. అలాంటి కథలు సుబ్బరామయ్య ఒక్కడే రాశారు అని ఎవరో అన్నారు.



## ప్రసిద్ధ నటుడు మాదాల రంగారావు కన్నుమూత

మాదాల రంగారావు మే 27న కన్నుమూశారు. తెలుగు సినిమా నిర్మాత, దర్శకుడు, నటుడు, వామపక్ష భావజాలం కలిగిన మాదాల అవినీతి, అణిచివేత లాంటి సామాజిక సమస్యలను ప్రతిబింబిస్తూ అనేక సినిమాలు రూపొందించాడు. నవతరం ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థ స్థాపించాడు. మరో కురుక్షేత్రం, యువతరం కదిలింది, ఎర్రమల్లెలు, విప్లవశంఖం, నవోదయం, మహాప్రస్థానం, తొలిపొద్దు, ప్రజాశక్తి, బలిపీఠంపై భారతనారి, ఎర్రపావురాలు, స్వరాజ్యం, జనం మనం వంటి సినిమాల్లో నటించారు. వీరి సినిమాలలోని నాంపల్లి స్టేషన్ కాడా రాజా లింగో, కాలేజీ కుర్రవాడ కులాసాగా తిరిగేటోడా, అమరవీరులెందరో అనే పాటలు అత్యంత ప్రజాదరణను పొందాయి. ప్రకాశం జిల్లా మైనం పాడు మాదాల స్వగ్రామంలో 1948 మే 25న ఆయన జన్మించాడు. ప్రజా నాట్యమండలి లో క్రియాశీలక సభ్యుడిగా ఉన్నాడు. 1980-90 దశకంలో సామాజిక విప్లవ సినిమాలతో తెలుగు తెరపై సంచలనం సృష్టించాడు. 1980 లో తీసిన యువతరం కదిలింది సినిమాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ బంగారు నంది పురస్కారం లభించింది. నవతరం పిక్చర్స్ బ్యానర్లో సినిమాలు నిర్మించిన మాదాల, ఎక్కువగా విప్లవ భావాలు కలిగిన చిత్రాలనే తీశాడు. ❖

***వ్యక్తికి కుటుంబానికి గల సంబంధం తెలిపేదే కథ అన్న నిర్వచనంతో ఏకీభవిస్తారా?***

కథ చాలా జీవితాన్ని ఒక చిన్న దర్పణంలో ప్రతిబింబిస్తుంది. అంతేగాని నిర్వచనాలిచ్చి కంపార్ట్‌మెంటలైజ్ చేయనక్కరలేదు. చదివిని వారిలో 'ఫీలింగ్' కలిగించాలి. అంతకు మించి వేరే కొలమానం లేదు.

***ఈనాడు వచ్చే కథల గురించి మీ అభిప్రాయం?***

కాలువ మల్లయ్య, అల్లం రాజయ్య వంటి వారు అట్టడుగు పొరల్లోని జీవితం, వాస్తవికతను చిత్రీకరించడం గొప్ప విషయం. నేను నాకు తెలిసిన జీవితం గురించి రాశాను. వాళ్లు వాస్తవంగా పల్లెసీమల్లోని మట్టి మనుషుల గురించి, వాళ్ళ బాధల గురించి రాశారు. అయితే అలాంటివి ఎప్పుడూ రాయలేమని, ఆ ఒరిజినల్ అనుభవాలు అయిపోతాయని ఒక యువ రచయిత నాతో అన్నాడు. అదీ నిజమే. పల్లెలు పట్టణాలవుతాయి. వలసలు జరుగుతాయి. జీవితాలు మారిపోతాయి.

***అప్పుడు ఇతివృత్తాల కోసం హ్యూమన్ సెన్సిబిలిటీస్, జీవిత తాత్వికత వైపు పోవాలంటారా?***

అలా అయినా పోవాలి. లేకపోతే.. మధ్యతరగతి జీవితం వైపన్నా రావాలి. కథలకు ఆ జీవితం సారవంతమైన మాగాణం అని చెప్పాలి.

***నేటి సామాజిక పరిస్థితులపై మీ అభిప్రాయం?***

అందని అంతరంగాల్లో అసంతృప్తి, బాధ... ఒకప్పుడు ఎన్నో అనుకున్నాం. ఎన్నెన్నో కలలుగన్నాం. ఇప్పుడు చూస్తే చుట్టూ కాలుష్యం, మూఢ విశ్వాసాలు, తెలివి ఎక్కువ కలవారి దోపిడీ, అహంకార ధోరణులు, బలహీనులపై, స్త్రీలపై పెరుగుతున్న అత్యాచారాలు, అధికార గణం, అవినీతి, కులాల పేరుతో అమాయకుల కష్టార్జితం దోచుకుని బలపడి, తమ పలుకుబడిని రాజకీయాల్లో వ్యాపింపచేసి భ్రష్టు పట్టిస్తున్న కుటిలత్వాల విజృంభణ... అంతా అసహ్యంగా, రోతగా ఉంది. 60వ దశకం తర్వాత సినిమా భారతీయ యువతను నిష్క్రియాపరంగా మార్చివేసింది. అంతరాత్మలు లేనివారంతా సినిమాను చేజిక్కించుకుని తమ అథమ స్థాయి అభిరుచులు తీర్చుకుంటూ అదే గొప్పగా ప్రచారం చేసుకున్నారు. ఎంజాయ్‌మెంట్ పేరుతో స్టుపిడిటీ వ్యాపించింది. ఇప్పుడు టివి చానళ్లతో ఈ కాలుష్యం ఇంకా పెరిగింది. ఇది 'సాఫ్ట్ ఫోర్న్' తప్ప ఇంకోటి కాదు. సినిమాల్లోని వంచన, వేనిటీ రోత పుట్టిస్తాయి. లేకపోతే స్విట్జర్లాండ్‌లో పాట తీయడమేమిటి?


***మీకు బాగా నచ్చిన కథకులెవరు?***

రావిశాస్త్రి నాకు చాలా ఇష్టం. అంతకంటే గొప్ప ఆరాధనా భావం. ఆయన కార్నర్ సీట్ కథ నాకు చాలా ప్రియమైంది. శ్రీపాద కూడా గ్రేట్. ఇవన్నీ నేను చాలాసార్లు రాశాను.

**(ఇంటర్వ్యూ: తెలకపల్లి రవి)**

## మర ప్రపంచం

- సత్యభాస్కర్
9848391638



అంతరిక్షంలోకి విజ్ఞానం
పాతాళంలోకి మానవత్వం
భక్తి పెరుగుతోంది ఇబ్బడి ముబ్బడిగా
దయ తరుగుతోంది
అంతకన్నా వేగంగా
ఎందుకమ్మా! చెప్పు గూగులమ్మా!
అన్నీ తెలిసిన వికిపీడియా
నువ్వయినా దీన్ని విప్పి చెప్పగలవా!?
మాయమైపోతున్న మనిషిని
వెదికి తెచ్చిపెట్టగలవా, ఓ గూగులమ్మా!
సెల్ టవర్‌లతో
లొకేషన్ అయినా చెప్పగలవా!?
మనుషుల మధ్య సోషల్ మీడియా
సంబంధాలు కలిపే వారధినా
తెగతెంపులు చేసే కత్తెరనా!?
ఫేస్‌బుక్‌లో ఛాటింగ్
వాట్సప్‌లో గ్రూప్ మీటింగ్
సెల్‌ఫోన్‌లో కాన్ఫరెన్స్‌లు
ట్విట్టర్‌లో చిటపటలు
మేమంతా దగ్గరయ్యామా లేక
ఎవరిలోకంలో వాళ్ళుండే
పిచ్చాసుపత్రి
పేషెంట్లమయ్యామా!?
గూగులమ్మా! నువ్వయినా ఓసారి
చెప్పవమ్మా!
టెక్నాలజీ ఇంకా పెరుగుతుందట
డ్రోన్‌లు డోర్ డెలివరి చేస్తాయట
రోబోలు వచ్చి మురిపిస్తాయట
మనుషుల అవసరం లేని
ప్రపంచాన్ని సృష్టిస్తాయట!
చాలు బాబోయ్! చాలు
ఈ మాయమాటలు నమ్మే
సాలెగూడులో అదే
వరల్డ్ వైడ్ వెబ్‌లో
చికుక్కున్నాం!
మళ్ళీ మనుషుల్లా మారడానికి
నువ్వే ఓ ఉపాయం చెప్పు
గూగులమ్మా! ♦

---

## స్వేచ్ఛ

తమిళం : శబరినాధన్
ఆంగ్లానువాదం : ముగైయూర్ అశద
తెలుగు : పాయల మురళీకృష్ణ

బడి ఆటస్థలంలో
చిరకాల విద్యార్థి లా ఓ వేపచెట్టు
దానికి శాశ్వత బంధీలా వేలాడుతున్న బడిగంట
అకస్మాత్తుగా దూరవాణి మ్రోగుతున్న గింగుర్లు తిరిగే శబ్దం
అప్పుడే మా మాస్టారు నా చేతికి ఇనుప రాడ్డందించాడు
ఆ రోజు బడి చివరి గంట నేనేకొట్టాను
ఆ దృశ్యం ఎప్పటికీ చెరిగి పోనిది
కొన్ని కాకులు వేపచెట్టు మీంచి ఒక్కసారిగా
రివ్వుంటూ ఎగిరాయి
రెండంతస్తుల బడి భవానానికి
అమాంతంగా ప్రాణం వచ్చినట్లు
లేచి నడిచే చైతన్యం
విద్యార్థులంతా పరిగెడుతూ
గేట్లు దాటుతుంటే
జైలు గేట్లు బద్దలైన స్వాతంత్ర్యం
చెట్ల లేత ఆకులు
మూగ పిల్లల చేతి వేళ్లను పోలినట్లు



కృతజ్ఞతలకు సంకేతాలై
ఊగుతున్నాయి
అన్నీ స్వేచ్ఛా జీవనంలోకి
తిరిగి వచ్చిన వాతావరణం
ద్వివర్ణ శోభితమైన ఆకాశంలో
వెచ్చని గాలి నింపిన బూరలా
భూమి పైపైకి ఎగురుతున్నట్లుంది
దూదిపింజల్లాంటి మేఘాల మధ్య
వేలాడుతూ నాకు నేను కనిపిస్తున్నాను
అవును.. భవిష్యత్తు..
ఎంత అందంగా ఉంటుందో... ♦



# పాఠకులనూ, రచయిత్రులనూ పెంచిన సులోచనారాణి

- తెలకపల్లి రవి

***మన పురుషాధిక్య సమాజ నేపథ్యంలో  సులోచనా రాణి కృషిని ప్రత్యేకంగా అంచనా కట్టవలసి వుంటుంది. స్త్రీలు చదువుకోవడం రాయడం పెద్దగా ప్రోత్సహించబడని చోట కలం పట్టుకుని తనకంటూ ఒక లోకాన్ని సృష్టించుకోవడం చిన్న విషయం కాదు. జీవన తరంగాలు, మీనాతో మొదలుపెట్టి సులోచనా రాణి నవలలు చిత్రాలుగా రావడం, అఖండ విజయాలుసాధించడం ఆమెకు మరింత ఆకర్షణ తెచ్చిపెట్టింది. ఈ విషయంలో ఆమెను మరెవరితో పోల్చలేము. మొదటి స్టార్ రైటర్ అంటుంటారందుకే! టీవీ సీరియల్స్ మొదలైనాక ఆమె రుతురాగాలు తొలి తెలుగు మెగా ధారావాహిక కావడం కూడా సహజంగా జరిగిపోయింది. సామాజిక సమస్యలు సిద్ధాంతాల ప్రస్తావన లేకుండా కేవలం ప్రేమ కోపతాపాలు  సెంటిమెంట్లతో కథ నడిపించేస్తారని ఆమెపై విమర్శ వుండేది.ఆమె నవలల్లో ఇలాటి సామాజిక చర్చ వుండని మాట నిజమే గాని వ్యక్తిగత స్థాయిలో అమ్మాయిల ఘర్షణ, ఆత్మగౌరవ అస్తిత్వ పోరాటం పుష్కలంగా చూడొచ్చు. వాటిని కష్టాలుగా అణచివేతగా గాకుండా ఆయా కథానాయకులు వ్యక్తిగత పోకడలుగా సమాజంలో చవకబారు లక్షణాలుగా మాత్రమే  చూపించేవారు.***


యద్ధనపూడి సులోచనా రాణి మరణంతో తెలుగు సాహిత్యం ఒక ప్రథమ శ్రేణి రచయిత్రిని కోల్పోయింది. ప్రజలను ముఖ్యంగా మహిళలను అమితంగా ఆకర్షించి ఉత్సాహపర్చిన కలం ఆమెది. తొలి నవల సెక్రటరీతోనే తారాపథంలోకి దూసుకువెళ్లి రచయిత్రులకు ఒక ప్రాచుర్యం కల్పించిన ప్రత్యేకత ఆమెది. సెక్రటరీ నవల తొంభై ముద్రణలు పొందడం తెలుగు సాహిత్యంలో అపూర్వమైన విజయమే. ఈ నవల మరో పదేళ్ల తర్వాత చలన చిత్రంగానూ విజయం సాధించింది. జీవన తరంగాలు, మీనా, విజేత, అగ్నిపూలు, ఆరాధన, కీర్తి కిరీటాలు, ప్రేమలేఖలు, ఆత్మీయులు, గిరిజాకళ్యాణం, చండీప్రియ, రుతు రాగాలు, పార్థు, ఈ తరం కథ, బంగారు కలలు వంటి ఇంకా అనేక నవలలు ఆమె వెలువరించారు. అప్పటి వారపత్రికల్లో సీరియల్‌గా వచ్చే ఆమె నవలల కోసం పాఠకులు ఎంతగానో నిరీక్షించేవారు. ప్రచురణకర్తలు పరితపించేవారు.

1967లో వెలువడిన సెక్రటరీ నూతన విద్యాధిక యువతుల మనోభావాలను ఆశలనూ ఆకాంక్షలకూ అద్దం పట్టింది. దాంతోపాటే ఈ తరం మహిళలకు చదవడంతో పాటు రాయడం కూడా అలవాటు చేసింది. ఇది ఎంత వరకూ వచ్చిందంటే పురుషులు కూడా మహిళల పేర్లు కలం పేర్లుగా రాసేంత! ఇదోరకం వెక్కిరింతగానూ మారింది.( ఆమె నవల ఆధారంగా తీసిన సెక్రటరీ చిత్రంలోనే గిరిజ పాత్ర ఇలాటి వెక్కిరింతే) కాని మన పురుషాధిక్య సమాజ నేపథ్యంలో సులోచనా రాణి కృషిని  ప్రత్యేకంగా అంచనా కట్టవలసి వుంటుంది. స్త్రీలు చదువుకోవడం రాయడం పెద్దగా ప్రోత్సహించబడని చోట కలం పట్టుకుని తనకంటూ ఒక లోకాన్ని సృష్టించుకోవడం చిన్న విషయం కాదు. జీవన తరంగాలు, మీనాతో మొదలుపెట్టి సులోచనా రాణి నవలలు చిత్రాలుగా రావడం, అఖండ విజయాలుసాధించడం ఆమెకు మరింత ఆకర్షణ తెచ్చిపెట్టింది. ఈ విషయంలో ఆమెను మరెవరితో పోల్చలేము. మొదటి స్టార్ రైటర్ అంటుంటారందుకే! టీవీ సీరియల్స్ మొదలైనాక ఆమె రుతురాగాలు తొలి తెలుగు మెగా ధారావాహిక కావడం కూడా సహజంగా జరిగిపోయింది. సామాజిక సమస్యలు, సిద్ధాంతాల ప్రస్తావన లేకుండా కేవలం ప్రేమ, కోపతాపాలు సెంటిమెంట్లతో కథ నడిపించేస్తారని ఆమెపై విమర్శ వుండేది.

ఆమె నవలల్లో ఇలాటి సామాజిక చర్చ వుండని మాట నిజమే గాని వ్యక్తిగత స్థాయిలో అమ్మాయిల ఘర్షణ, ఆత్మగౌరవ అస్తిత్వ పోరాటం పుష్కలంగా చూడొచ్చు. వాటిని కష్టాలుగా అణచివేతగా గాకుండా ఆయా కథానాయకులు వ్యక్తిగత పోకడలుగా సమాజంలో చవకబారు లక్షణాలుగా మాత్రమే చూపించేవారు.

సులోచనా రాణి నవలలు బాగా ఆదరణ పొందిన కాలంలోనే తెలుగు సాహిత్యంలో విరసం పుట్టింది. సాహిత్యవిమర్శలోయాంత్రికత అప్పుడు కొంత వరకూ రాజ్యమేలింది. సులోచనా రాణి నవలలు నేల విడిచి సాము చేస్తాయని, సిమెంటురోడ్డుపై రాజహంస లాటి కార్లలో వచ్చే ఆరడుగుల రాజశేఖరాల కోసం నాయికలు నిరీక్షిస్తుంటారని అపహాస్యాలు అధికంగా నడిచాయి. సెక్రటరీ నవలలోనే నాయకుడు ఆధునిక వ్యాపార వేత్తగా వున్న మాట నిజమే. సామాజిక ఇతివృత్తాలు గల కథల్లోనూ అది అసాధారణం కాదు. ఎటొచ్చి సంస్కారవంతుడుగా ఆధునికుడుగా వుండి తమను ప్రేమగా చూసుకోగల కథానాయకుడి కోసం అమ్మాయిలు ఎదురు చూడటం ఆనాటికి పగటి కలలు కనడంగా తోచింది. ఇవన్నీ మిల్స్ అండ్ రాబిన్స్ నవలలకు అనుకరణలని కొట్టిపారేశారు కొందరు. ఆ నవలల్లో శృంగారవ్యామోహమే ప్రధానమైతే సులోచనారాణి నవలల్లో కేవలం ప్రేమభావనే వుంటుందని విమర్శకురాలు, ఆమెకు సన్నిహితురాలు మృణాళిని వివరించారు. జేన్ఆస్టిన్ రచనల ఛాయలు కొంత కనిపిస్తాయంటారామె. చదువుకున్న అమ్మాయిలు సంస్కారం వంతుడైన సున్నిత ప్రేమికుడి కోసం చూడటంలో తప్పేమీ లేదనడం కూడా కొందరు అంగీకరించలేకపోయారు. (చాలా విప్లవకరంగా రాసే ఒక సీనియర్ రచయిత్రి కూడా నాతో ఇంటర్వ్యూలో ఇలాటి మాటే అన్నారు) అప్పటికి స్త్రీల పట్ల వున్న సంకుచితత్వం ఇందులోనూ కనిపిస్తుంది. పై తరగతుల గురించి రాయడమంటే వారిని బలపర్చడం ఆకర్షణలకు లోనుకావడమే అవుతుందన్న పొరబాటు అవగాహన కూడా ఇందుకు కొంత కారణం. సులోచనా రాణి నాయికలు ఆ విధంగా తాము లోబడిపోబోమని చెప్పడానికి పెనుగులాడుతుంటారు. అయితే ఆనవలలు నాయికా ప్రధానమైనవేనని గుర్తుంచుకోవాలి. జీవనతరంగాలు, విచిత్రబంధం (విజేత) సెక్రటరీ చిత్రాల్లో నాయికగా నటించిన వాణిశ్రీ ఆనాటి యువతుల ఆరాధ్య నాయిక కావడం నవలల కొనసాగింపేనని చెప్పొచ్చు. అందమైన కథానాయకులను సృష్టించడం ఇతర పురుషులకు నచ్చివుండకపోవచ్చు. నా హీరో ఆరడుగులు వుంటాడని నేను ఒక్కచోటైనా రాసేనేమో చూడండి అని ఆమె ఒక సత్కార సభలో నాతో అన్నారు! అయితే ఏ దశలోనూ సులోచనా రాణి నవలల్లో మూఢనమ్మకాలు, లొంగుబాట్లు, ప్రలోభాలకు లోబడటం, ధన వ్యామోహం వంటివి చూడం. మామూలు మనుషులు అందులోనూ మహిళలు మర్యాద పూర్వకమైన జీవితం కోసం మదనపడటం ఆమె ఇతివృత్తం. సెక్రటరీలో పెట్టుబడిదారీ యుగపు తొలి అడుగులు కనిపిస్తాయి. మీనాలో ఇప్పుడు అందరూ చెప్పే పొసెసివ్ నెస్ చూస్తాం. తెలుగులో రెండుసార్లు చిత్రంగా వచ్చిన ఒకే ఒక్క నవల ఇది.

ఏమైనా తొలిరోజుల్లోనే కుటుంబాలలో పఠనాసక్తి రచనాశక్తి పెంచిన ఘనత నిస్సందేహంగా సులోచనారాణికి అధికంగా చెందుతుంది. తనకన్నాముందున్న తనతో పాటు రాస్తున్నరచయితలను కూడా కాదని ఆమె పాఠకులను ఆకట్టుకోవడానికి బలమైన శైలి జీవితాల మనస్తసత్వాల పరిశీలన దోహదం చేసింది. తనపై లత ప్రభావం వుందని కూడా చెప్పారు. అభ్యుదయ కరంగానూ వుండే కొందరి కంటే మామూలు అంశాలు బలంగా చెప్పగల శిల్పం ఆమెను ముందుభాగాన నిలిపింది. నవల రాసేముందు కథ అరగంట వివరించేవారట. సలహాలు సూచనలు తీసుకుని పూర్తి చేసేవారు. తర్వాత అక్షరం మార్చడానికి ఒప్పుకునేవారు కాదని 1980 ల తర్వాత ఆమె పుస్తకాలన్నీ ప్రచురించిన ఎమెస్కో విజయకుమార్ నాతో ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అదే సినిమాలకు ఇచ్చేశాక అ మార్పులు అస్సలు పట్టించుకునే వారు కాదట. వ్యక్తిగా సేవాదృష్టి, మానవీయత, ఆధునికత గల ఆమె పేరు కోసం లేదా సన్మానాలు ప్రచారాల కోసం పాకులాడకపోవడం మరో విశేషం. అపారమైన పాఠకాకర్షణ వున్నా సామాన్య వ్యక్తిగా ఇంటర్వ్యూలు సభలకు కూడా దూరంగా గడిపేవారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలను కూడా ప్రోత్సహించారు. ఆమెతో పరిచయం వున్నవారంతా ఆత్మీయతను గుర్తు చేసుకుంటారు. నిజంగానే ఆమె లేని లోటు తీరనిది. ♦



# నిశ్శబ్ద విప్లవాన్ని ధ్వనిస్తున్న సత్యాగ్ని కథలు

- డా॥ తవ్వా వెంకటయ్య
9703912727

ప్రపంచంలోనూ, భారతదేశంలోనూ, సమాజంలో పెనుమార్పులను తీసుకువచ్చిన 18వ శతాబ్ది నుండి, ఆయా సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులను సాహిత్యం ప్రతిబింబిస్తూనే ఉంది. వర్తమానంలోని సాంఘిక లొసుగులను విమర్శిస్తూనే, భవిష్యత్తు నిర్దేశం చేసింది. దీన్నే సాంస్కృతిక పునరుజ్జీవంగా కొనియాడారు చరిత్రకారులు. దీన్నే సంఘసంస్కరణ రచనలు అన్నారు సాహిత్యకారులు. ఇందుకు ప్రాచీన సాహిత్యంకంటే ఆధునిక సాహిత్యం ప్రధాన భూమిక పోషించింది. అందులో పద్యకవిత్వం, గేయకవిత్వం, వచనకవిత్వం, కథ ఈ ప్రక్రియలు మిగిలిన ఆధునిక సాహిత్య ప్రక్రియల కంటే ముందున్నాయనడంలో సందేహం లేదు. వర్తమానంలోని సమస్యలను కవిత్వం, కథ ప్రక్రియలు వీలైనంత ఎక్కువగా ప్రతిబింబించాయి. ముఖ్యంగా సామాజిక రుగ్మతల్ని 'ఎక్కడికక్కడ' విమర్శనాత్మకంగా చిత్రించడంతోపాటు ఆ సమస్యలకు పరిష్కార మార్గాన్ని కూడా సూచించాయి. భారతీయ సమాజాన్ని పట్టిపీడిస్తున్న భారతీయతను ప్రతిబింబించే గొప్ప రచనలే. అందులో సందేహం ఏమాత్రం లేదు. ఈ పరంపరలో 1980 ప్రాంతంలో కలంపట్టి తన చుట్టూ ఉన్న అంతర్గత సమస్యలను భావి ప్రపంచానికి తెలియజేస్తున్న కథారచయిత షేక్ హుస్సేన్ సత్యాగ్ని. మారుతున్న సామాజిక పరిణామాల దృష్ట్యా, అంతరించిపోతున్న మానవ సంబంధాల సందర్భంలో, ముస్లిం జీవితాలు భారతీయ సమాజంలో అంతర్భాగమైనప్పటికీ నేటి భారతదేశంలో ముస్లింలు పూర్తి నిర్లక్ష్యానికి, అణచివేతకు గురౌతున్న సందర్భంలో సత్యాగ్ని కథలను గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. 80వ దశకంలో సాహిత్య ప్రపంచంలోకి దూసుకొచ్చిన దళిత, మైనారిటీ, స్త్రీవాద సాహిత్యధోరణులను అధ్యయనం చేసినప్పటికీ సత్యాగ్ని మైనారిటీ రచయితగా మాత్రం మిగిలిపోలేదు. చాలామంది సాహిత్యకారులు ఆయనను ముస్లిం జీవితాలను మాత్రమే చిత్రంచే కథారచయితా ముద్రవేశారు. కానీ ఆయన సమాజంలోని పేద, బడుగు వర్గాల సమస్యలన్నీ తడిమిన రచయిత.

భారతదేశం అంటేనే భిన్న సంస్కృతుల సమాజం. ఇది జగమెరిగిన సత్యం. వరకట్నం, సతీసహగమనం, అంటరానితనం, బాల్యవివాహాలను నిరసించి రాసిన, వితంతు వివాహం. కులాంతర వివాహాలు, స్త్రీవిద్య, సమసమాజం సమర్థించి రాసినా, అవన్నీ భారతీయతను ప్రతిబింబించేవిగానే భావించారు విమర్శకులు. భారతదేశంలో భాగమైన ముస్లింలు తమ చుట్టూ ఉన్న అంశాలను రాస్తే మాత్రం అవి ముస్లిం సాహిత్యం, మైనారిటీ సాహిత్యం అంటున్న సాహిత్యకారులు పునరాలోచించాల్సి వుంది. ఎన్నో శతాబ్దాలుగా మిగిలిన భారతీయులతో పాటుగా ముస్లింలూ జీవిస్తున్నారు. వారి జీవిత

విశేషాలను, సమస్యలను సాక్షికంగా తెలియని భారతీయుడు లేడు. కానీ వారి జీవితాలకు అక్షరరూపం ఇవ్వాలని మాత్రం ఎవ్వరూ అనుకోలేదు. భారతదేశంలో ఎన్ని తెగలున్నా, కులాలున్నా, వర్ణాలున్నా, ప్రాంతాలున్నా ఈ భారతీయ సంస్కృతిలో మాత్రం అందరూ ఒదిగిపోయారు. ఇందులో ముస్లింలను వేరుచేసి చూడాల్సినపని లేదు. వీరి జీవితం గురించి ఆలోచించిన కథకులు అరుదుగా కన్పిస్తారు. అటువంటి అరుదైన వారిలో మొదటి కథారచయిత షేక్ హుస్సేన్ సత్యాగ్ని. ముస్లిం జీవితాలలో గూడుకట్టుకున్న చీకటి ధారలను బాహ్యపు ప్రపంచానికి తెలియజేయాలనే ఆలోచన రావడం ఒక ఎత్తైతే, వారి సంప్రదాయాలలోఉన్న లొసుగులను ధైర్యంగా చీల్చి చెండాడిన సత్యాగ్ని కథల గురించి అందరూ తెలుసుకోవాల్సి ఉంది.



గురజాడ, కందుకూరి తదితరులు హిందూ సంప్రదాయాలను, మనుధర్మాలను విమర్శించి సంఘసంస్కరణకారులు అయ్యారు. సతీసహగమనం ఆనాటి సనాతన ధర్మమని ఆచరిస్తే అది అసత్యమని సనాతన ధర్మాలకంటే మానవత్వం గొప్పదని భావించి తమ రచనలతో స్వీయసంప్రదాయాలను ఎదిరించారు. అదే దారిలో అంతే స్ఫూర్తితో సత్యాగ్ని పయనిస్తున్నారు. ఈయన కథలను చదివితే ఆదెంత సత్యమో అవగాహనకొస్తుంది. భారత సమాజంలో ముస్లింల నియమ నిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. అవి ముస్లిం స్త్రీల జీవితాలను ఆటబొమ్మలుగా మార్చాయి. ముస్లిం స్త్రీలు చీకటి చాటున బ్రతుకీడుస్తున్నారు. దీన్ని ఏ ముస్లిమేతర రచయితలు ప్రశ్నించలేకపోకపోయారు. ఆ బాధ్యతను సత్యాగ్ని గారు తీసుకున్నారు. తమ ముస్లిం జీవితాలలో స్త్రీల జీవితాల చుట్టూ అల్లుకున్న సందిగ్ధ వాతావరణాన్ని ప్రశ్నించాడు. నిలదీశాడు. తమ సంస్కృతి సంప్రదాయాలలో ఇస్లాంకు వ్యతిరేకంగా నడుస్తున్న కొన్నింటిని ఖురాన్‌ను ఉదహరించి ప్రశ్నించాడు. నిశ్శబ్దంగా అంతర్గతంగా ముస్లింలలో ఒక గొప్ప విప్లవానికి తెరతీశాడీయన.

ఈ అంశాలకు ఆయన కథలే ప్రతిబింబాలు. ఆ కథలకు ముందు సత్యాగ్ని జీవితాన్ని కొంతైనా తడమక తప్పదు. అతి సామాన్య కుటుంబంలో జన్మించిన ఈయన ఇప్పటికీ తాను పుట్టి పెరిగిన ఊళ్ళోనే స్థిరనివాసం ఉన్నారు. పుట్టపర్తి నారాయణాచార్యుల సన్నిహిత శిష్యులై ఉండడంవల్ల సంప్రదాయ సాహిత్యంపై మమకారం మెండు. అందులో భాగంగానే ఆయన కళాశాలలో చదువుకునే రోజుల్లో 'భగ్నవీణ' గేయకావ్యం రాశారు. ఇప్పటికీ 20పైగా కథలు రాశారు. విద్యార్థి ఉద్యమాలలోనూ, రాజకీయాలలోనూ క్రియాశీలకంగా పనిచేసినప్పటికీ షేక్ హుస్సేన్ గారి దృష్టి మాత్రం సాహిత్యం నుండి మరలలేదు. అందుకే నేటికీ రచనా వ్యాసంగాన్ని వదల్లేదు. అయితే ఈయన కథలన్నీ ముస్లిం జీవితాలలోని అంశాలతోపాటు అనేక సామాజిక అంశాలను చిత్రించాడు. రాశిలో తక్కువగా ఉన్నప్పటికీ వాసిలో మాత్రం గొప్పవి. ఇంతవరకూ తెలుగు కథాసాహిత్య చరిత్రల రికార్డు కాని అనేక అంశాలను తన కథలలో వస్తువులుగా చిత్రించారు.

తమ ముస్లింల ఈతి బాధల గురించి గానీ, వారి చుట్టూ కరుడుగట్టిన సంప్రదాయాల పైన గానీ ఏ కథా రచయితా కలం కదపడానికి సాహిసించలేదు. ఆ సమయంలో ధైర్యంగా, నిర్భాగ్యమైన ముస్లిం ప్రజల పక్షాన నిలిచిన రచయిత సత్యాగ్ని. అందుకే తమ గోడును, తమ సమస్యలను అక్షరీకరించడానికి ముస్లిం అయిన షేక్ హుస్సేన్ సత్యాగ్ని నడుం బిగించారు. కనుకనే ఈయన తొలితెలుగు ముస్లిం కథా రచయితగా గుర్తింపు పొందారు.

షేక్ హుస్సేన్ సత్యాగ్ని తన కథలన్నింటినీ కలిపి 'సత్యాగ్ని కథలు' పేరుతో 2015 ఏప్రిల్‌లో వెలవరించారు. 21 కథలున్న ఈ సంపుటిలోని కథలన్నీ సమాజంలోని అవినీతిని, రాజకీయ ముసుగు వేసుకున్న దోపిడీదారులను, ముస్లిం కుటుంబాలలో స్త్రీల దుస్థితిని అత్యంత తీవ్రంగా విమర్శకు పెట్టారు. తన కథారచనకు కొడవగంటి, రాచకొండ, రాచమల్లు ఊతమిచ్చారని చెప్పుకున్నారు. కానీ సత్యాగ్ని కథలలో మరో ఏ రచయిత ముద్ర కన్పించదు. ఏ ఒక్కరి శైలిని కూడా అనుసరించినట్లు కన్పించదు. తనదైన రీతిలో సమస్యను పాఠకుడి ముందు నిలుపుతాడు. ఎక్కడా సంక్లిష్టతలు గానీ, ట్విస్టులు గానీ కన్పించవు. రచయిత సామాన్య కుటుంబం నుండి రావడం, అదే సామాన్య ప్రజల మధ్య జీవించడం వల్ల కాబోలు ఈయన కథలు కూడా సామాన్య కుటుంబం నుండి రావడం, అదే సామాన్య ప్రజల మధ్య జీవించడం వల్ల కాబోలు ఈయన కథలు కూడా సామాన్య పాఠకుడికి సైతం సులభంగా అర్థం అవుతాయి. ఎంతటి గంభీరమైన అంశాన్నైనా, ఎంతటి తీవ్రమైన సమస్యనైనా చాలా సులభంగా సరళంగా చెప్పడం సత్యాగ్ని ప్రత్యేకత. ఈయన మరో విశేషమేమంటే కథా గమనంలో ప్రారంభం నుండి ముగింపు వరకు చదివితే తప్ప

పాఠకుడికి కథా లక్ష్యం అర్థం కాదు. పాఠకుడు ఏకబిగిన చదవాలి. చదువుతూ చదువుతూ కథను పాఠకుడు ఊహించలేడు. అలాగని కథలో అనుకోని సంఘటనను హఠాత్తుగా పాఠకున్ని ఉక్కిరిబిక్కిరి చెయ్యవు. కానీ కథను అంచనా వేయడం అంత సులభమైన అంశం కాదు.

రచయిత తాను చెప్పదలచిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా ఎటువంటి డొంక తిరుగుడు లేకుండా పాత్రలచేత పలికిస్తాడు. ముస్లిం సంప్రదాయాలపై ఆయన సంధించిన ప్రశ్నలు అన్నీఇన్నీ కావు. దానికి తగిన ఆధారాలనూ కథలో చూపడం రచయిత ముస్లిం సంప్రదాయాలపై మంచి పట్టుందనడానికి సాక్ష్యంగా నిలుస్తాయి.

ఈ కథల్లో మట్టిబొమ్మలు, యంత్రం, ముతా, పాచికలు, ఖులా, ముళ్ళ పొదపై మల్లెతీగలు, హలాలా, నూరు రూపాయలు వంటి కథలు ముస్లిం సంప్రదాయాలపై తిరుగుబాటు కథలు. ఇస్లాంలోని వాస్తవ విషయాలను చూపుతూ వాటిని తప్పుదారి పట్టిస్తున్న ముస్లిం సమాజాన్ని నిలదీశాడు.

'తలాఖ్' అనే సంప్రదాయానికి ముస్లిం స్త్రీలు ఎంత దారుణంగా బలి అవుతున్నారో రచయిత అనేక సందర్భాలను కథలుగా మలచాడు. అదే సమయంలో దాన్ని తీవ్రంగా నిరసించాడు. 'యంత్రం' కథలో రాజాఖాన్, తన భార్య రజియా సుల్తానాకు వరుసగా ముగ్గురు ఆడపిల్లలు పుట్టారని 'తలాఖ్' చెప్తాడు. 'తలాఖ్' అంటే భర్త భార్యకు విడాకులు ఇవ్వడం. భర్తకు దూరమైన రజియా సుల్తానాకు తమవారు మరో పెళ్ళి చేసుకోమంటారు. అందుకు ఆమె అంగీకరించలేదు. అంగీకరించకపోగా ముస్లిం స్త్రీలకు తలాఖ్ ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరిస్తానంటుంది. అందుకోసం ''లా'' చదువుతానంటుంది. రెండో పెళ్ళి చేసుకోవడం ధర్మమంటే "అవును నేను కాదనను. కానీ కారణం లేకుండా తలాఖ్ యివ్వమని మన ధర్మం చెప్పలేదు" అని నిలదీస్తుంది. రజియా ద్వారా పలికించిన ఈ తిరుగుబాటు స్వరం ముస్లిం స్త్రీలలో గొప్ప చైతన్యానికి నాంది. దాన్ని రచయిత ఎంత బలంగా ఆకాంక్షిస్తున్నాడో ఇట్టే అర్థమౌతుంది.

అనుమానంతో విడిపోయిన భార్యాభర్తలు, అర్థంపర్థంలేని ముస్లిం సంప్రదాయాల ఫలితంగా తిరిగి కలవలేక శాశ్వతంగా ఈ లోకం నుంచి దూరమైన దయనీయమైన స్థితిని కళ్ళగట్టిన కథ 'బంగారు కత్తి'. 'మట్టిబొమ్మలు' అనే మరో కథలో కువైట్‌కు వెళ్ళి వచ్చిన సుభాన్ తన భార్య అజీబున్ అక్రమ సంబంధం నడుపుతుందనే అనుమానంతో చంపి జైలు పాలౌతాడు. కౌన్సిలర్ సుభాన్ చెల్లెలుతో 'భార్య ఇష్టం లేకపోతే తలాఖ్ చెప్పాలి గాని చంపడమేమిటంటాడు. పురుషుల అనుమానానికి స్త్రీల జీవితాలతోపాటు తమ పిల్లల భవిష్యత్తు కూడా ఛిద్రమౌతున్న స్థితిని సహజంగా చిత్రించాడు రచయిత.

కేవలం ఒక రాత్రి సుఖం ఇవ్వలేదనే నెపంతో 'తలాఖ్' చెప్పే కథ 'పాచికలు'. ముస్లిం స్త్రీల జీవితాలు ఎంత నిర్భాగ్యంగా, సాగిపోతున్నాయో బయటి ప్రపంచానికి చాటిన కథ పాచికలు. అబ్దుల్లా రెండో భార్య షహనాజ్. ఓ రోజు రాత్రి తన భార్య సుఖం ఇవ్వడానికి సుముఖత కనపరచనందుకు 'తలాఖ్' చెప్తాడు. వాస్తవానికి షహనాజ్ తల్లికి తన తండ్రి తలాఖ్ చెప్పి ఉంటాడు. ఆ బాధలో ఆమె ఉంటే భర్త ఇటువంటి కోరికలు కోరాడు. ఆమె కాదంది. నానాజీ చేత పంచాయితీ పెట్టిస్తే "హృదయం లేని బొమ్మగా ఆయన కోర్కెలు తీర్చడమేనా నా పని. ఆ పని చేయకుంటే నాకాయన తలాఖ్ ఇస్తాడా? ఇది మీకు ధర్మమని తోస్తే నాక్కూడా తలాఖ్ ఇప్పించండి నానాజీ" అంటుంది. అందుకు నానాజీ మన ప్రవక్త తలాఖ్ ఇవ్వడం మంచిదని కాదన్నాడమ్మా! స్వార్థాలకు స్వప్రయోజనాలకు దాన్ని ఉపయోగించకూడదని ఆయన అభిమతం అంటాడు. కథలో తలాఖ్‌ను ముస్లిం కుటుంబాలు సక్రమంగా ఉపయోగించుకో లేదనే నిరసన ధ్వనిస్తూ ఉంది. తప్పుదారిలో నడుస్తున్న సంప్రదాయాలను సక్రమ మార్గంలో పెట్టేందుకు తనదైన పంథాలో కథా రచన చేశాడు రచయిత.

సత్యాగ్ని 'తలాఖ్' గురించి స్థిర నిర్ణయాలను, ఖురాన్‌లోని వాస్తవాన్ని ఇలా బహిర్గతం చేశాడు. అలాగే మరికొన్ని ముస్లిం సంప్రదాయాలపై ఇంతకన్నా తీవ్రస్థాయిలో నిరసించాడు. వితంతు స్త్రీలు రెండో పెళ్లి చేసుకునే అంశాన్ని కేంద్రీకృతంగా సాగిన కథ "ముళ్ళ పొదలపై మల్లె తీగెలు" ఫహిమా, కరీమూన్ అక్కాచెల్లెల్లు. ఫహిమా భర్త పెళ్ళైన కొన్ని సంవత్సరాలకే అనారోగ్యం వల్ల మరణించాడు. అప్పటి నుండి మెట్టినిళ్ళు, పుట్టినిళ్ళు పూర్తిగా నిరాదరించాయి. అటువంటి సమయంలో తనను తన పిల్లలకు సాయం అందించి అండగా నిలిచిన మిత్రుడిని రెండో పెళ్ళి చేసుకుంటుంది. అప్పటి నుండి బంధువర్గమంతా ఫహిమాను కొరకొరగా చూశారు. చెల్లెలు కూతురు పెళ్ళికి వచ్చిన ఆమెను అంటరానిదానిగా చూస్తుంటుంది. దాంతో కరీమూన్ తన అక్కతో నువ్వు రెండో పెళ్ళి ఎందుకు చేసుకున్నావంటుంది. 'నేనెవరి అనుమతి తీసుకొని రెండవ వివాహం చేసుకోవాల్సిన అవసరం లేదు. ఇస్లాం సంప్రదాయాలకు అనుగుణంగా ఏ వితంతువైనా స్వయం నిర్ణయం తీసుకోవచ్చు అంటుంది. ఆమెను చూసి చాటుగా మాట్లాడుకునే వారి తుప్పు వదిలేటట్లు పెళ్ళి కొడుకు' మన జగత్ ప్రవక్త మొదట వితంతువునే కదా వివాహమాడింది

అంటాడు. ముస్లిం వితంతు స్త్రీలు రెండో వివాహం చేసుకోవడం తప్పు కాదనే విషయానికి రచయిత ఈ కథ ద్వారా మరింత బలం చేకూర్చారు. అంతేగాదు, చాలామంది వితంతు ముస్లిం స్త్రీలలో రావలసిన చైతన్యానికి ఇది ఆరంభం.

ముస్లింల కుటుంబాల యువతుల పాలిట శాపంగా పరిణమించిన మరొక సంప్రదాయం 'ముతా'. దీని అత్యంత నిర్మాణాత్మకంగా చిత్రించి 'ముతా' తప్పని నినదించిన కథ "ముతా". ముతా అంటే పురుషుడు స్త్రీకి కొంత పైకం చెల్లించి కొంత గడువు వరకు భార్యగా స్వీకరించే సంప్రదాయం. గుడువు తీరిన తర్వాత విడాకులివ్వాలి. ఇందులోని లొసుగులను ఏమాత్రం సంకోచించకుండా బహిర్గతం చేశాడు రచయిత. కథలో తండ్రి మరణించిన మబీబ్ సేట్‌జీతో ముతా చేయాలని లాడ్జికి తీసుకెళతాడు మేనమామ. తెలిసి తెలియక అయిష్టంగానే వెళుతుంది హబీబ్. ఆ లాడ్జిలో 'మరియంబీ' అనే పనిమనిషి హబీబ్‌కు హితబోధ చేస్తుంది. 'ముతా మనకు హరాం (నిషిద్ధం). కొంతమంది భాగ్యవంతులు తమ విలాసాలు పండించుకోవడానికి దాన్ని హలాల్ (నిషిద్ధం కానిది) అంటున్నారు. 'ముతా' ప్రస్తావన ఖురాన్‌లో లేదు. ప్రవక్త ప్రవచనాలలో (హదీసులు) మాత్రం కన్పిస్తుంది' అని చెప్తుంది. చాలాకాలం యుద్ధంలో ఉండిపోయిన తమ అనుచరులకు స్త్రీ అవసరం తీర్చడం కోసం ఇస్లాం ప్రవక్త తాత్కాలికంగా అంగీకరించాడు. కానీ యుద్ధం ముగిసి నగరం చేరుకున్న తరువాత దాన్ని ఆచరించడానికి వీల్లేదని చెప్పాడంటుంది. వెంటనే హబీబ్ ఒక కాగితంలో 'స్వలాభాల కోసం సంప్రదాయాలను వక్రీకరించే పాడు బుద్ధులు మీవి. క్షమించండి. ఆ పాడుపని నా వల్ల కాదు. అందుకే మీ ముఖాలు చూడలేక దూరంగా వెళ్ళిపోతున్నాను" అని ఉత్తరం రాసి వెళ్ళిపోతుంది.

ఇది చూడ్డానికి, చదవడానికి కథగానే కన్పిస్తుంది. కానీ ఇది గొప్ప విప్లవం. రచయిత కలుషితం అవుతున్న తన కుల, మత సంప్రదాయాలపట్ల తీవ్ర ఆక్షేపణ ఈ కథలో ప్రతిబింబిస్తుంది. ఖురాన్‌లో లేని విషయాలను చెప్పి అమాయక ప్రజలను నమ్మించి స్త్రీల మానాలను భేరం పెట్టే పశువత్వాన్ని రచయిత నిరసించాడు. అందుకు ఖురాన్‌లోని నిజానిజాలను ఉదహరించి సామాన్య ప్రజల మనోనేత్రాలు తెరిపించే ప్రయత్నం చేశాడు.

ముస్లిం పురుషులు అహంపై చెంపదెబ్బ కొట్టి, ముస్లిం, స్త్రీలకు జరిగే అన్యాయాలకు అండగా నిలిచిన కథ 'ఖులా'. కథలో ఇమామ్ సాహెబ్ కూతురు 'నాదిరా'. అమ్మ చనిపోయినప్పటి నుండి ఎంతో గారాభంగా పెంచాడు ముస్లిం కట్టుబాట్లలో బంధీని చేయకుండా, మిగిలిన తెలుగింటి పిల్లలతో సమానంగా పెంచాడు. వయసొచ్చాక హుస్సేన్ భాషాతో పెళ్ళి జరిగింది. అత్తగారింటిలో చిత్రవధను అనుభవిస్తుంది. ముస్లిం వేషధారణ వేయడం లేదని నానా హింసలకు గురిచేశారు. చివరకు ఆమెపై అక్రమ సంబంధం మోపి కోర్టుకు లాగాడు. ఈమెకు 'తలాఖ్' చెప్పవలసిన కారణాలపై కోర్టులో వాదనలు ప్రతివాదనలు జరిగాయి. కానీ 'నాదిరా' తనపై ఇంత అన్యాయమైన, అవమానమైన నిందేశారని, కాబట్టి తన భర్తతో తానే ఉండలేదని ఖులా, ఖులా, ఖులా అని చెప్పింది. ముస్లిం సంప్రదాయంలో భర్తకు భార్య విడాకులివ్వడాన్ని ఖులా అంటారు.

ఈ కథ ముస్లిం స్త్రీల జీవితాలలో పెనుమార్పుకు శ్రీకారం చుట్టిన కథ. పురుషాధిక్యతకు తమ జీవితాలను నిలువుగా అర్పించి, తమను దహించి వేసుకుంటున్న స్త్రీలకు ఈ కథ ఒక దిక్సూచి. తమపై జరిగే అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కోవలసిన తీరును రచయిత వారి ముందుంచారు. సనాతన అంశాలే తమ బ్రతుకును ఛిద్రం చేస్తున్నప్పుడు దాని ఎదురు నిలిచి తమను తాము కాపాడుకోవలసిన అవసరాన్ని మేలుకొల్పాడు రచయిత.

ఇస్లాం సంప్రదాయంలో చాలా కఠిన నియమ నిబంధనలున్నాయి. మిగిలిన భారతీయ ప్రజలకంటే ముస్లింల కంటే అవి భిన్నంగా ఉంటాయి. కానీ అవి ఎటు తిరిగి ఎటు వచ్చినా చివరకు స్త్రీల బ్రతుకును ఆటగా మారుస్తాయి. అటువంటి కథ 'హలాలా'. హలాలా అంటే ఒకసారి భార్యకు తలాఖ్ చెప్పాక తిరిగి మనసు మార్చుకొని ఆమెను పొందాలనుకుంటే మాత్రం ఆమెకు వేరొకరితో నిఖా చేయాలి. తర్వాత ఆ రెండవ భర్త నుంచి ఆమెకు తలాఖ్ చెప్పించి అటు తర్వాత ఆమెను తన మొదటి భర్తను వివాహమాడచ్చు. హలాలా కథలో సనావుల్లా, షాజహానాకు వివాహమైంది. అత్తగారింట్లో ఆ పోరు తాళలేక కొన్ని రోజులు అమ్మగారింటికి వచ్చింది షాజహానా. కొన్ని రోజుల తర్వాత సనావుల్లా షాజహానా ఇంటికెళ్ళి ఆమె ప్రవర్తన మార్చుకోకపోతే తలాఖ్ చెప్పాల్సి వస్తుందన్నాడు. మాటల మధ్యలో మూడుసార్లు తలాఖ్ చెప్పాడు. మతకట్టుబాట్ల ప్రకారం ఇక వారిద్దరు విడిపోయారు. కానీ సనావుల్లా మాత్రం ఆమెను భార్యగా పొందాలనుకుంటాడు. కానీ అలా జరగాలంటే హలాలా జరిపించాలంటారు. అందుకు

కరీముల్లాతో షాజహానాకు నిఖా జరిపిస్తారు. కానీ వారిద్దరు శారీరకంగా కలవద్దని ముందుగానే కరీముల్లా. సనావుల్లా ఒప్పందం చేసుకుంటారు. ఈ విషయం తెలిసి కరీముల్లా అమ్మ హజానీమా ఆవేశం కట్టలు తెంచుకుంది. అలా ఇద్దరూ కలవకుండా, తిరిగి నీమొదటి భర్తతో నిఖా అయితే అది హలాలా ఎలా అవుతుందని ప్రశ్నిస్తుంది. దాంతో కరీముల్లా, షాజహానా కలుస్తారు. ఆ విషయం సనావుల్లాకు తెలుస్తుంది. షాజహానాకు తిరిగి తన భార్యగా స్వీకరించడానికి అంగీకరించకుండా కరీముల్లా ఇంటికొచ్చిన సనావుల్లా తిరిగి వెళ్ళిపోతాడు.

ఈ కథ ముస్లిం సంప్రదాయాలను ప్రతిబింబించేదిగా ఉన్నప్పటికీ ముస్లిం స్త్రీల జీవితాలు ఆటబొమ్మలుగా మారుతున్న దుస్థితిని చిత్రించాడు రచయిత. మారుమూల గదుల్లో ముస్లిం స్త్రీ హృదయ వేదనను, వారి చుట్టూ అలుముకున్న కారు చీకట్లను బయటి ప్రపంచానికి తెలియజేశాడు. అది ప్రపంచ ప్రజల దయాదాక్షిణ్యాలను పొందడానికి కాదు. ముస్లిం స్త్రీల బాధలు వారి సమస్యలు బయటి వారికి అర్థం కావాలనే ఆకాంక్షకు నిలువుటద్దం. అదే సమయంలో ముస్లిం స్త్రీలు వారి కట్టుబాట్ల మధ్య ఎంతటి చిత్రవధను అనుభవిస్తున్నారో ముస్లిం పురుషులకు మత పెద్దలకు చెంప చెల్లుమనిపించేట్లు తెలియజేయడం. షేక్ హుస్సేన్ సత్యాగ్ని కేవలం ముస్లిం జీవితాల చిత్రణకే పరిమితం కాలేదు. భారతీయులందరి పక్షాన కలం కదిలించారు. ప్రభుత్వ అవినీతిపైనా, భారతీయ ముస్లిం స్త్రీలను గల్ఫ్ దేశాలకు తీసుకెళ్ళి వారిని సేట్‌లకు అమ్ముకునే అన్యాయాన్ని, భారత ప్రజలను మోసం చేస్తున్న దొంగ స్వామీజీల జీవితాలను, మూఢనమ్మకాలకు బలౌతున్న సామాన్య ప్రజల బ్రతుకు చిత్రాన్ని, ప్రజలను నిలువునా దోచుకుతింటున్న రాజకీయనాయకులు, పెట్టుబడిదారుల అడ్డగోలు దోపిడిని బహిర్గతం చేశాడు. ఇలా అనేక అంశాలపై స్పందించారాయన. ఉన్నతమైన, ఆదర్శవంతమైన భారత సమాజాన్ని కోరుకున్న సత్యాగ్ని గారికి కేవలం ముస్లింవాద కథారచయితా విమర్శకులు ముద్రవేయడం అన్యాయం.

"నూరు రూపాయలు" కథలో పొట్ట కూటికోసం, తమ పిల్లల కడుపు నింపడం కోసం తమ శీలాన్ని కంపచెట్ల మధ్య పరచిన స్త్రీల జీవితాలను హృదయవిదారకంగా మనముందుంచాడు. "వినిపించని విడ్పులు" కథలో బ్రతుకుదెరువు కోసం అమ్మాయిల్ని గల్ఫ్‌దేశాలకు తీసుకెళ్ళి ఉపాధి పేరుతో వారి తెగనమ్మే భయానక సంఘటనను చిత్రించాడు. "కబోది" కథలో బ్రతకడం కోసం కువైట్‌కు వెళ్ళిన సుబ్బమ్మ కూతుర్ని సేట్ చంపాడు. అందుకు కళ్ళముందు కదలాడించాడు. నిరుద్యోగ తీవ్రతను, ఉన్నత వర్గాలను చూసి మధ్యతరగతి అలాగే ఉండాలని చేస్తున్న బ్రతుకు ఫీట్లను, భర్తను తన చెప్పు చేతల్లో పెట్టుకోవాలని విఫలయత్నం చేసిన ఇల్లాలి జీవితాన్ని వాస్తవంగా తన ముందుంచిన కథ "అజాత శత్రువు". స్త్రీల చుట్టూ అలుముకున్న సమస్యలను స్త్రీలే అధిగమించాలనే స్ఫూర్తిని కలిగించే కథ "బలిదానం". అధికారం అందితే బాల్యమిత్రుడు కూడా తృణీకరించి పదవుల వెంట పరుగులు తీసే కథ "కుచేలుడు". అసలైన ప్రజాస్వామ్యంలో అంతిమంగా నిరంకుశవాదులపై బహిర్గతం చేసిన కథ "హనుమంతుడికి కోపమొచ్చింది". 'స్వాతంత్ర్య సమరయోధుల' ముసుగులో అవినీతి నాయకులు నిజమైన స్వాతంత్ర్య సమరయోధులకు అన్యాయం చేస్తున్నారు. వారిని చూసి సమాజం సిగ్గుపడేలా నిజాన్ని నిగ్గు తేల్చిన కథ 'స్వాతంత్ర్య సమరయోధులు'. ఆదర్శవంతమైన ఉపాధ్యాయుడంటే, మార్గదర్శకుడైన గురువంటే ఎలా ఉండాలో తెలియజెప్పిన కథ "జుట్టుస్వామి". సత్యాగ్ని తర్వాత తెలుగు కథా సాహిత్యంలో స్మయిల్, గులామ్, ఇస్మాయిల్, యం.డి.సౌజన్య, దేవిప్రియ, మహమ్మద్ షంషుద్దీన్, సయ్యద్, దావూద్ ఆలీ, షేక్ ఖాజా మొహిద్దీన్ సలీమ్, ఖదీర్‌బాబు, ఖాజా, శ్రీమతి షహనాజ్, శశిశ్రీ, విద్వాన్ సప్తగిర, అమీర్, చందోలి, రాజా హుస్సేన్, షేక్ మౌలాలి, వేంపల్లి షరీఫ్, ఖలందర్ వంటి ఎంతోమంది ముస్లిం జీవితాలతోపాటు మిగిలిన అనేక అంశాలపై కథలు రాస్తున్నారు. వీరందరికి స్ఫూర్తి నిచ్చిన కథకులు సత్యాగ్నిగారు. ఆయన కలం పట్టి ముస్లిం జీవితాలను చిత్రించి, అందులోని లోపాలను ఎండగట్టే వరకు ఆ ధైర్యం ఏ ఒక్కరికీ లేకపోయింది. అయితే తొలి ముస్లిం కథారచయితగా సత్యాగ్ని తన స్థానాన్ని పదిలపరచుకున్నారు.

ముస్లిం పెద్దలకు గానీ, మరెవ్వరికి గాని భయపడకుండా ముస్లిం సమాజంలో అక్కరకురాని సంప్రదాయాలను విమర్శిస్తూ సాగుతున్న షేక్ హుస్సేన్ సత్యాగ్ని గారికి ముస్లిం స్త్రీలు, ముస్లిం ప్రజలు ఎప్పటికీ ఋణగ్రస్తులే. సత్యాగ్ని కథలు ఇప్పుడిప్పుడే ముస్లిం చాంధసవాద సంప్రదాయాలను కూల్చేందుకు కావలసిన విప్లవాన్ని ఆవేశాన్ని, ఆలోచనను ప్రజలలో రగిలించాయి. అవి క్రమంగా తమ విస్తృతిని పెంచుకోక మానవు. ముస్లిం సోదరీమణుల జీవితాలలోనూ, వారి కుటుంబాలలోనూ కొత్త వెన్నెలలు వెదజల్లక మానవు. ♦

# దర్శనం

- పల్లిపట్టు నాగరాజు
9989400881

ఇప్పుడే
నేను మనిషిని జూసొచ్చాను
మరయంత్రాల గజిబిజి బతుకుల నడుమా..
ఒక మనిషితో మనసునిండా మాట్లాడొచ్చాను..

బతుకులు నాల్గురోడ్లుగా విడిపోతున్నచోట
తెగిపోయిన చెప్పుల్ని కలిపి కుడుతున్నట్టే
బంధాల్ని మోసంలేని నవ్వుతో పెనేసేటోన్నీ
మట్టి మూలాలపై
మోడువారుతున్న చెట్టై కదిలే కడగొట్టుతనాన్ని
కళ్ళనిండా నింపుకొచ్చాను...


నెరిసిన కనుబొమ్మల కింది
నీరసించిన కనుపాపలవాడు
పెరిగిన గెడ్డంమాటున
పిడసకూటికోసరం గొంతులో పిల్లికూతలవాడు..
మాసిన తలగుడ్డ మరకలు చొక్కాయి లో
ఎముకల గూడుదేహాన్ని కప్పెట్టుకుని..
ఎండిపోతున్న గొంతులోకి
పుక్కిటలో
ఎప్పుడో వేసుకున్న వక్కాకుతడి వొంపుతూ..

తూరాయి చెట్టుతావా ఉక్కపోతల పొడెండలో
రెండు చినిగిన గోతాల్ని పందిరిగా గట్టుకొని
వానకాయితాల్ని పరుచుకున్న ఆసనంపైన
అచ్చం బోధివృచ్ఛం కింద బుద్ధదేవుడిలా వున్నా
మా తాతని దర్శించుకొనొచ్చాను...

గుడిలోదేవుడి ముందు అందరూ
జోళ్ళు వదిలి నిల్చి దండంబెట్టినట్టూ
వృత్తికాళ్ళతో ఆయన ముందర
నిలబడ్డవాళ్ళని చూస్తూ రవ్వంత గర్వంతో

నేనూ మోకాళ్లపై వొంగి కూకోని
ఆ నేర్పరితో నాలుగు మాటలు మాట్లాడినాను...

ఎవరో ఒక మునిపుంగవుడు
తాళ పత్రాలకట్టల్ని ఎదుటుంచుకొని
లోక కల్యాణాన్ని రాస్తున్నట్టూ...



పాతచెప్పుల్ని ముందరేసుకుని
మట్టిపాదాల మద్దెన చెప్పుని వూని
ఆరె మొనలుపైన అలవోకగా
వేళ్ళని చూపుల్నికలిపి
మైనం పూసిన దారంలా కుట్లేస్తావుంటే
ముక్కోటి దేవతలూ
తాత ముందే మోకరిల్లినంత
వేడుగ్గా కుశాలపడ్డాను.!

తాత
'ఆరి'పనితనంగురించి
పదునైన 'రంపె'ను గురించి
తోల్ని 'వారెలు'గా మార్చే వైనాన్ని
వారెను కోసి 'ఉంగుటాలు' మలిచే వడుపుల్ని
ఒక్కొక్కటీ కతలు కతలుగా వివరంగా చెప్తావుంటే

బతుకుతెరువుకి బడిలో పాఠం చెప్పే నేను
బతుకు రహస్యాల్ని విడమర్శి చేస్తున్న
ఆ కర్మయోగి జ్ఞానబోధను
ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నాను..

కాలం అడుగులు కందిపోకుండా కావిలికాస్తూ
వస్తాబోతావుండే పాదాలనాయన పరికించే...
ఆ పుణ్య మూర్తి చూపుల్ని
తడితడిగుండెతో నేనొకతూరి తడిమి వచ్చాను...

తెగిన చెప్పుని కుట్టించుకొద్దామనిపోయి
తెగిపోయిన నా మూలాలజల్లులో
తిరిగా...
ఒక పారి తడిసొచ్చాను
మా ముత్తాత జాంబవంతున్ని
దర్శించుకొచ్చాను..!!

( తెగిన చెప్పు కుట్టించుకుని వస్తుంటే లోపలి కదలిక)



# రంగుల హరివిల్లు

కె. ఉషారాణి - 9492879210

అలక అంటే అల్లరి. అలక అంటే సందడి. అలక అంటే పండగ. పచ్చని ఛాయతో అలక పున్నమిని మరిపిస్తుంది. మెలుకువగా ఉందంటే మాటల యంత్రం మూతపడదు. విజయ, వెంకట్ రావు ల గారాలపట్టి అలక ఇంట్లో ఉంటే వస్తువులన్నిటికి స్థానభ్రంశం తప్పదు. నాన్న కళ్ళద్దాలను వంటింట్లో, వంటింట్లోని అమ్మ చేతిగుడ్డ టి వి పక్కన, టి వి పక్కనున్న అన్న మొబైల్ బాత్రూంలో … పొద్దున్నే అందరికీ వెతుక్కునే పనిపెట్టి అలక వార్తలలో మునిగి పోతుంది. అందరినీ ఎంతగా ఆటపట్టించినా అవసరమయినప్పుడు ఆదుకోవడం అలకలా మరెవరికీ సాధ్యం కాదు. అందుకే ఇంట బయటా అందరి తలలో నాలుక అలక.

ఇంగ్లీష్‌లో మాస్టర్ చేసి ప్రస్తుతం బెంగుళూరు సెయింట్ జేవియర్‌లో ఎంబిఏ చేస్తోంది. వచ్చే సెమిస్టరుతో చదువు పూర్తవుతుంది. కాంపస్‌లో సెలెక్షన్ కూడా వచ్చింది. అమ్మ నాన్న తమ బాధ్యత అనుకుని పెళ్లి ప్రొపొసల్స్ ముందుకు తెచ్చారు. వెంకట్ రావు కూతురిని ఆర్థికంగా స్వతంత్రంగా ఉండేటట్టు, స్వతంత్రంగా ఆలోచించేట్టు పెంచారు. అయినా సంప్రదాయాలంటే గౌరవం. అందుకే పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టారు. తన రిటైర్మెంట్‌లోగా అలకను ఓ ఇంటిదాన్ని చేయాలని సగటు తండ్రిలాగే కలలు కంటున్నాడు.

‘‘అలకా! ఈ ప్రపోజల్ చూడు ! అబ్బాయి బెంగుళూరులో ప్రైవేటు బ్యాంకు ఆఫీసర్. మంచి పొజిషన్‌లో ఉన్నాడు. ఆఫీస్‌లో మంచి పేరుంది. హైదరాబాద్‌లో అమ్మా నాన్న. ఇద్దరూ బ్యాంక్స్‌లో సర్వీస్ చేసే రిటైర్ అయ్యారు. అక్కడే స్వంత ఇల్లుంది. అక్కకి పెళ్లయి హైదరాబాద్‌లోనే ఉంది. నీకు కూడా బెంగుళూరులోనే జాబ్ వచ్చింది కాబట్టి ఇద్దరూ హాయిగా ఉండవచ్చు. అన్నిటికన్నా వాళ్ళకు బాగా ఇంటరెస్టింగ్‌గా ఉంది. రెండురోజులకు ఒకసారి ఫోన్ చేస్తున్నారు. నువ్వు వచ్చిన తరువాత మాట్లాడి చెప్తామన్నాను” చెప్పడం ముగించి సమాధానం కోసం అలక వైపు చూసాడు.

“నా పరీక్షలింకా కాలేదు కదా నాన్నా !” అంటూ దాట వేయబోయింది.

“పెళ్లి పరీక్షలయిన తరువాతే పెట్టుకుందాం. మాట్లాడితే బాగుంటుందనుకుంటున్నాను. నీకు ఇష్టమయితేనేలే. ఆలోచించు. నేను, అన్నయ్య చూసాం. మాట్లాడాం. మాకు బాగుంటుందనే అనిపిస్తోంది. తొందరేం లేదు. నువ్వు వెళ్ళేలోగా చెపితే వాళ్ళకో మాట చెప్పవచ్చు.”

మొదటి సారిగా అలకలో అలజడి మొదలయింది.

మిగిలిన సెలవులు అవునా .. కాదా అన్న డైలమాతోనే

గడిచిపోయాయి. చివరికి నాన్నమీద నమ్మకం గెలిచింది. సరే నని చెప్పి బెంగుళూరు బయలుదేరింది.

పెళ్లి చూపులు సాంప్రదాయ బద్ధంగా జరిగాయి.

పెళ్ళికొడుకు ఆనంద్ పెద్ద అందంగా లేకపోయినా ఆరడగులున్నాడు. ఓకే అనుకుంది.

అలక చెప్పాలనుకున్న రెండు మాటలు చెప్పింది. "ఉద్యోగం ఎట్టి పరిస్థితులలోను మానను. పూజలు, నోములు, వ్రతాలూ చేయను. దేవుడిని నమ్మినా వ్రతాలు చేయడం స్వాములను సేవించడం ఇష్టంలేదు". ఆనంద్ ఇందుకు అంగీకరించాడు. వాళ్ళ అమ్మ, నాన్న, అక్కా కూడా అందుకు అడ్డుచెప్పలేదు. పరీక్షల తరువాతే పెళ్ళనుకున్నారు. అయితే పెళ్ళికి ఇంకా సమయం ఉన్నందువలన నిశ్చితార్థం చేయాలని నిర్ణయించారు. అలకకు కూడా ఇందులో ఇబ్బంది ఏమి కనిపించలేదు. పది రోజుల్లో నిశ్చితార్థం జరిగిపోయింది.

ఒకే ఊరులో ఉండడంతో ఆనంద్, అలక వీలయినప్పుడు కలిసేవారు.

అలకకు భయం పోయింది. నెమ్మదిగా ప్రత్యేకమయిన గుర్తింపుకు మురిసిపోవడం మొదలయింది.

పరీక్షలయిపోయాయి.

ముహుర్తాలు పెట్టుకున్నారు.

పెళ్లి కూతురిని చేయడం దగ్గరినుంచి అంపకాల వరకు అన్నీ సాంప్రదాయ బద్ధంగా జరిగాయి. ఆనంద్ అమ్మ ప్రతి చిన్న పెద్ద విషయంలో జోక్యం చేసుకుని తనకు నచ్చినట్టు చేయించుకుంది. కొన్ని విషయాలలో నచ్చకపోయినా తప్పదన్నట్టు సద్దుకున్నారు అలక అమ్మా నాన్న.

రిసెప్షన్ ఖర్చుకూడా అలక నాన్నని భరించమన్నా తగువుకు ఇష్టపడక, ఒకే గారాల కూతురి ఆనందం కోసం ఒప్పుకున్నారు అలక తల్లి తండ్రులు.

పెళ్లి అంటే సంబరం అనుకున్న అలకకు అడుగడుగునా అమ్మా నాన్న ఒదిగి ఉండడం ఆనంద్ వాళ్ల కోరికలు తీర్చడం చిరాకు తెప్పించాయి. ఆనంద్ చదువు తనతో సమానమే. ఇష్టపడే చేసుకుంటున్నాడు. తనూ ఉద్యోగం చేయబోతోంది. ఏం తక్కువని ఈ రకమయిన పెత్తనం? పెళ్లి తంతు ముగిసిన వెంటనే ఆనంద్ అన్న మొదటి వాక్యం "ఇక నుంచి మా అమ్మ చెప్పినట్టే విని నడుచుకో. మా అమ్మకు నచ్చనివి చేయాలని ప్రయత్నించకు. తనకు ఇష్టం లేకపోయినా నాకోసం నువ్వు ఉద్యోగం చేయడానికి ఒప్పుకుంది" అదిగో ఆ రోజుతో మొదలయిన అశాంతి రోజు రోజుకూ పెరుగుతూ పోయింది. ఇది వరకు ఆనంద్‌కీ పెళ్లి తరువాత ఆనంద్‌కీ పోలికే లేకుండా పోయింది. విజయ కూడా నెమ్మదిగా ఇవన్నీ సర్దుకుంటాయని అలకకే సద్దిచెప్పింది.

బెంగుళూరులో కాపురం పెట్టడం ఉద్యోగంలో చేరడంతో సమస్యలు మరింత జఠిలమవడం మొదలయ్యాయి. వంటలో ఇంటి పనిలో సాయం చేయక పోగా చేసిన వంట బాగులేదని పేచీ. ఆఫీస్‌లో ఆలస్యమయితే రభస. జీతం మొత్తం తన చేతికివ్వాలని ఆదేశం. శనివారం ఆదివారం తనకు సెలవు కాబట్టి అలక ఆఫీస్‌కి వెళుతున్నందుకు గొడవ. ఎం సి ఏ చదువుకుని, విదేశాలకు వెళ్లివచ్చి ఒక విదేశీ బ్యాంకులో పనిచేస్తూ ఇలాంటి అభ్యంతరాలు అలక ఊహకే అందలేదు. జీతం తక్కువని ఊడిగం దండగని రోజూ పేచీ. మొత్తం కుటుంబాన్ని హీనంగా మాట్లాడడం, బూతులు తిట్టడం మామూలయింది. వినివిని అలకకు నీరసం వచ్చింది. పెళ్లి సంబరాల అలలు ఒడ్డును ఢీకొని విచ్ఛిన్నం అవడం మొదలయ్యాయి. భరించే ఓపిక ఇక లేక అలక అమ్మ దగ్గరికి హైదరాబాద్ చేరుకుంది. రెండో రోజే ఆనంద్ వచ్చి సారీ చెప్పి ఏమాత్రం ఇబ్బంది పెట్టనని నమ్మించి తీసుకెళ్లాడు. ఏమాత్రమయినా తప్పు తెలుసు కుంటాడన్న చిన్న ఆశాకిరణం అలకను వెళ్లేట్టు చేసింది.

వెళ్లిన మరునాటి నుండి మళ్ళీ తిట్లు శాపనార్థాలు మొదలు.

"మా అబ్బాయికి కొంచం కోపం ఎక్కువ. తాను అరిచినప్పుడు నువ్వు మాట్లాడకు. తనే తరువాత నీకు నచ్చినట్టు మారతాడు" అంటూ ఆనంద్ అమ్మ అలకకే నీతి బోధ చేసింది. అయోమయంలో పడింది అలక.

ఇంట్లో రోజూ జరుగుతున్న గందరగోళాలకు మనసు పాడయి అమ్మను రమ్మంది. అమ్మే ఆనంద్ ప్రవర్తన చూసి సరయిన నిర్ణయం తీసుకోను సహకరిస్తుందని ఆశ. ఆ రోజు శనివారం. ఆఫీస్‌కి వెళ్ళింది. వెళ్లేముందు తన పనిలో లోపాలను చూపించి తిట్టి తిట్టి పంపించాడు. సాయంత్రం ఆఫీస్‌లో బాస్ ఈ ఆరునెలల కాలం పని బాగుందని మెచ్చుకుంటూ ఇంక్రిమెంట్ శాంక్షన్ చేసారు. కానీ సంతోషం ఎవరితో పంచుకోగలదు? భయపడుతూనే ఇంటికెళ్లింది. ఇంటికి వెళ్లేసరికి వాయింపుడు మొదలయింది. అలకనే కాదు భర్తను ఎలాచూసుకోవాలో చెప్పనందుకు విజయను కూడా

నానా తిట్లు తిట్టడం మొదలు పెట్టాడు ఆనంద్. తిట్ల వర్షం కొనసాగుతూనే ఉంది. రాత్రి తొమ్మిదయింది . అలకకు సహనం నశించింది. “సరే, నేనింతే . నాకు మరోలా ఉ ఒడడం చేతకాదు. నాకు కూడా నీ పద్ధతులు మాటలు నచ్చలేదు, నేను వెళ్ళిపోతే నువ్వేకదా మళ్ళీ పిలుచుకొచ్చావు” అంటూ నిలదీసింది. అంతే ఎదురు చెప్పినందుకు ఆనంద్ మరింత రెచ్చి పోయాడు. చివరకు వాదనలు పెరిగాయి. పచ్చి బూతులు తిడుతూ కోపంతో ఊగిపోయాడు. ఇంట్లో ఇక ఉ ఒడవద్దని తన మాటకు ఎదురు చెపితే సహించనని అరుపులు కేకలు మొదలెట్టాడు. అరిచి అరిచి బయటకు వెళ్ళిపోయాడు.

విజయ అలకను తీసుకుని హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమైంది. భర్తకు, వియ్యపురాలికి విషయం చెప్పింది. ఆమె, “నా కొడుకు కోపం నాకు తెలుసు. ఈ రాత్రికి ఎందుకు ? మేము ఇప్పుడే బయలు దేరి వస్తున్నాం. వాడికోపం పాలపొంగు. మేము వచ్చినాక బయలు దేరుదురు. ఆగమని వేడుకుంది”. విజయ మెత్తబడింది. తల్లీ కూతురు నడుం వాల్చారు. ఆరునెలలలో ముద్దులకూతురు జీవితం ఇలా అయినందుకు విజయకు నిద్ర పట్టలేదు. ఏమయినా ఇంతటి సంస్కార హీనుడితో బతకమని కూతురికి చెప్పదలుచుకోలేదు . తనతో తీసుకెళ్లాలనే నిర్ణయించుకుంది. ఆలోచనలతో సతమతమవుతున్నది.

గోడ గడియారం పన్నెండు కొట్టింది. రాత్రి నిశ్శబ్దంగా ఉండడంతో గంటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఊర కుక్కల అరుపులు అప్పుడప్పుడూ వినిపిస్తున్నాయి. కాలనీలోకి వస్తూ పోతున్న కారు శబ్దాలు, మోటారుసైకిల్ హారన్‌లు వినిపిస్తున్నాయి గంటకో గడియకో. ఆనంద్ ఇంకా ఇంటికి రాలేదు. ఈ ఇంటి నుండి బయటపడి ఉంటే బాగుండును. అనవసరంగా ఆగిపోయింది. తనే భరించలేని ఈ వాతావరణంలో అలకను వదలి వెళ్లడం అసంభవం? ఓ మాట ఎలాగూ వస్తున్నామంటున్నారు కాబట్టి వాళ్లకు కూడా చెప్పి తీసుకుని వెళ్లి పోతుంది. విజయ ఆలోచనలకు బ్రేక్ కొడుతూ మొబైల్ రింగ్ అయింది.

కొత్త నంబర్. ఎవరయివుంటారో అనుకుంటూ రెస్పాండ్ అయింది.

‘అమ్మా ! ఒక ఆక్సిడెంట్ జరిగింది. ఫన్ డే మాల్ దగ్గర. మొబైల్‌లో మీ ఫోన్ నంబర్ ఉంది. అందుకే మీకు ఫోన్ చేస్తున్నాను. ఒక సారి రాగలరా? హతాశురాలయింది. ఫన్ డే మాల్‌లోనే ఆనంద్ ఆఫీస్. ఏమైఉంటుందో అన్న ఆందోళనను కనపడనీయకుండానే అలకకు విషయం చెప్పింది. వెంకట్ రావుకి ఆనంద్ తల్లికి కూడా ఫోన్ చేసి ఇద్దరూ పరిగెత్తారు. అర్ధరాత్రి. కొత్తఊరు. కోలనీ లోని ఇంటి నుండి రోడ్ మీదికి వెళ్లి టాక్సీ పట్టుకోవాలి. పరుగు లాంటి నడకతో టాక్సీని పట్టుకున్నారు. టాక్సీ మాల్ చేరుకునే సరికి జనం గుంపులు గుంపులుగా ఉన్నారు. తనకు వచ్చిన నంబర్‌కి ఫోన్ చేస్తే ఓ పోలీస్ ఎత్తాడు. మనిషిని హాస్పిటల్‌కి చేర్చామని చెప్పి టాక్సీలో పంపాడు. తీరా హాస్పిటల్ చేరేసరికి ఆసలు విషయం బయటపడింది. నాలుగో అంతస్తులో ఉన్న రెస్టారెంట్‌లో ఆనంద్ కాసేపు కూచుని ఉన్నట్టుండి అక్కడినుండి దూకాడు. ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి. బాడీ పోస్ట్ మార్టంకి తెచ్చారు. బాడీని గుర్తించాలి. అలక పూర్తిగా షాక్‌లోకి వెళ్లి పోయింది. కళ్ళు చూస్తున్నాయి. కానీ మెదడు పని చేయడం లేదు. అసలు స్పందించడం లేదు. ఈ మనిషికి డిప్రెషన్ ఉందేమో అని అత్తగారితో ఒకటి రెండు సార్లు అలక అన్నా ఆమె తననే తిట్టిపోసింది. లేకపోతె ‘నన్ను హింసించడమేమిటి, తాను నాలుగో అంతస్తునుండి దూకడం ఏమిటి ? ఎలాగూ వెళ్ళ దలుచుకున్నాను మాట్లాడకుండా వెళ్ళిపోయి ఉంటే బాగుండేదేమో! అనవసరంగా ప్రాణం తీసుకున్నాడు? పెళ్లయిన నాటినుండి ఆనంద్ పెట్టిన హింస వలన నష్టపోయింది తాను. కానీ ఆనంద్ తీసుకున్న నిర్ణయం తన కన్నా అతని అమ్మా నాన్నలకే ఎక్కువ నష్టం అనిపించింది అలకకు ఆ క్షణానికి. జరగాల్సిన కార్యక్రమాలన్నీ జరిగిపోతున్నాయి.

దురదృష్టం! సంప్రదాయాలు మళ్ళీ ముందుకొచ్చాయి. కాళ్ళపారాణి ఆరకుండా అలకకు విధవ అన్న ముద్ర పడింది. క్రతువుకు పంపమని అత్తగారు ఒత్తిడి చేసినా విజయ పంపలేదు. క్రమేపి అలకకు తనకు జరిగిన నష్టం అర్థం అవడం మొదలయింది. బెంగళూరులో ఉద్యోగం మానేసింది. ఆడబడుచు అత్తగారిమాటల తూటాలు డిప్రెషన్లోకి నెట్టేశాయి. మనసు చేతనస్థాయికి వచ్చేందుకు రెండు నెలలు పట్టింది. డాక్టర్ సలహాతో హైదరాబాద్‌లోనే మళ్లీ ఉద్యోగం సంపాదించుకుంది.

కొత్త ఉద్యోగంలో కొత్త మనుషుల మధ్య గతం మర్చిపోవచ్చని ఆశపడింది. కానీ .. ఉహు గతం వెన్నాడడం కొనసాగుతూనే ఉంది.

## సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ నెల పురస్కారాలు

**ఎంతో చిన్నది జీవితం**
కథకు: **రూ.700/-**
రచయిత : **మహీధర శేషారత్నం**

**పూల రెక్కల చప్పుడు**
కవితకు : **రూ .500/-**
రచయిత : **కటిక మనోహర్**

■■■

***కథ, కవితకు సినీ రచయిత జనార్దన మహర్షి అందిస్తున్న పురస్కార చెక్కులు ఈ రచయితలకు అందుతాయి***

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు.*

**- ఎడిటర్**

ఓ రోజు

లంచ్ రూమ్‌లో అడుగు పెట్టబోతుంటే అడుగులు ఆగిపోయాయి.

అనిత "ఈ రోజు మా అక్కకి గాజులు పెడతారు మీరందరూ రావాలి. అలక విడో కదా ! అమ్మ పిలవవద్దనింది. అశుభం అంట. అందుకని తను లేనప్పుడు పిలుస్తున్నాను. వస్తే మళ్ళీ బాగుండదు."

ఆ రోజునుంచి సీట్ దగ్గరే లంచ్ చేయడం అలవాటు చేసుకుంది. లంచ్ రూంలో ఉన్న ముప్పైమంది అమ్మాయిలలో ఒకరు కూడా అలక తప్పులేదుకదా అనలేదు. అనుమానించేవారు. నాకెందుకులే అనుకునేవారు!

మరోరోజు

మనీషతో విగ్నేష్ "ఆ నరేన్ గాడు అలక సింగిల్ అనుకుని లైన్ వేస్తున్నాడు. నాకు డౌట్ వచ్చి పొద్దున్న చెప్పా. ఆమె విడో .. పైగా హస్బెండ్ సూయిసైడ్ చేసుకున్నాడు!" అని అనడం విన్నది. మనసు కకావికలం అయింది.

ఇంకోసారి, విరాజ్ ఓ ఆఫర్ "అలకా, నాకు నీతో ఉండడానికి అభ్యంతరం లేదు. పెళ్లంటే మా ఇంట్లో ఒప్పుకోరు. నీ కయినా సింగిల్ గా ఉండడం బోర్ కదా!"

మనీషా ఓ రోజు టీ కి రమ్మంది, సరే కదా అని వెళితే మాటల్లో "సడన్ గా నాకో లక్ష కావాల్సి వచ్చింది. సంసారం అంటే అంతేనమ్మా. ఎటూ నీకేం ఖర్చులు లేవుగా. ఇచ్చావంటే నెమ్మదిగా తీరుస్తాను" అని అసలు విషయం బయట పెట్టింది.

సుస్మిత తనతో పాటే ఎం బి ఏ చదివింది. హైదరాబాద్ వచ్చాను రమ్మంటే ఓ రోజు వాళ్ళింటికి వెళ్ళింది. చాలా సరదాగా కాలేజి కబుర్లు చెప్పుకున్నారు. ఇంటికి బయలుదేరుతూ టీ పోయ్ మీద మర్చిపోయిన సెల్ కోసం లోపలికి వెళితే సుస్మిత అమ్మగారు "అంత మంచిదయితే ఎందుకు సూయిసైడ్ చేసుకున్నాడంటావు? నీకు విషయం తెలిసుండదు. జాగ్రత్త !" అని హెచ్చరించడం చెవిన పడింది. ఇక ఒత్తిడిని భరించలేక డైరెక్ట్‌గా కౌన్సిలర్ దగ్గరకు పరిగెత్తింది.

ఇవి కొన్నే .. ఇటువంటి అనుభవాలు కోకొల్లలు. ఆనంద్‌తో పెళ్లి చేసుకుని ఆనందాన్ని అనుభవించక పోయినా తనను తాను చంపుకుని ఆనంద్ అలక ఆనందాన్ని తుడిచిపెట్టగలిగాడు. అవమానాలు ఎదురవడం ఇప్పుడిక అలకకు పరిపాటయింది. ప్రపంచం చేతిలోని సెల్‌లో ఇమిడిపోతోంది. అలాగే ప్రపంచంలోని ఆలోచనలలో అభివృద్ధి గుండెలలో ఇమిడిపోగూడదూ!

పితృస్వామ్య భావజాలం ఎంత లోతుగా వేళ్లూనుకుని ఉన్నాయో అలకకు క్రమంగా అర్థం అవుతూ వస్తున్నది. ఈ దేశంలో బొట్టు ఓ అలంకారం మాత్రమే కాదు. పితృస్వామ్య భావజాలానికి అదో చిహ్నం. ఒక అర్హత. ఆర్థిక సమానత్వం, స్వయం పోషణ ఉన్నా సామాజికంగా, సాంస్కృతికంగా వెనుకబాటుతనాన్ని అధిగ మించకపోతే స్త్రీ పరిస్థితిలో మార్పురావడం కష్టం. కందుకూరి అంత పెద్ద ఎత్తున విధవా వివాహాలను ప్రోత్సహించినా సమాజంలో స్త్రీ స్థానం ఇంకా గమ్యానికి సుదూరంలోనే ఉంది. మారాలంటే మరో పెద్ద ఉద్యమం కావలసిందే. ఆ మార్పుకు కృషి చేయాలని నిర్ణయించుకుంది అలక. లక్ష్యాన్ని చేరేందుకు కార్యాచరణకి అవసరమైన ఆలోచనలతో ముందుకు సాగింది. ♦

నచ్చిన రచన

# ఒక మెత్తటి రహస్తంత్రీ గానం



- శ్రీరాం
9963482597

"కప్పులూ, సాసర్లూ మరియూ కొన్ని కొడిగట్టిన పడికట్టుపదాలు,

***నువ్వు అరవయ్యేళ్ళ ముసలాడివా,***

***ఫిక్షనూ, డిక్షనూ,***

***డిష్యూం డిష్యూం పాతపాటే కరాటే***

***స్వర్ణభస్మమురా మన కవిత : అలజడి చెందిన అక్షర సమూహము"***- అంటాడొక కవితలో అరుణ్ సాగర్. రూపశిల్పాల నుండి ఉత్తరదిశగా కత్తిలా దూసుకుపోయేదే కవిత్వమని చెప్పి అతగాడు వెళ్ళిపోయాడు. పదాల వాడుకలో వాక్యం పొదగటంలో కొత్త కవులదో ప్రత్యేకమైన మార్గం. అప్పుడెప్పుడో అరవైల్లోనే తిలక్ చెప్పినట్లు కవిత్వం మారిపోతుంది. కవితా స్వభావమూ మారిపోతుంది.

అలా మారిపోతున్న కవిత్వ ఆకాశమంతా నిండిపోయేలా, సరికొత్తగా బాల్కనీలో మళ్ళీ పుట్టి, కొమ్మనీడ, పిట్టపాట, పువ్వు వాసన, ఏదో ఒకటి కావాలిప్పుడు – అని మనందరం పలవరిస్తున్నపుడు నేలగుండెలో నిచ్చెనతో కిందకెక్కుతూ (?) నవ్వుతూ వస్తాడు సిద్దార్థ. యెస్ **'ఒక'** అతని తొలి కవితా సంపుటి.

ఒకానొక..ఒకొక..ఒకేఒక. ఒక నిద్రపోని విస్మయ సాయంత్ర స్వప్నాన్వేషణ.

తొలినాళ్ళలో పిల్లలెంత సుకుమారులూ. ఎంత సౌందర్యంగా, ఇష్టాతి ఇష్టంగా, నదుల అంచులకు రంగులు పూస్తూ కూచుంటారు. సిద్దూ అలాంటి లేలేత సౌందర్యాలను పుస్తకం మొత్తం విప్పి సగం చెట్టెక్కుతూ జారిన ఉడుతపిల్లలా తిరుగుతాడు. రమారమి 50 కవితలున్న ఈ పుస్తకంలో అతను కొత్తగొంతుకతో పాడిన పాటలే వినమ్రంగా వినిపిస్తాయి. నిజం చెప్పాలి కదా..అసలు వ్యక్తీకరణ మొత్తం ఎ స్ట్రీం ఆఫ్ సుతిమెత్తని డ్రీంసాంగ్స్.

***"కాలం ఎవరో వెలిగించిన దీపపు ప్రమిద***

***మనిషి వెలుగుచుట్టూ తిరిగే రెక్కల పురుగు***

***మేఘం..ఆకాశం పొదువుకున్న ఉగ్గిన్నె***

***నేల నీళ్ళకోసం అరుస్తున్న పసిపిల్ల***

***నేలకి మాటలొచ్చు...చెట్టు నేల చెప్పిన రహస్యం"***

అంటాడు. ఎంతమెత్తగా చెప్తాడో కదా ?పుస్తకమంతా ఆ మెత్తదనాన్ని పరచి మనల్ని దానిమీద పరుండబెట్టడం సజీవంగా ఫీల్ అవుతాం. "తిడుతూనే ఉంటుంది గానీ పాపం పోపులడబ్బాని కబడేటట్టే పెడుతుంది, వెయ్యో సగం వెయ్యో చీర మడతల్లో నాకోసం దాచిపెడుతూనే ఉంటుంది" అంటాడు మా అమ్మ కవితలో .అమ్మా నాన్నల్ని ప్రేమించకుండా ఏ పిల్లాడైనా ఏం కవిత్వం రాస్తాడు?

***"నాన్నిచ్చిన నోట్లపై గాంధీ ఉండడం బానేవుంది కానీ నాన్నే ఉండుంటే ఇంకెంత బాగుండేదో కదూ.."*** అంటాడు నాన్న చెమటచుక్క దేహం అన్న కవితలో. డిస్టింక్ట్‌గా

అనిపిస్తుంది. మొదటి లైన్నుండీ, చివరిదాకా, జవజవలాడిపోయే జీవస్పర్శ కవిత్వమంతా ధారాపాతంగా కురుస్తుంది.



చాలా కవితల్లో కవి అబ్స్ట్రాక్ట్ ఫీలింగ్స్ ని భావావేశంగా కవిత్వీకరించిన దాఖలా కనిపిస్తుంది నాకు. "ఇప్పుడు గదికి పాపాయి ఊదిన గాలిబుడగంత అందం" అంటాడు భర్తీ అయిన శీర్షిక కవితలో.. ఆ అభివ్యక్తిలోంచి బయటకు రావడానికి కొంత సమయం పడుతుంది మనకు. ఏదో వెతుక్కుంటూ చాలా సేపు అలా ఉండిపోతాం మరో భర్తీ కాని శీర్షిక కవితలో–

***నిన్ను పోలిన శిలావిగ్రహం ముసుగు తీసుకుంటుంది***
***సరిగ్గా అప్పుడు మంచుకుంచెతో లోతుబొమ్మ గీస్తూ–***
***నీ హృదయంలో నువ్వు*** అంటాడు.

ఈ రెండు కవితల్ని పక్కపక్కన పెట్టుకొని మళ్ళీ చదివినప్పుడు .మన ఆలోచనా విస్తృతిమీద చైతన్యవంతమైన క్వస్చన్మార్క్ ఉదయించక మానదు.

***మీ మీ పొలిమేరలను దాటుకొని , నా వద్దకు చేరండి.***
***అనిర్వచనీయ అనుభూతుల్ని మిగిల్చే***
***సాగరాల మార్గం నాకు తెలుసు***
***మీలో జీవసారాలను నింపే మంత్రోపదేశాలుంటా యక్కడ*** అంటాడు.

పిల్లలిచ్చే పిట్టతనం గురించి ఎంత హృద్యంగా రాస్తాడో కదా. పిల్లల సున్నితత్వం, ప్రేమ కవిత్వమంతా పరచినట్లు కనిపిస్తుంది చాలాచోట్ల. అదే పిల్లల ఆధునిక చదువుల భారం గురించిన కవితలో నగరం చాతీమీద కార్పొరెట్ తూటా పేలుతోంటే

***రక్తం కక్కుతున్న ఒంటరి పర్వతం ఘోష వినగలవా నువ్వు***

అంటాడు. స్కూల్ బస్ విండో సీట్లోంచీ, ఆకాశాన్ని చూస్తూ ఒక ఆదివారం ఆటను కదా కోరుకుందీ అంటాడు. దుఃఖం కళ్ళమీదకొచ్చి, బయటకు రాలేక , గుండెలోపలే సుళ్ళు తిరగడం మనకందరికీ అనుభవంలోకొస్తుంది. ఇలాంటి కవితల్లోని స్పష్టత మనల్ని ఆనందపరుస్తుంది. రూపాన్ని అది డామినేట్ చేసినా, దాని సౌందర్యానికి మనం లోబడిపోతాం కూడా. అలాగే ఇంటి కబ్జా నేపథ్యంలో మరణించిన చిన్నారి శివశ్రీ కవితలో, తిరిగి ఎంత రక్తం తీసుకుంటే, మరియూ అంతరించిందంటూ లాంటి కవితల్లో సామాజిక స్పృహ విస్తారంగా కనిపిస్తుంది. కవి సమాజం నుండి కాక మరెక్కడినుండి కవిత్వాన్ని తోడగలడు. పురుషాంగాలకు కత్తులు మొలిచి నప్పుడే మీ జాతి అంతరించిందంటాడు మగాళ్ళందర్నీ. కళ్ళు చిట్లిపోతాయ్ మనందరికీ. మరీ ముఖ్యంగా మియర్ మేల్ గాళ్ళందరికీ.

***"ఓ పూలచెట్టుని నన్నుగా తలచి***
***దానికో ఇప్పపూల మాలను తగిలించు***
***అన్నా.. వాళ్ళెదురుపడితే అడుగు***
***తిరిగి ఎంత రక్తం తీసుకుంటే***
***నీ లాఠీలకంటుకున్న***
***మా చెల్లి మర్మాంగపు రక్తంతో సమానం"*** అంటాడు.ఎంత బాధ ? ఎంత జ్వలనం?

అయితే అంత గొప్పగా శిల్ప బేధం కూడా ఇవి చదివినప్పుడు కనిపిస్తుంది. మరీ ముఖ్యంగా **"ఉమ్మరా నా కొడకా ఉమ్ము..**

***ఎవరి మీదన్నా..***
***పెట్టుబడిదారుల మర్మాంగాలకు కండోములు తొడిగే***
***ఈ దేశపు నాయకుల మీద ఉమ్ము"*** అనే కవితలో వ్యక్తీకరణ తారాస్థాయికి చేరినట్టు అనిపిస్తుంది.

ఈ కొత్త వ్యక్తీకరణలో అతను దేశాన్ని చూసి ఎంత కలవరపడుతున్నాడో కనిపిస్తుంది. మాకసలు సిగ్గులేదు. మా గుడ్డల్ని చించి ఉమ్మండి. తుడుచుకుంటే మళ్ళీ..అంటాడు నికార్సైన నిజాయితీ గల స్వరం వినిపిస్తుంది. ఉండాలి కూడా, కొత్త కవంటే, కొత్త కవిత్వమంటే ఇలాకాక మరెలా వుంటుందీ.?

***గబ్బిలాల గాయాలకు లేపనాలు పూసే సమయం నాది. మాకు పావురాల కథ చెప్పకండి*** అని ఎర్రర్ **404** కవిత చదివినప్పుడు.. కవి ఉన్న వయస్సునూ, అతని మానసిక స్థితినీ మనకెరుకపరుస్తాడు

❖

## దరిద్రపు ఆకలి



- గోసల నారాయణస్వామి
9441912322

ఆవురావురుమంటూ
తిరుగుతున్నాయి
రాకాసి భల్లూకాలు
ఎక్కడ చూసినా !
ఎప్పటికీ నిండని
ఇంతింత బాన పొట్టల్ని
వీపులకు తగిలించుకుని .

ఎన్నో పొట్టల్ని కొట్టి వెనకేసిన
నోట్ల కట్టల గుట్టల్ని
గుటుక్కున మింగేసినా !
అయిపు లేకుండా పోతున్నాయి
అడుక్కి
ఆకల్ని ఏమాత్రం తీర్చకుండా !

వెంపర్లాటల్ని ఆపకుండా !
భూగోళమంతా కలియతిరుగుతూ
చెట్లూ, గుట్టల్ని మింగినా !
ఏటి ఇసుకను బొక్కలాడినా !
ఫ్యాక్టరీ గొట్టాల్ని పొగలు
కక్కించేస్తూ కట్టల కట్టల
నోట్లను కుక్కేసుకొని మెక్కేసినా !
దేశాల మధ్య అనవసర
యుద్ధాలు సృష్టించి
విషాలు చిమ్మేసినా !
ప్లాస్టిక్ భూతాలతో
భూగోళాన్ని నింపేసినా !
ఏం చేసినా నిండని పొట్టలతో
పడిపడీ పొర్లుతున్నాయి !
దరిద్రపు ఆకలిని తీర్చలేని
నోట్ల కట్టల్ని పోగేసుకుంటూ !!
హరిత హారాలతో
అడవి తల్లిని అలంకరిస్తామని
బాకాలూదుతూ !
ఏటేటా కోట్ల మొక్కల్ని
కేవలం నాటుతున్నాయి హంగామాలతో !
ఒక్క మొక్కనీ పెంచకూడదనీ ఒట్టేసుకొనీ !
మళ్ళీ మళ్ళీ నాటాలి కదా !
ప్రభుత్వ బొక్కసానికి
బొక్కలేసుకునీ భోంచేయడానికి !

పచ్చని పంట పొలాల్ని
నిట్ట నిలువుగా మింగేస్తున్నాయి !
కాంక్రీటారణ్యాల్ని సృష్టించీ
కాలుష్యం కరాల నృత్యం చేసేలా !
తాపం పెంచీ తనకలాడేలా !
ధరిత్రికి దైన్యాన్ని పంచుతూ ...
జీవకోటిని విష వలయాల్లో ముంచుతూ ...
దరిద్రానికి ఆకలెక్కువనీ రుజువు చేస్తూ.... ❖




## శ్రీ శ్రీ

- మహమ్మద్.ఖాజామైనద్దీన్
9396626276

అభ్యుదయ కవితా విహంగం
గగన సీమ కెగిన యుగకర్త,
కార్మిక, కర్షక, పండిత పామరులతో
కవితా వ్యవసాయం చేయించినవాడు.
రాబోయే శతాబ్దం నాది అని శాసించిన
కవితాగ్నినుండి ప్రభవించిన మహాప్రస్థానం.
మహాప్రస్థానం ఒక్కటే చాలు
ఆ అక్షరాలు రక్తాన్ని ప్రవహింపచేసే నరాలు.

శ్రీ శ్రీ ఒక మహా సముద్రం.
సముద్రంలో వుండే
నీటి బిందువులను లెక్కపెట్ట లేనట్లే
ఆయన ప్రతిభను లెక్కించ లేము.
ఆకలి పై పోరాటమే
శ్రీ శ్రీ కవిత్వం.
కాల్చే ఆకలి, కూల్చే వేదనలు లేని
ప్రపంచం సాధించుకుంటే
మరో ప్రపంచాన్ని సృష్టించొచ్చు
అందుకు ఆయనబాటలో
ఈనాటి కవిని
ఆయుధమై స్పందిస్తా
కవితా లక్ష్యాలను రగిలిస్తా,
మానవతా దీపాలను వెలిగిస్తా,
రచయితలను ఆవేశించే
కవిగామారుతా.
కవితా శక్తిని మహాశక్తిగా,
మానవ జీవితాన్ని
విశాలంగా చూస్తా,
మరో ప్రపంచం
సృష్టించడానికి కదులుతా.
శ్రామికుల కోసం పుట్టాం,
కార్మికుల మనిషిగా బ్రతుకుతా
నీ వెంటే మేమున్నామని పాడుతా. ❖

# నిశ్చయ ప్రకటనకి స్వాగతం



- కె.ఎన్.మల్లీశ్వరి
9246616788

**తీ**రం దాటిన ఆ నలుగురిలో ఒక కెరటంగా అతను నాలుగేళ్ల కిందటనే తెలుసు. సమూహంలో కలిసిపోయేవారు, నలుగురి మధ్య తమని తాము నిభాయించుకోగలిగిన వారు, అట్లా చేతులు చేతులు పట్టుకుని నడుస్తూ ఏదైనా మంచి చేయగలం అని నమ్మేవారంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. తన కవిత్వం ద్వారా అనిల్ డానీ సాహిత్యానికి ఏం చేసాడు, ఎంత సాధించాడు అన్న లెక్కల ఫలితాలతో నాకు నిమిత్తం లేదు, తను ప్రయాణంలో ఎట్లా ఉన్నాడు అన్నది ముఖ్యం. నవతరంతో యువతరం కార్యక్రమంలో అతని గురించి ఒక్కమాటలో చెపుతూ 'కృష్ణానదీ పరీవాహక కవిత్వ పరిమళం' అని కాప్షన్ రాసాం. ఆ ప్రాంతం వ్యక్తి కనుక అట్లా రాసామే కానీ అది అతని కవిత్వ పరిధిని చెప్పే మాట కాదు.

ఈ కవి – ***'సమూహాన్ని చూసినపుడు గొంతు నరం సన్నగా సాగి వచ్చే శబ్దానికి రాగం కడుతున్న'*** గాయకుడు, ***'అడవి చితుకుల నిప్పుల మీద పాటై మోగేందుకు చలి కాచుకునే డప్పులా'*** వికాస గర్భితమై ఉన్నవాడు. ***'దేహానికి పూసింది పువ్వు కాదు ఆకలి పుండు/రాలిపోయే దాకా వాడిపోదంటూ*** ఒంటిరెక్క పక్షుల్ని భుజానికెత్తుకున్నవాడు, ఇన్నిరంగుల ఇంద్రచాపంలో ఇమడని ఎనిమిదో రంగుని ఒళ్లంతా పులుముకున్నవాడు.

ఈ సంపుటిలోని కవితలన్నీ ఒకేసారి చదివినపుడు ఈ కవిత్వం నిండా ఏం ఉందో స్ఫురించింది. దృక్పథాలు, ధోరణులు, విలువలూ అన్నీ ఉంటే ఉండొచ్చు, లేకుండానూ కవిత్వం కనపడొచ్చు, వాటి నిమిత్తం లేకుండా నరాల్ని మెలిపెట్టే ఒక సన్నని నెప్పి మనతో పాటు తోడుగా నడుస్తూ వస్తుంది. ఆ నెప్పి మెల్లిగా కవి నుంచి అక్షరాల మీదుగా తన భారం దింపుకుని చదువరులలోకి ప్రవేశిస్తుంది. చదివి దుఃఖపడటం ఎందుకు అనుకునేవారి కవిత్వం కాదిది బహుశా. ఆ దుఃఖాన్ని ధైర్యంగా తీసుకుని గుండెలో మండించుకోగల వారి కవిత్వం.


***"కుడి నుంచి ఎడమకి రాసినా / ఎడమ నుంచి కుడికి రాసినా ఇద్దరిదీ అదే చరిత్ర***

***మనం తినే పళ్ళెం చుట్టూరా ఇపుడో అప్రకటిత యుద్ధం.... / ఆయుధాలు రాలుతున్న ఆకాశం కింద***

***నిలబడి ఇద్దరం కలిసి ఒకే పిడికిలి బిగించాలి..."***

'ఆలింగనం' శీర్షికతో వచ్చిన కవితలో పై పంక్తులు ఏక కాలంలో అనేక సంఘర్షణలను గుర్తు చేస్తాయి. మన దేశంలోని మత ఘర్షణలను దాటుకుని మొత్తంగా ప్రపంచపు మత స్వరూపాన్ని, అది తెస్తున్న యుద్ధాలను తన కవితావరణంలోకి తెచ్చుకోగలిగాడు. 'కరి కళేబరంలా కదలదు కొండ' అని శ్రీశ్రీ అన్నపుడు ఆ భావచిత్రపు సాయంతో ఎన్నో ఊహలు తీగలు సాగుతాయి. అదే భావన ఈ కవితలో

‘ఆయుధాలు రాలుతున్న ఆకాశం కింద’ అన్న భావచిత్రాన్ని చూసినపుడు కూడా కలిగింది. కలత నిద్దురలో మెసులు తున్నపుడు ఆకాశంలో ఫెటిల్లున పేలుతున్న విమానాలు, సర్రున భూమికి దూసుకు వచ్చే లోహ ఉల్కాపాతాలు, ఆకాశానికి భూమికీ మధ్య వేలాడే యుద్ధతంత్రాన్ని ఈ ఒక్క భావచిత్రమే సమగ్రంగా చెప్పగలిగింది.



ఈ సంపుటిలో, వర్తమాన సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలను కవితా వస్తువులుగా తీసుకున్నప్పటికీ అవి టాపికల్ వస్తువులుగా అనిపించవు. దళితులు, ముస్లిములు, స్త్రీలు, వారి అస్తిత్వ పోరాటాలు, కలవరపెడుతున్న సమస్యలు చాలా కవితల్లో కనిపిస్తాయి. అయితే ఆ కవితలకి వస్తు సాంద్రత రావడానికి ఒక కారణం, ఒక ఘటనకి తక్షణ స్పందనలుగా కాక అలాంటి అనేక ఘటనల సారంగా సాధారణీకరించబడిన సూత్రం ఏదో కవితల్లో కనిపిస్తుంది. ‘గాయపడ్డవాడా’, ‘ఎనిమిదో రంగు’ కవితల్లోని ఈ గుణం వల్లనే ఘటనల పట్ల కాక వాటిని నడిపే మూలాల పట్ల ఆలోచనలు సాగుతాయి.

‘జెండాపై కపిరాజు’ కథాత్మక కవిత. నందిని సిధారెడ్డి కవిత్వంలో అడపాదడపా తొంగిచూసే ఈ ప్రయోగం కంటిన్యుటీ ఆఫ్ మూడ్ ని పాఠకులకి అందిస్తుంది. కవి చెప్పదలచుకున్నవి చెప్పడం మూలంగా కాక దృశ్యమానం అవడం ద్వారా విభ్రమ గొల్పుతుంది. రెండూర్ల పొలిమేరల్లో దిగిన నాటకాలవాళ్ళు రెండు శిబిరాలుగా ఎపుడు మారిపోయారో కవి చెప్పడు. రంగస్థలం చెపుతుంది, యుద్ధం వాయిదా వేస్తూ అందుకున్న పద్యం చెపుతుంది. చెక్కకత్తులు అట్టముక్కల డాళ్ళతో స్రవించని రక్తం చెపుతుంది.

***“రాలిన శవాల మధ్యన / గెలుపు జెండా ఎగుర్తుంది***
***ముగిసిన నాటకం / గెలుపెవ్వరిదో ఎప్పటికీ చెప్పదు***
***ఎక్కడ వాలాలో తెలీని పావురం / మనిషి భుజం కోసం వెతుక్కుంటుంది”*** మనుషులే దొరకని రణరంగాల మధ్య ప్రతీక వంటి పావురాయి ముడుచుకుపోయినట్లుగా మనసు మూగబోతుంది. అంతిమంగా ఒక సందిగ్ధ స్థితి ఆవిష్కరింపబడుతుంది.

‘కాటిసీను పద్యం’లో కవి తన ఉనికిని ఎక్కడ నిలబెట్టుకోవాలో తెలీక, తెలిసిన దాని పట్లా, లోకం నుంచి గ్రహించిన దానిపట్లా నిరసన వ్యక్తం చేస్తున్నాడు. ‘చెట్టుపైన తలకిందులుగా వేలాడుతూ నిద్రపోయే గబ్బిలంలా మారడానికి అభ్యాసం చేస్తున్నానని’ నిష్ఠురపడటంలో ఈ ఆగ్రహమే ఉంది.

ఈ కవిత చదివినపుడు చప్పున జాషువా గుర్తు వచ్చాడు.

***నా కవితావధూటి వదనంబు నెగాదిగా జూచి, రూపురే***
***ఖా కమనీయ వైఖరుల గాంచి, ‘భళీభళీ’ యన్నవాడే ‘మీ***
***రేకుల’ మన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచిపోవుచో***
***బాకున క్రుమ్మినట్లగును పార్థివ చంద్ర! వచింప సిగ్గగున్***

జాషువా చెప్పి దశాబ్దాలు దాటిపోయాయి. రూపాలు మార్చుకున్న వివక్షలు కొన్ని చోట్ల నాజూకుగానూ మరి కొన్నిచోట్ల అత్యంత నగ్నంగానూ విరుచుకుపడుతూనే ఉన్నాయి. ఇలాంటి సందర్భాల్లో కొందరు పాండిత్యం వల్ల కాక అనుభవాల వల్ల కవులవుతారు. అపుడు ‘వాక్యం రసాత్మకం కావ్యం’ తిరగబడు తుంది. సాహిత్య ప్రమాణాలు మారి కొత్త ప్రమాణాలు ఏర్పడతాయి. కొత్తతరం తమ అవసరాల కోసం వాటిని అంది పుచ్చుకుంటారు. ఈ తరపు కవి అనిల్ డానీ అటువంటివి అందుకునే ప్రయాణం చేస్తూ ఉన్నాడు. తన లక్ష్యం ఏంటో స్థిరపరుచుకున్నట్లే కనపడుతున్నాడు. గతం అంటగట్టిన చీకటిని విడిచి రేపటి వెలుతురు కోసం పర్వత సానువుల మీద నిల్చుని కాలానికి పహారా కాయాలన్న నిశ్చయంతోనే ఉన్నాడు.

***“ఇప్పుడెంత నడిచినా అలుపు లేదు / నేను కుట్టుకున్న చెప్పులు నా కాళ్ళకే ఉన్నాయి***
***ఊరు మొత్తం ఎప్పటికైనా ఒక్కటవుతుందని / బొడ్రాయి కాడ దప్పు కొట్టి చెప్పడానికెళుతున్నా”***

ఈ నిశ్చయ ప్రకటనకి స్వాగతం అనిల్ ! ♦

# నదిలాంటి మనిషి

ఉదయమిత్ర
*9985203376*

నది ఎక్కడైనా
ఆగిపోవడం జూశారా

పాయల్ని గలుపుకొని
సాగిపోవడం తప్ప
ఆగిందిలేదు, అలిసిందిలేదు

కొండలడ్డమైనా
కొత్తదారులు వెదికిందె గాని
రవ్వంత విశ్రమించింది లేదు
వెనుక చూపులు జూసింది లేదు

❖❖❖

ఎన్నెన్ని నాగరికతలు
ఎంతెంత మానవ వికాసం

తాకిన చోటల్లా
భూమి
పురివిప్పిన నెమలై నాట్యమాడింది
గుండెపై పంటను నిలుపుకు
ప్రకృతి పరవశించింది

నది – ఒక చలనగీతం
నది – ఒక ధిక్కారగమనం
నది – ఒక పునరుజ్జీవనం
నది– స్థలకాలాల గలిపె వారధి

ఉవ్వెత్తున ఉప్పొంగె
సముద్రపు అలల హోరంతా
నదిగన్న కలల సమాహారమె
అశేష జలరాసుల హెూరుల
గలగలల సప్తస్వర ఝురుల
సమాహారమంతా
నదిబెట్టిన భిక్షనే

❖❖❖

నదిలాంటి మనిషీ అంతె
పడుతూ లేస్తూ పయనిస్తూ



ప్రశ్నిస్తూ సమాధానపడుతూ
పాడుతూ నినదిస్తూ
నడక పరుగవుతుందె తప్ప
ఎక్కడా ఆగింది లేదు
ఎక్కడా అలిసింది లేదు

పిల్లలతోనో పెద్దలతోనో
కార్మికులతోనొ కర్షకులతోనో
అభాగ్యులతోనో అనాధలతోనో
అడవితోనో మైదానంతోనో
సంభాషించినపుడు
ఒకరితొ ఒకరు సంఘర్షించినపుడు
ఒకరిలోంచి ఒకరు ప్రవహించినపుడు
వెల్తురుపూవై వెలిగిందుగాని
వెనుదిరిగింది లేదు
చీకటికి జడిసింది లేదు

ఒంటరిగ ఉన్నపుడు
మానవ సమూహాల గురించి
సమూహాలలొ ఉన్నపుడు
చలనాల గురించి సంఘర్షించి
చలనాలలొ ఉన్నపుడు చోదకశక్తిగ మారి
నడిచి, నడిపించినపుడు
నదిలాగే
మనిషి తిరిగిన నేలంతా
ఆత్మవిశ్వాసాల మోసులెత్తుతుంది
గడిపిన కాలమంతా
దుఃఖాశ్రువుల వెలిగె
దీపాల జాతరౌతుంది

ఔను
మనిషి నదిగా మారడం తప్ప
మనుగడకు విలువేమున్నది !?

♦

# "నిన్ను నీవు గెలిచాకా" - పలికే కవిత్వం

- బొల్లోజు బాబా
9849320443



ఉత్తరాంధ్రనుంచి వచ్చే కవిత్వానికి ఒక ప్రత్యేకమైన పరిమళం ఉంటుంది. అది ఈ మట్టి పరిమళం. నాగావళి నీటి పరిమళం. జీవితం చెమర్చే చమట పరిమళం అది. సమకాలీన కవులలో గంటేటి గౌరునాయుడు, సిరికి స్వామినాయుడు, కె.కె వర్మ, సుధాకర్ మౌళి, చీకటి దివాకర్, పాయల మురళి కృష్ణ, పక్కి రవీంద్రనాథ్ వంటి వారు తమ ప్రతిభ వ్యుత్పత్తులతో తెలుగు సాహిత్యంలో సుస్థిరమైన స్థానం ఏర్పరచుకొన్నారు.

ఈ "నిన్ను నీవు గెలిచాకా" కవిత్వ సంపుటితో శ్రీమతి ప్రసన్న లక్ష్మి ఆ ఘనవారసత్వపు నీడలోకి చేరుకొన్నారు.

కవిత్వం జీవితసామస్త్యాన్ని ప్రతిబింబించాలి అని నమ్మేవారిలో నేనూ ఒకడిని. "నిన్ను నీవు గెలిచాకా" లోని కవితలలో ఆ లక్షణం కనిపించింది.

ప్రసన్న లక్ష్మి ఒక స్త్రీగా, స్త్రీవాదాన్ని బలపరుస్తూ కవితలు వ్రాసారు.

ఒక దళితవర్గానికి చెందిన వ్యక్తిగా దళితతత్వాన్ని తన కవిత్వంలో పలికించారు.

ఒక ఉపాధ్యాయురాలిగా విద్య, విద్యార్థులు, టీచర్ల పై అనేక కవితలు వ్రాసారు.

ఒక తల్లిగా కన్న పేగు మమకారాన్ని "క్షమించు కన్నా" అనే కవితలో అద్భుతంగా ఆవిష్కరించారు.

ఒక భార్యగా దాంపత్యంలో స్త్రీపురుషుల మధ్య అనురాగం ఎలా ఉండాలో గొప్ప ఉదాత్తతతో ప్రకటించారు.

ఒక ప్రకృతి సౌందర్య ఆరాధకురాలిగా గొప్ప వివశత్వంతో "ప్రకృతితో పయనిస్తుంటే.... " లాంటి కవితలు వ్రాసారు.

ఒక కూతురిగా తన తండ్రిగారిపై ఉన్న ప్రేమను కరుణరసార్ద్రభరితంగా కవిత్వీకరించారు.

అనేక కవితలలో ఈ కవయిత్రి– మానవతను ప్రేమించారు. స్వార్థాన్ని వ్యతిరేకించారు. పీడితుల పట్ల సానుభూతి ప్రకటించారు. సామ్రాజ్యవాద, ఫ్యూడల్ విధానాలను విమర్శించారు. విమర్శనాత్మక వాస్తవికతకు అక్షర రూపమిచ్చారు.

ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి మనిషిలా ఎలా జీవించాలో, ఎలా జీవిస్తే బాగుంటుందని ప్రసన్నలక్ష్మి భావిస్తున్నారో దాని గురించే ఈ కవిత్వం అంతా.

ఇంతటి వస్తువైవిధ్యం ఒక్క వ్యక్తి కలం నుండి రావటం అరుదైన విషయమని భావిస్తున్నాను. జీవిత సామస్త్యాన్ని ప్రతిబింబించటం అంటే ఇది కాక మరేమిటి?

సమాజం వల్ల కవి ప్రభావితం అయినప్పుడు మంచి కవిత్వం వస్తుంది. వైయక్తిక అనుభవాన్ని స్పష్టంగా చెప్పగలిగినప్పుడు అదే సార్వజనీన కవిత్వమౌతుంది. నేడు ప్రపంచవ్యాప్తంగా వస్తున్న కవిత్వం యొక్క ప్రధాన లక్షణమిది. ఒక ఉపాధ్యాయురాలిగా ప్రసన్నలక్ష్మి కవిత్వం మనందరి అనుభూతుల్ని తడుముతుంది.

ఢిల్లీకి రాజయినా తల్లికి బిడ్డే అన్నట్లు ఎంత గొప్ప మేథావి అయినా పాఠశాల నుంచే వస్తాడు. ఈ రోజు ఆడుతూ పాడుతూ అల్లరి చేసే పిల్లలు రేపు ఏ ఏ ఉన్నత శిఖరాలు అందుకొంటారో అన్న ఊహ ప్రతీ టీచరూ ఎప్పుడో ఒకప్పుడు అనుకొనే ఉంటాడు. దాన్నే "మట్టిలో మాణిక్యాలు" అనే చక్కని కవితగా మలచారు ప్రసన్నలక్ష్మి. ఆ కవిత ఇలా

సాగుతుంది.

***మట్టిలో మాణిక్యాలు/చింపిరిజుట్టు/ చిరిగిన నిక్కరు/ఐనా మోములో/చెరగని చిరునవ్వు/గుండీలు పెట్టుకోవటం/రాని బుడతడు/గుండె జబ్బు నయం చేసే/డాక్టర్ అవుతానంటాడు/చీపురుపుల్లను తలపించే/ మరో పిడుగు సచిన్నే/మించిపోతానని/గల్లీ క్రికెట్ లో చెలరేగుతాడు/మట్టివాసన వదలని మరో బాలుడు ఐన్ స్టీన్ ని తలపిస్తూ/తన మేధస్సుతో అబ్బుర పరుస్తూనే ఉంటాడు***



వీరేనేమో మట్టిలో మాణిక్యాలు

ఈ కవిత ఒక గ్రామీణ ప్రభుత్వ పాఠశాల నేపథ్యాన్ని అద్భుతంగా పలికించింది. నిజానికి ప్రభుత్వ పాఠశాలల్లో/ కాలేజీలలో చదివే విద్యార్థులకు కష్టాలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం, వ్యవహారజ్ఞానం, బ్రతకగలను అనే ధీమా ఎక్కువగా ఉంటాయి. పై కవితలో అవన్నీ ప్రతిబింబించాయి. ఈ కవిత ఆ విద్యార్థులనే కాదు– గొప్ప మానవీయ కోణంలో, ఆశావహ దృక్పథంతో తన విద్యార్థులను మట్టిలో మాణిక్యాలుగా దర్శించిన ప్రసన్న లక్ష్మి హృదయ సంస్కారాన్ని కూడా పట్టిచూపుతుంది.

అక్షర సేద్యం అనే కవితలో.. విద్యలేకపోవటం వల్ల గిరిపుత్రులు మూఢనమ్మకాలకు బలి అవుతున్నారనీ "అక్షరసేద్యం అరుణిమ దాల్చిన సమయాన గిరిపుత్రులెన్నటికీ వరపుత్రులే మరి" అంటారు. విద్యను అక్షర సేద్యం అని, విద్య నేర్చుకోవటాన్ని అరుణిమ దాల్చటం అనటం ఒక నవ్యమైన అభివ్యక్తి.

ఇంకా ఈ కవితా సంపుటిలో నిబద్ధత కలిగిన ఉపాధ్యాయుల గురించి, విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించే గురువుల గురించి, సెల్ ఫోన్ వ్యామోహంలో పడిపోయి భవిష్యత్తును నాశనం చేసుకొంటున్న విద్యార్థుల గురించి, కార్పొరేట్ చదువుల కార్ఖానాల గురించి వ్రాసిన అనేక కవితలు నేటి విద్యారంగ స్వరూప స్వభావాలను కళ్ళకు కడతాయి.

ఏ కవైనా తాను జీవిస్తున్న జీవితాన్ని తన కవిత్వంలో కనిపించకుండా దాయలేడు. ఏదో ఓ రూపంలో దొరికి పోతాడు. ఇది కవి నిజాయితీకి సంబంధించిన విషయం. నిజాయితీ అంటే ఇక్కడ తాను చూసినది, అనుభవించినదీ కవిత్వంలోకి తీసుకురావటం అని అర్థం చేసుకోవాలి. ఆ విషయంలో ప్రసన్న లక్ష్మి నిజాయితీ కలిగిన కవి అని అనేక కవితలు నిరూపిస్తాయి.

స్త్రీవాద చైతన్యం ఈ పుస్తకంలోని అనేక కవితలలో బలంగా వ్యక్తమైంది. ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని పథకాలు పెట్టినా స్త్రీ సాధికారత అనేది నేటికీ ఒక గగన కుసుమమే. స్త్రీ వాద అంతిమ లక్ష్యం సాధికారతే. ఈ విషయాన్నే సూటిగా ఏ శషభిషలూ లేకుండా "ఆమెకు తెలియాలి" అనే కవితలో

***"శిరస్సెత్తి శివంగిలా ముందుకురికిన నాడు స్త్రీ సాధికారతకు ఎదురన్నది లేదని"*** అంటారు ప్రసన్న లక్ష్మి.

ప్రేమను ప్రతి తరంలోనూ అనేక మంది అనేక రకాలుగా నిర్వచించినా ఇంకా ఎంతో చెప్పాల్సింది ఉందనే అనిపిస్తూంటుంది. ఒక ఆధునిక మహిళ ప్రేమను ఎలా నిర్వచించుకొంటుందో ఒక కవితలో చెపుతారు.

***"ఇప్పుడు ప్రేమంటే తెలిసింది***
***విసుకు చెందక విజయతీరాలకు***
***నను చేర్చే నాలోని నీవని"***

అతి తక్కువ పదాలలో చాలా స్పష్టంగా, సూటిగా ఆధునిక స్త్రీ కోరుకొంటున్న ప్రేమ ఎలాఉండాలో అద్భుతంగా వ్యక్తీకరించారు ప్రసన్న లక్ష్మి. నేడు భర్త ప్రోత్సాహం లేక అనేకమంది మహిళలు తమ ప్రతిభను, ఆశలను, కేరీర్ ను వదులుకోవలసిరావటం ఒక సామాజిక వాస్తవం. అలాకాక భార్య ఎదుగుదలలో, విజయాలలో వెన్నుదన్నుగా భర్త నిలబడటమే నిజమైన ప్రేమగా అభివర్ణించటం చక్కని ఊహే కాదు ప్రాక్టికల్ అప్రోచ్ కూడా.

ఆధునిక మానవుని చర్యలు సంక్లిష్టంగా ఉంటాయి. విధ్వంసం చేసేదీ వాడే విధ్వంసం నుంచి కాపాడాలని కోరుకొనేదీ వాడే. ఈ ద్వంద్వాన్ని "నాలోని– నేను" అనే కవితలో గొప్ప ఒడుపుతో పట్టుకొన్నారు ప్రసన్న లక్ష్మి.

***మట్టిలో మాణిక్యాలను వెలికిదీసిన ఘనతనాది***
***మట్టిని తెగనమ్మి మానవతకు ఘోరీ కట్టిన ఘనతనాది***
***ఆకాశ గంగను నేలకు దింపిన అపర***
***భగీరథి ప్రయత్నం నాదే***

# కవిత

## అక్షర తలంపు

- జూటూరి షరీఫ్
9441111053



దేశం మానచిత్రం మానభంగాలతో మకిల పడుచున్నది
కామాంధులకు హద్దు అదుపు లేకుండా పోతున్నది
'బేటీ బచావో' నినాదం నవ్వుల పాలగుచున్నది
ఆడపిల్లల బతుకునావ మధ్యలోనే మునిగిపోతున్నది
వెర్రితలలు వేస్తున్నది పైశాచిక ఆనందం
మానవ మృగాలతో పొంచి వున్నది పెనుప్రమాదం
రోజుకో ఆడపిల్ల ప్రాణం గాలిలో కలిసిపోతావుంది
ఆడపిల్లల జీవితమె అభిశాపంగా మారిపోతావుంది

జనారణ్యలో మానవ మృగాలు సంచరిస్తున్నాయ్
పాలక వర్గాలు కళంకితుల కొమ్ము కాస్తున్నాయ్
పచ్చగా ఎదిగే భావికొమ్మలు నరికేస్తున్నారు
మానవత్వపు మనుగడకు సవాళు విసురుతున్నారు

అసీఫా మానప్రాణాలు బుగ్గిపాలు అయిపాయే
తల్లిదండ్రులకు వేదన రోదనలే మిగిలిపాయే
కథువా ఘటన సభ్యసమాజానికే తలవంపు
దోషులకు కఠిన శిక్షే మా అక్షర తలంపు
❖

---

**నేలనున్న నీటిని వ్యాపార కాంక్షతో**
నేలపాల్చేస్తున్నదీ నేనే
అన్యాయపు ఆక్రందనలు మింటికెగసేవేళ
చంద్రనిప్పుల్ని చెరగుతూ దివిటీగా నిలిచేదీ నేనే
తప్పుల దుప్పటి కప్పుకొని తప్పించుకు తిరిగేదీ నేనే

నేటి సమాజంలో, మానవజాతి స్వభావంలో ఉండే ఈ ధ్వంద్వాన్ని గుర్తించటం ముఖ్యం. గుర్తించాకా ఏది సామాన్యునికి మేలుచేసేదో పరిశీలించి దానివైపు మొగ్గటం కవులు కళాకారులు చేయాల్సిన పని. ఆ పనిని ఈ కవితలో చక్కని పారడాక్సికల్ నిర్మాణ శైలిలో చెప్పారు.

ప్రసన్నలక్ష్మి గారికి సునిశితమైన పరిశీలన, చక్కని పదసంపద, ఊహలను అక్షరాలుగా మలచగల నైపుణ్యం పుష్కలంగా ఉన్నాయి. తన జీవనయానాన్ని కవిత్వంలో రికార్డు చేసే సామర్థ్యము, సంకల్పమూ బలంగా ఉన్నాయి. అందుకనే ఈ పుస్తకంలోని కవిత్వంలో నిప్పులాంటి నిజాయితీ, పదునైన అభివ్యక్తి, ఆర్ధ్రత నిండిన స్వరము వాక్యవాక్యానా కనిపించాయి. అన్నికవితలను ఏకబిగిని చదివించే వస్తువైవిధ్యం, శిల్పనైపుణ్యము ఉన్నాయి.


"జీవితంలోని ఖాళీలు పూరించటమే సాహిత్యం పని" అంటారు బాలగోపాల్. మానవ సమాజం పరిణామక్రమంలో కొన్ని ఆదర్శాలను ఏర్పరచుకొంది. ఉదాహరణకు– దోపిడి ఉండరాదని, పీడన తప్పు అని, నిస్వార్థంగా జీవించాలని లాంటి నియమాలు. కానీ వాస్తవ జీవితం అలా ఉండదు. ఆదర్శాలకు వాస్తవాలకు మధ్య పొంతన ఉండదు. ఖాళీలుంటాయి. వీటిని సాహిత్యం మాత్రమే పూరించగలదు. అంతే కాక ఒక మనిషి తన జీవితంలో చూడలేని, తెలుసుకోలేని అంశాలు అనేకం ఉంటాయి. అవన్నీ జీవితంలో ఉండే ఖాళీలు. మానవ అస్తిత్వంలోని ఈ ఖాళీలే సాహిత్యానికి ఆలంబన. సాహిత్యం తన పాత్రల ద్వారా, కథనం ద్వారా తెలియ చేసి, ఆదర్శాలకు వాస్తవానికి మధ్య ఒక వంతెన కడుతుంది. ఈ వంతెనపై బుద్ధిజీవులు ప్రయాణిస్తారు. మానవజాతికి సాహిత్యం చేసే గొప్ప ఉపకారాలలో ఇది ముఖ్యమైనది.

అలా ఖాళీలు పూరించటంలో భాగంగానే ప్రసన్నలక్ష్మి – వాణ్ని చూస్తే, రిపోర్టర్స్ డైరీ, ఊరు మనది, ఇనుపరెక్కల దేగ చప్పుళ్ల ముందు, క్షమించు నాన్నా లాంటి కవితలు వ్రాసారని భావిస్తాను.

ఈ సంపుటిలోని కవితలు రెండు దశాబ్దాల కాలంలో వ్రాసినవి. రాసిన కాలాన్ని బట్టి మొత్తం కవితలను రెండు భాగాలుగా అనుకొంటే మొదటి పదేళ్లలో వ్రాసిన కవితల కన్నా తరువాత పదేళ్లలో వ్రాసిన కవితలలో– వస్తువు ఎంపిక, క్లుప్తత, భావసాంద్రత అధికంగా ఉన్నట్లు గమనించవచ్చు. అభిప్రాయ ప్రకటనలు కాక ఉద్వేగాలను కవిత్వీకరించటం జరిగింది. వాక్యాన్ని రసాత్మకంగా మార్చే విద్య ఏదో పట్టుబడింది. సమాజం పట్ల కవికి ఉండాల్సిన బాధ్యత కనిపిస్తుంది. ఇది ఒక కవి ఎదిగిన క్రమాన్ని, సాధించిన పరిణితిని సూచిస్తుంది. ముందుముందు మరింత గొప్ప కవిత్వం వీరి కలం నుంచి వస్తుందనటానికి ఒక శుభసూచన, వాగ్దానం.
❖

# అంటరాని యాసను ధిక్కారస్వరంగా మార్చిన కటికపూలు

- పిళ్లా కుమారస్వామి
9440122229




'నీ పిలకాయలు తినకుండగా మాగొంతుల్లో బియ్యాలు తిగుతాయా ఏందీ?' / పై కులాలోళ్లోకి మల్లే మాకు ముహూర్తాలూ, మట్టి ల్యాక పోయినా పెళ్ళిళ్ళు మటికి ఎండా కాలంలోనే జరగాలనే శాత్రం వుండేది" / 'మే, కత్తిరేనా... నువ్వన్నా పోయి మీ నాయన్ని పిలసకరామ్మే, బూతినకుండా పోయేడు. మాయమ్మ కదూ. వొచ్చేతప్పుడు నూజీళ్ళు కొనుక్కో . ఇంగో ఈడొబ్బుల్తో ".

ఇలాంటివి చదువుతూ వుంటే ఒకసారి మళ్ళీ బాల్యంలోకి పోయి మన అమ్మభాష మాట్లాడినట్లుంటుంది. మన భాష యాస మరచి ప్రామాణిక భాష కోసం వెంపర్లాడి మనదైన జీవితాన్ని కోల్పోయాం. ఇంగ్లీషు చదువులు మొదలైనాక ఇప్పటి తరం వాళ్ళకు మన తెలుగూ పోయింది. ఆ ఇంగ్లీషు పోయింది. ఇట్లాంటి సందర్భంలో మళ్ళీ వెనక్కు వెళ్ళి అమ్మభాషలో కమ్మగా ఇరవై అయిదు కథలు మనముందుంచారు ఇండస్‌మార్టిన్.

కథలు చదువుతున్నంత సేపూ మన జీవితాన్ని నెమరు వేసుకున్నట్టే ఉంటుంది. ఇక్కడ నేపథ్యం మారింది. గుంటూరు ప్రాంతమైనా అదిపూర్తిగా దళితవాడ. దాంతో దళితభాషా సౌందర్యం గుభాళిస్తుంది. ఎవరైనా ఈ కథల్ని చదివితే నేనుకూడా కథల్ని రాయగలను అనే ధైర్యం కలుగుతుంది. శ్రీశ్రీ ఒకసారి సభలో "కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా కాదేది కవిత కనర్హం" అని చదివినప్పుడు ఓస్ ఇంతేనా కవిత్వం అంటే, నేను కూడా కవిత్వం రాయగలను అని అన్నాడట ఒక పిల్లవాడు. అట్లాంటి ధైర్యం అన్నమాట.

అయితే ఇలాంటి కథలు రాయాలంటే చాలా ఓపిక ఉండాలి. ఎందుకు రాస్తున్నామో ఎరుక ఉండాలి. ఈ ఎరుకతోనే మార్టిన్ ఈ కథలను రాసినాడు. ఏమా ఎరుక? గుంటూరు కృష్ణా భాషే ప్రామాణిక భాషని అదే ప్రాంతంలో మాట్లాడే దళితులు మాట్లాడే భాష భాషే కాదని యాసని సోకాల్డ్ మేధావులు కొట్టిపారేసినారు. వారికి అలగాజనమని, చండాలురని, గూడెపోళ్ళని రకరకాలుగా పేర్లు పెట్టి దానికి అస్తిత్వం లేకుండా చేసినారు. అంతేగాక రాయలసీమ భాష రాతకు పనికిరాదన్నారు. గోదావరిని జీళ్ళ పాకమన్నారు. తెలంగాణా తురక తెలుగన్నారు. భాష ఆధిపత్యంగా ముందుకొచ్చి గుంటూరు కృష్ణా భాషమాత్రమే ప్రామాణికమైనదని తీర్మానిస్తే మిగతావి తెలుగు కిందకు రావా? అనే ప్రశ్న ఉదయించాక కటికపూలు రాసినాడు మార్టిన్.

అందుకే దళితుల యాసలో కథలు రాసి భాషలోని యాస పరిమళాల్ని కథల్నిండా నింపినాడు.

"ఎత్తర తల ఎత్తర కొట్టర తొడగొట్టర దగాపడ్డ దళితుడా! గుండెకు పదునెట్టరా! దమ్మును చూపెట్టరా" అని డి.బి.చారి పాడినట్లు యాస గొప్పతనాన్ని చాటుతూ కథలు రాసినాడు. ఇవి ఆయన బతుకుపోరు కథలు . అవిప్పుడు చాలామందిని ఆకర్షిస్తున్నాయి. యాస మన తెలుగు జీవనాడి. యాసలో మాట్లాడితే వచ్చే ఆనందం, ఆత్మీయత అద్భుతంగా ఉంటుంది.

1990 తర్వాత ప్రపంచీకరణ ప్రారంభమయ్యాక ఎవరి గొంతుక వాళ్ళే వినిపించాలనే వాదాలు వచ్చాయి. సమిష్టి వాదం వెనక్కుపోయింది. స్త్రీవాద, దళితవాద, మైనారిటీవాద, బహుజన వాదం, ప్రాంతీయవాదం ఇలా రకరకాల వాదాలు వచ్చాయి. ఇవన్నీ సాహిత్యంలో ఖాళీలను పూరించాయంటాడు

ప్రముఖ విమర్శకులు బాలగోపాల్. తెలంగాణా ప్రాంతీయ వాదం మొదట్లో భాష ఆధిపత్యం మీదనే ప్రారంభమైంది. వారి సాహిత్యమంతా మాండలికంలో వచ్చింది. దళిత సాహిత్యంలో మాత్రం కవిత్వం వచ్చినంతగా కథలు రాలేదంటారు సాహితీ విమర్శకులు. ఈ ఖాళీని పూరించేందుకు ఇండస్ మార్టిన్ కృషి చేసినారు. వారు రాసింది చూడటానికి అలవోకగా రాసిట్టున్నా దాని వెనుక ఎంతో కృషి, నిర్మాణ నైపుణ్యం ఉన్నాయి.



కటికపూలు కథా సంపుటిలో 25 కథలున్నాయి. ఇవన్నీ కథలుగా ఉన్నా తన జీవితానుభవాలే ఎక్కువ. సామాజికంగా అణచివేయబడిన దళితుల జీవితాల్లో సహజంగా ఏర్పడే కష్టాలు కన్నీళ్ళు, విషాదాలు, అనందాలు, నమ్మకాలు, ఆచారసంబంధాలు, క్రీస్తుపై భక్తి విశ్వాసాలు వాళ్ళ యాస మొదలైనవెన్నో ఉన్నాయి. ఇందులో అవమానాల ధిక్కార స్వరం ఉంది. సామాజిక దోపిడీ వ్యవస్థ నుంచి విముక్తి పొందాలనే తపన ఉంది. కానీ మార్గం ఎవరికీ తెలీడం లేదు. మనిషిని మనిషిగా చూసే సమాజం రావాలనే తపనకూడా ఉంది. కమ్యూనిజం మాత్రమే మనిషిని మనిషిని చూసే సమాజాన్ని ఆవిష్కరిస్తుంది. కానీ నేటి హైందవ సమాజం కులాల సంకెళ్ళలో ఉండిపోయి అందుకు ఆటంకంగా నిలిచివుంది.

ఇంకా గాయాల బాల్యం ఉంది. కడుపునొప్పి చావుల వెనుక రహస్యాల గుట్టు విప్పటం ఉంది. అంటరాని యాసను ధిక్కార స్వరంగా మార్చిన నైపుణ్యం ఉంది. భారతదేశం ఇప్పుడు ఇంట్లో హిందూవిందులో బల్ల సుట్టూ బిజీగా ఉండాదన్న కఠోర సత్యాన్ని చెప్పే దమ్మున్న కథ ఉంది.

రచయిత తన జీవితానుభవాల సారాన్ని లోకంతీరును కథల్లో ఒడుపుగా ప్రవేశపెట్టి చివరలో ఒక అంత: సూత్రాన్ని తేలుస్తాడు. ఊరేగింపు కథలో పైకులపోళ్ళ బజార్లలో దళితకులపోళ్ళు పెళ్ళిళ్ళు చేసుకుని బజార్లలో 'ఊరేగింపు'కు ఒప్పుకోరు. కాని పట్టుబట్టి వీళ్ళు ఊరేగింపు జరుపుతారు. పై కులపోళ్ళు అలా ఎందుకొప్పుకోరో రచయిత బట్టబయలు చేస్తాడు. వాళ్ళ దయాదాక్షిణ్యాల మీద బతికినంత కాలం ఊరేగింపుకు అనుమతిస్తారుగాని ఎప్పుడైతే దళితులు స్వంత కాళ్ళమీద నిలబడి స్వతంత్రంగా జీవిస్తుంటారో అప్పుడు వాళ్ళంతా తమమీద ఆధారపడి బతకలేదన్న అక్కసుతో తమ ఇళ్ళ ముందర ఊరేగింపు పోవద్దంటారని రచయిత ఒక వాస్తవ కఠోర దృశ్యాన్ని మన ముందుంచుతాడు. అదే చుండూరు, కారంచేడుల్లో జరిగిన మారణకాండకు కారణమని చెపుతాడు.


'కటికపూలు' కథా సంపుటిలో రెండు మనసును కదలించే కథలు – ఉప్పెన ఒకటి, ఉప్పెన రెండు. ఇవి రచయిత జీవితాన్ని నిలబెట్టిన కథలు. ఒక ప్రళయం ఎదురైనప్పుడు వారు ఏసును నమ్ముకుంటూ చర్చిలో ఉండి ప్రాణాలతో బడటపడతారు. వారికోసం ప్రార్థన చేసిన ఫాదరు మరణిస్తారు. హృదయాన్ని తాకే కథలివి. ఉప్పెన వచ్చినపుడు దివిసీమ కొట్టుకుపోయింది. ఎందరో అభాగ్యులు ప్రాణాలు కోల్పోయారు. కథ ప్రారంభం 'జంబకుజంబకు బాల జంబకు జంబకు హెూయ్' అనే పాటతో ప్రారంభమై "ఘోరీల దిబ్బగా మారుతున్న మా మాలపల్లి పునరుత్థాన అనుభవాన్ని పొందేనా!" తో అంతమవుతుంది. ఉప్పెన వస్తే పేదబతుకుల్లో ఏర్పడే విషాదాన్ని కళ్ళకు కట్టినట్లు దృశ్యమానం చేసినాడు రచయిత. ఒక సినిమారీలులా మనముందు కదలాడుతుంది.

బతుకంటే చావు పుట్టుకల మధ్యనే ఉంటుందని ఈ లోకం మనకు స్థిరమైనది కాదని తెలుపుతుంది ఉప్పెన కథ. " స్థిరమని నమ్మకు ధర ఎవ్వరికిని / పరలోకమె స్థిరము / నిజముగ పరలోకమే స్థిరము" అనే పాటతో కథను ముగిస్తాడు. హృదయాన్ని తాకే ఈ కథల్లో ఎంతో జీవనసారాన్ని వడబోసి చెపుతాడు తన యాస భాషలో.

అంటరాని యాసలో మనిషికి లింగ, భాష ప్రాంత, వర్గ తారతమ్యం లేకుండా గౌరవం ఇచ్చే దిశగా సమాజం ముందుకు పోవాలని రచయిత కోరుకుంటాడు. వీటినే మనం ఆధునిక భావాలు అంటాం. ఆధునికాంతర వాదం గురించి మాట్లాడేవాళ్ళు మనం ఇంకా ఆధునికం కాలేదని మనిషిని మనిషిగా చూడటంలేదని అర్థం చేసుకోవట్లేదు. ఇటీవల మత విద్వేషాలతో ఆసిఫాపై జరిగిన హత్యాచారం ఇందుకొక ఉదాహరణ. గోమాంసం నిషేదం సందర్భంలోనూ చూశాం.

## ఎలా జీవించనూ?

మరాఠీ మూలం : భావూ పంచ్‌భాయ్
తెలుగు : డాక్టర్ దేవరాజు మహారాజు
9908633949



*విషపు చెట్లు నాటిన ఈ పట్నంలో
మేం పాలనని ఎలా చవిచూస్తాం?
శత్రువు శత్రుత్వాన్నే పంచుతున్నప్పుడు
మేం స్నేహపు దాహాన్నెలా పెంచుకుంటాం?
రోజూ పనివాళ్ళ నరమేధం జరిపించే ఈ నగరాన్ని
నాదని ఎలా చెప్పుకోనూ? ఎలా ఒప్పుకోనూ?*

*ఒకవైపు గుడిసె వాసులంతా
అగ్నికి ఆహుతవుతున్నప్పుడు
ఈ మలుపును వెలుగులతో నేనెలా వెలిగించనూ?
నా చుట్టూ నమ్మకద్రోహపు ఫలాల్ని ఆరగించే వారైతే
నేనెవరి గుంపులో అని చేరను?
ఊయల మార్చితే మార్చ వచ్చునేమో
అప్పుడే పుట్టిన బిడ్డ రూపురేఖలెలా మార్చను?
పాఠశాలల పోట్లాటల్లో నాకు,
శిక్షణ పొందుతున్న నిందితులు కనిపిస్తున్నారు
జైళ్ళలో పడి తన్నుకు చచ్చే అభాగ్యులు కనిపిస్తున్నారు*

*వాళ్ళక్కడ చస్తూ ఉంటే
నేనిక్కడ ఎలా జీవించను?* ♦

---

కల్బుర్గి, దభోల్కర్ లాంటి వాళ్ళను చంపినపుడు చూశాం. ఇంకా మనదేశంలో మనిషి మనిషిగా ఉండటం నేర్చుకోలేదని. అదే సందర్భంలో ప్రపంచీకరణలో భాషా సంస్కృతులు పతన మవుతున్నపుడు యాసలో రాసిన భాష మనిషిని మళ్ళీ నిలబెట్టి తెలుగు భాషా సంస్కృతుల వైపు మళ్ళించడానికి దోహదం చేస్తాయి. కటికపూలు కథలో కటికోళ్ళు కటికవృత్తి చేపట్టినా కసాయి హంతకుల జాతులతో కలవలేదని రచయిత చెపుతాడు. వృత్తిని బట్టి మనోవికారాలు, వ్యక్తిత్వాలు ఏర్పడవని నిరూపించాడు.

దళితుల నోళ్ళలోంచి వచ్చిన భాషంతా ఒక ధనాగారమని, తరాల తరబడి ఈసడింపుకు గురైన మాటల్ని ఒడిసిపట్టుకొని వస్తున్న మా మెదళ్ళు జీవనదులని రచయిత 'బతుకు పాట' కథలో చివరలో చెపుతాడు. వాస్తవానికి ఈ కథల్లో ఎన్నో తెలుగు పదాలు నిఘంటువుల దాకా రాకుండా పోయినవి ఉన్నాయి. అవన్నీ తెలుగు భాష నిధులు. వాటిని నిఘంటువుల్లో చేర్చుకోవాలి. మన తెలుగును కాపాడుకోవాలంటే ఈ పదాలు చాలా అవసరం. ఈ సంపుటిలో ప్రతికథ చివర మాండలికాల అర్థాలు కూడా ఇచ్చివుంటే బాగుండేది.

అనంతలక్ష్మిని ప్రేమించిన రచయిత తన ప్రేమను తెలియజేయటానికి ఎంతో భావుకత్వాన్ని, కవిత్వాన్ని కథలో చెపుతాడు. 'ఇరగబూసిన సన్న జాజి ఎన్నెట్లో పాపలాట ఆడుకున్న ఏసంగి నేత్రి, ఎదురెదురు జట్లలో వుండాగానీ, మనిద్దరినీడలూ ముద్దాడుకోవాలని నలుగుర్ని నెట్టుకుంటూ నాదిక్కుకు వచ్చి నాగుండెకాయిల వుచ్చి నూకాలమ్మ చెరువంత అవ్వటం నీకొక్కదానికే ఎట్టాతెలిసి పోయిందో యావో!"

"హృదయాంతరాల్లో ఘనీభవించిన ఒక హిమసంద్రాన్ని వెచ్చచేసి నీచెవిలో వొంపెయ్యాలని" – ఎంతో భావుకత నిండిన కవిత్వం కదా ఇది. ఈ ప్రేమకథ పేరు కటికపూల వాన. ఇందులో రచయిత తొలిప్రేమ వాసనలు ఇప్పటికీ గుప్పుమంటున్నాయ్. ఏదో కోల్పోయిన బాధ ఆ పూలవాన జడిలో తడిసిపోయింది.

ఈ కథాసంపుటి ఒక ఆత్మకథలాంటి కథల సమాహారం. వీటిద్వారా మనకు మార్టిన్ కుటుంబం గురించి తెలిసేదేమంటే ఆయన తల్లి ఇక్టోరియా మహారాణి అసలుపేరు జయమ్మ అని, అక్క కత్తిరేనా అసలుపేరు క్యాథరీన్ అని, తాత లాజరు అని. ముందుమాటలో విమర్శకురాలు స్వరూపరాణి చెప్పినట్లు సింధు నాగరికతను మార్టిన్ తన ఇంటిపేరుగా చేసుకొని ఇందన్‌మార్టిన్ అయ్యాడు. ఇలా సింధూ నాగరికత వారసత్వాన్ని గర్వంగా చాటుకుంటూ అమ్మ భాషకు, యాసకు పట్టంకడుతూ సాహిత్యరంగాన్ని సుసంపన్నం చేశాడు కటికపూలు ద్వారా. ఇదే ఒరవడిలో అంటరానియాసలో మరిన్ని రచనలు ఆయన కలం నుంచి వస్తాయని ఆశిద్దాం. ❖

# తెల తెల్లని రెప రెపలు!



- చిత్తలూరి సత్యనారాయణ
8247432521

నువ్వు
దూరమవుతున్నావు
దూరమయ్యావు
ఎంత స్వచ్ఛంగా
మెరిసేదానివి
ఎంత రాసుకున్నా
కిమ్మనకుండా
అణిగిమణిగి
అణకువగా వుండేదానివి
ఒక్కోసారి పిచ్చి
గీతలతో
పిచ్చెక్కించినా
నేను చేసిన తప్పులకు
నిన్ను చించి
పోగులు పెట్టినా
ఎంత తెల్లగా
నవ్వేదానివి
ఉండ చుట్టి
డస్ట్ బిన్ లోకి
కసిదీరా విసిరేసినా
ఎంత గుంభనంగా
గాలికి దొర్లిపోయో
చేతికి దొరికిపోయో
పడి వుండే దానివి
నా తొలినాటి
కవితాక్షరాలను
ముద్దు చేసి
నీ ఒడిలో అమ్మలా
ఆడించింది నువ్వు
నా చేతులకంటిన
ఇంకు మరకలను
ప్రేమగా తుడిచి
నన్ను శుభ్ర పరిచింది
నువ్వు
ఏ పాడు గాలికి
పడమటి ధూళికి
ఎగిరిపోయావు
ఏ అద్దం పెంకులకింద
నలిగిపోయావు
కవులు కూడా
తమ చేతుల్లోంచి
తమ తెల తెల్లని
జ్ఞాపకాలను
గాలికెగరేసి
వేదికల మీద
రంగుటద్దాల్లోంచి
కవితలు వల్లెవేస్తున్నారు
చూడు
నీ తెల్ల రంగు భాష
ఇంకిపోయి
గాజు పలకల అంచుల
మీద
జారిపోతున్న
కవిత్వపు రంగుల
ఛాయలు
చూడు చూడు
అయినా
ఎప్పుడు పగిలిపోతాయో
తెలియని
నునుపు పలకల మీద
నాకంత నమ్మకం
లేదులే
ఎప్పుడు కరిగిపోతాయో
తెలియని
ఈ రంగుల రజను
మీద
నాకంత భరోసా
లేదులే
అందుకే
కలకాలం
దాచుకోవాల్సిన
నా గాయాలను
సంతోష గేయాలను
నీ ఒడిలోనే
పదిల పరుచుకుంటాను
కాగితాలుగా నిన్ను
కాదనుకున్నా
పుస్తకంగా
అచ్చొత్తుకుని
నా గుండె గుడిలో
దీపంలా
వెలిగించుకుంటూనే
వుంటాను
మా అమ్మ మనసంత
స్వచ్ఛమైన తెల్లనిదానివి
కదా
నామనసుకు
మరకలంటిన ప్రతిసారి
నీ మీద అక్షరాలుగా
సేద తీరుతాను
తప్పిపోయిన
నీ జతగాన్ని కూడా తెచ్చి
నీ బుగ్గలకు
కొత్త సిగ్గులు
రాస్తాను
నువ్వెన్నయినా చెప్పు
నిన్ను తిరగేసే శబ్ద
సంగీతమే
నాకు మేలుకొలుపు
పేజీలుగా విప్పుకునే
నీ అక్షర నాదమే
నా ప్రగతి రణన్నినాదం
నువ్వు మరపు
మలుపుల్లోకి
ఎగిరిపోయినా
నా గుండె
మూల మలుపుల్లో
నన్ను నీ రెండట్టల మధ్య
కొన్ని పేజీల్లా
పొదువుకుని
ఎప్పటికప్పుడు కొత్త
కాగితంలా
రెప రెపలాడుతూనే
వుంటానులే! ♦

# స్వీకారం



**ఒక...** కవిత్వం

**సిద్ధార్థ కట్టా**

వెల :65/- పేజీలు: 104

ప్రతులకు : 9490099059

**అ**న్ని కాలాల్లోనూ పెడసరంగా ధిక్కార స్వరాలు వినిపించే వాళ్ళు ఉన్నట్లే తెలుగు కవిత్వ – సాహిత్యాలలో కూడా అలాంటి కొత్తతరం, కొత్తస్వరం వినవస్తూనే ఉన్నాయి. అలాంటి వాళ్ళను హత్తుకోవాలనుకునే వాళ్ళకోసం ఇదిగో ఇరవైనాలుగేళ్ళ కుర్రాడు సిద్ధుడి కవిత్వం మీ ముందుకు తీసుకువస్తున్నాం.

**- కె. సత్యరంజన్**



**నది నా అంతర్ముఖం** కవిత్వం


**మామిడి కోదండరావు**

వెల : 60/- పేజీలు: 96

ప్రతులకు : 9701119270

**ప్ర**యోజనం లేని కవిత్వం వృథా? అది సమాజానికి ప్రయోజనమైతే దాన్ని సమాజం గౌరవిస్తుంది. కవి లేని నాడు కూడా చదువుకుంటుంది. గుర్తు చేసుకుంటుంది. అలా గుర్తుండే కవుల కోవలోకి మామిడి కోదండరావు వస్తారు. సమాజాన్ని అధ్యయనం చేస్తూ, గుర్తించిన సత్యాలను సమాజానికి గుర్తుండిపోయేలా రాశారు.

**- నల్లి ధర్మారావు**



**చు'రుక్కులు'** కాదేది కవిత కనర్హం


**డా. దేవరకొండ సహదేవరావు**

వెల : 60/- పేజీలు: 160

ప్రతులకు: 9393331562

**మా**స్టారి రచనలో చిత్తశుద్ధి, ఆత్మస్థైర్యం దండిగా ఉన్నాయి. అది వారి జీవలక్షణం. 'చిత్తశుద్ధి లేనినాడు చిరుదీవం మొరాయిస్తుంది. ఆత్మస్థైర్యం లేనినాడు అగ్గిపుల్ల హఠాయిస్తుంది' అని చలాగ్గా ఒక కవితలో తేల్చి చెప్పగల స్పష్టత వారి సొంతం. శ్రీశ్రీ 'ఋక్కులు' నుంచి తెచ్చుకున్న నేపథ్యంతో, ఒక అక్షరం కలిపి ఈ కొన్ని డజన్ల కవితలను 'చురుక్కులు' చేశారు మాస్టారు.

**- రామతీర్థ**



**రచయితలు.. ప్రచురణ కర్తలు**

విధిగా పాటించవలసిన ప్రాథమిక కర్తవ్యాలు

సేకరణ, కూర్పు, సంకలనం: **చలపాక ప్రకాష్**

వెల : 10/- పేజీలు: 16

ప్రతులకు : 9247475975

**పు**స్తకాలు ప్రచురించుకునే రచయితల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్న విషయం తెలిసిందే. ఆ పుస్తకాలను అమ్ముకోవడం ఎలా అనే ప్రశ్న రచయితలకు ఎదురవుతుంది. వాటిని అమ్మడానికి ఉన్న అవకాశాల గురించి అందరికీ తెలియదు. అటువంటి వారికోసం చక్కటి సమాచారంతో చలపాక ప్రకాశ్ ఈ చిరుపుస్తకాన్ని వెలువరించారు. ప్రతీ రచయిత దగ్గర ఉండదగ్గ పుస్తకం ఇది.



**అలుకు మొలకలు** కవిత్వం

**బైతి దుర్గయ్య**

వెల : 100/- పేజీలు: 70

ప్రతులకు: 9959007914

**వా**డుక భాషలోనే కవిత్వం ప్రజలకు చేరుతుందనే ప్రగాఢమైన నమ్మకమున్న ఆధునిక కవులందరి లాగానే దుర్గయ్య కూడా నిత్యవ్యవహార భాషలో కవిత్వం రాసాడు. స్థానీయత దుర్గయ్య కవిత్వంలోని మరొక ప్రధాన లక్ష్యం.

**- ఏనుగు నరసింహారెడ్డి**



**సీక్వెల్ కథలు** కథకు కథ - పరామర్శ

**డా॥ శింగుపురం నారాయణరావు**

**డా॥ టి.జి. ఆర్. ప్రసాద్**

వెల : 30/- పేజీలు: 48

ప్రతులకు : 9556627577

**ఈ** పరిశోధన వ్యాసం తెలుగు సాహిత్య విమర్శలో కొత్త ఒరవడిని సృష్టించింది. ఈ ఇద్దరు కథకులు తెలిసి రాసిన మూల సీక్వెల్ కథల మీద విమర్శ ఇది. విమర్శకులు ప్రయత్నిస్తే ఎవరెవరో ఎప్పుడెప్పుడో రాసిన కథలలో కూడా ఈ 'సీక్వెల్' లక్షణాలను గుర్తించి వివేచించడానికి అవకాశముంది. ఈ సరికొత్త ప్రయత్నం చేసిన విమర్శకులకు అభినందనలు.

**- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

# స్వీకారం



## నిశ్శబ్ద శబ్దం నానీలు, పాటలు, కవితలు

**లక్ష్మి గొల్లపల్లి**

వెల :150/- పేజీలు: 160

ప్రతులకు : 9440262612

**అ**త్యంత ప్రతిభావంతురాలైన లక్ష్మి జీవితం అర్ధశతాబ్దంతో ముగిసి పోయింది. ఆకాశంలో సగభాగం శూన్యం కాలేదు. ఆమె కవిత్వంతో సంపూర్ణమైంది. శ్రామిక వర్గాలకు సంబంధించిన దళిత స్త్రీలు సాహిత్య మార్గాలకు మళ్ళడమంటే మామూలు విషయం కాదు. లక్ష్మి రచయిత్రిగా తన సత్తా నిరూపించుకుంది. తనకంటే ముందున్న దళిత రచయిత్రుల జాబితాలోకి సగర్వంగా తన పేరు నమోదు చేసుకుంది.

**- డా॥ ఎండ్లూరి సుధాకర్**



## ప్రళయం కథా సంకలనం


సంపాదకుడు: **చలపాక ప్రకాష్**

వెల :30/- పేజీలు: 40

ప్రతులకు: 9247475975

**మూ**డు కథలున్న ఈ సంపుటిలో మొదటి రెండు కథల్లో ప్రకృతి ప్రత్యక్ష పాత్ర. మూడవ కథలో హేతువుగా ఉటంకింపబడిన పాత్ర. మూడూ జల ప్రళయానికి చెందిన గాథలు. రచయితలు ముగ్గురూ సాహిత్యం పట్ల ఆరాధనా భావం ఉన్నవారు, అధ్యయన శీలం, విశ్లేషణాత్మక దృష్టితో రచనలో మెళకువలు తెలుసుకోవాలనే అనురక్తీ కలిగినవారు.

**- విహారి**



## సౌందర్య సుగంధాలు

**పద్యోక్తి - నీతిశతకం - పద్యసూక్తి - పద్యకథ**

**బండి ప్రసాదరావు**

వెల : 50/- పేజీలు: 104

**ప్ర**సాదరావు గారు కవిత్వం, పాండిత్యం మీదకంటే ప్రతిభ మీద ఎక్కువ ఆధార పడి ఉంటుందని నమ్మే వ్యక్తి. అందుకనే ఆయనకున్న లోకజ్ఞానం, పరిశీలనాశక్తి, రచనాసక్తి చాలామందికి లేదని ధైర్యంగ చెప్పవచ్చు. జన్మాంతర సంస్కారం సుమ పరిమళాల కవితల నందించడానికి మన ప్రసాదరావు గారికి శక్తినిచ్చింది. ఆ శక్తితో సాహిత్య వ్యవసాయం చేస్తూ చక్కని కవితల పంటను పండిస్తున్నారు.

**- డా. బులుసు వేంకట సత్యనారాయణమూర్తి**



## వ్యాస నందనం సాహిత్య వ్యాసాలు

**నందవరం కేశవరెడ్డి**

వెల : 80/- పేజీలు: 104

ప్రతులకు : 9885120878

**న**ందవరం ఆరోగ్యకరంగా, పరిణిత మార్గంలో తన విమర్శక నడక ప్రారంభించారు. నందవరం నడక, నడత మంచి మార్గంలో సాగుతున్నాయి. సృజన రచనలకే కాదు, విమర్శ వ్యాసాలకు కూడా పేరు పెట్టడం కళ. నందవరం వ్యాస శీర్షికలు కళాత్మకంగా ఉంటూ విమర్శనాంశాలలోని ప్రజా స్వభావాన్ని వ్యంజిస్తున్నాయి. శీర్షికలకు తగినట్లే వ్యాసాల లోపల చర్చ కొనసాగుతుంది. ఇదొక మంచి సమన్వయం.

**- కె. శివారెడ్డి**



## పూలవనం కవితా సుమమాలిక

**బండి ప్రసాదరావు**

వెల : 100/- పేజీలు: 68

**పూ**లవనం కవితా సంపుటి చదివినప్పుడు ఆయన ఆవేదన, ఆర్తి అర్థమయ్యింది. సమాజంపట్ల ఆయనకున్న బాధ్యత అవగత మయ్యింది. ఇందులోని ప్రతి కవితలో ఒక బాధ్యత ఉంది. ఒక తపన ఉంది. మీది మిక్కిలి సమాజాన్ని మార్చాలనే ఉత్సుకత కనిపిస్తుంది.

**- శిఖామణి**



## అనంతరత్నాలు బాల సాహిత్యం

**వి. చంద్రశేఖరశాస్త్రి**

వెల : 70/- పేజీలు: 112

ప్రతులకు : 9441883190

**అ**నంత రత్నాలు చదివిన వాళ్ళకు తెలుగు జాతి, ఇంకా చెప్పాలంటే భారత జాతి నిర్మాణంలో అనంతపురం జిల్లా నిర్వహించిన చారిత్రక పాత్ర అర్థమౌతుంది. భారతీయ ఆర్థిక రాజకీయ సాంఘిక సాంస్కృతిక రంగాల ఔన్నత్యానికి అనంతపురం జిల్లా చేసిన దోహదం తెలుస్తుంది. నండూరి రామకృష్ణమాచార్యులు గారి అనంతపురం జిల్లా 'రణజ్ఞత', 'జ్ఞానామృతవృష్టి' ఈ తేటగీతులలో తేటతెల్లమౌతుంది. అనంతపురం జిల్లాలో కరువు గంజిలే గాని, తక్కిన రంగాలలో ఇది అపరంజి అని రుజువు చేస్తుంది.

**- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

# స్వీకారం

## మనసు ఊసులు



పొంటమ్ - పదాలు - విహంగాలు


**బండి ప్రసాదరావు**

వెల :50/- పేజీలు: 124

**బం**డి ప్రసాదరావు గారు తెలుగు సాహిత్యంలో ఇప్పుడు వస్తున్న అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేస్తున్నవారు. నేటి యువతను చైతన్యం చేయడానికి కృషిచేస్తున్నవారు. ఏదో చెప్పాలనే తపన, సమాజాన్ని మార్చాలనే కసి ఉన్నవారు. ఆయన ఏది రాసినా సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ రాసినవి గానే కనిపిస్తాయి.

**- డా॥ ఎన్. ఈశ్వర్‌రెడ్డి**

## చిత్రావతి కథలు



**ఉప్పరపాటి వెంకటేశులు**


వెల : 90/- పేజీలు: 122

ప్రతులకు: 8074483952

**రా**యలసీమలో కొత్త సందేహాలూ, కొత్త ప్రశ్నలూ పుట్టుకొస్తున్నాయి. నవ్య భావవీచికలు వీస్తున్నాయి. అయినా మూడు దశాబ్దాల కిందటి మూసలోనే కథవస్తువులను ఎన్నుకుంటూ, జీవిత చిత్రణ కథల్లో సౌకర్యంగా కొట్టుకుపోయే సీనియర్ రచయితలకు ఈ మూడు కథలూ మార్గనిర్దేశం చేస్తాయి. రాయలసీమ సమాజంలో మొదలైన ఈ భావచలనాన్ని ఒడిసిపట్టడంలో ఈ మూడు కథలూ విజయం సాధించినాయి.

**- బండి నారాయణస్వామి**

## తెలుగు పౌరుషం భాషోద్యమం



సంకలనం: **తవ్వా ఓబుల్ రెడ్డి**

వెల : 100/- పేజీలు: 90

ప్రతులకు: 9440024471

**క**డప జిల్లా మైదుకూరులో 2009లో ఒక పాఠశాలలో 3వ తరగతి పిల్లలు తెలుగులో మాట్లాడారని వారి మెడలో 'ఐ నెవర్ స్పీక్ తెలుగు' అని అట్టలు వేలాడదీసిన సంఘటన జరిగింది. ఆ సంఘటన రాష్ట్రంలో తీవ్ర అలజడి రేపింది. ఆ సంఘటనకు స్పందనగా వచ్చిన వ్యాసాలు, వార్తలు, సంఘటనల ఫొటోల సమాహారం ఈ పుస్తకం. ఆనాటి ఉద్యమస్ఫూర్తిని చక్కగా సంకలనం చేసి వెలువరించారు.

## ఆధునిక తెలుగు సాహిత్యంలో ముస్లిం జీవన చిత్రణ



**డా॥ వి. గీతానాగరాణి**

వెల : 150/- పేజీలు: 168

ప్రతులకు : 8985435515

'**ఆ**ధునిక తెలుగు సాహిత్యంలో ముస్లిం జీవన చిత్రణ' అనే సిద్ధాంత వ్యాసాన్ని డా॥ నిడమర్తి నిర్మలాదేవి గారి పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 2003లో సమర్పించాను. ఈ సిద్ధాంత వ్యాసానికి గాను నాకు ఆగస్టు 2004లో డాక్టరేట్ లభించింది. ముస్లిం సాహిత్యం మీద యం.ఫిల్. పిహెచ్.డి చేయగోరే విద్యార్థులకు ఉపయోగపడ్తుందన్న ఉద్దేశంతో ఈ సిద్ధాంత వ్యాసంలోని కొన్ని ముఖ్యమైన అధ్యాయాలను మార్పులూ, చేర్పులూ చేసి పుస్తకంగా ముద్రించ సంకల్పించాను.

**- డా॥ కె. గీతానాగరాణి**

## డా॥ ఉప్పల లక్ష్మణరావు



సాహితీ స్ఫూర్తిమంతం


సంకలనం: **అడపా రామకృష్ణ**

వెల : 40/- పేజీలు: 40

ప్రతులకు : 9505269091

**ఉ**ప్పల లక్ష్మణరావు గారి జీవితం, సాహిత్య కృషిపై పలువురు ప్రముఖులు రాసిన వ్యాసాల సంకలనం ఇది. వీటితో పాటు ఉప్పల లక్ష్మణరావు గారి స్వదస్తూరితో ఉన్న అరుదైన లేఖ, వారి మాస్కో ప్రయాణానికి సహాయం చేసిన డి.ఎల్.ఎన్. రాజు ఛాయాచిత్రం, ఉప్పల లక్ష్మణరావు గారి సహచరి మెల్లీ షోలింగర్ గురించిన విలువైన సమాచారంతో తదితర వివరాలతో కూడిన చక్కటి చిరుపుస్తకం ఇది.

## పసి(డి) తెమ్మెరలు



బాల కవుల పద్య సంకలనం

సంకలనం: **గొబ్బూరి గంగరాజు**

వెల : 40/- పేజీలు: 64

ప్రతులకు : 9032273064

**జి**ల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మల్లెల మడుగు, అశ్వాపురం మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఈ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు విద్యార్థినీ విద్యార్థులకు పద్య రచనపై అవగాహన కలిగించడమే కాకుండా వారిచేత పద్యాలు రాయించి ప్రచురించడం ప్రత్యేకంగా అభినందించవలసిందే. ఈ కృషి ఇతర పాఠశాలలకు, ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది.

**కవిత**

# 1947ని జ్ఞాపకం చేసుకుంటూ

హిందీ మూలం : **కేదార్‌నాథ్ సింగ్**
అనువాదం : **డా.వెన్నా వల్లభరావు**
**94903 37978**



*కేదార్‌నాథ్ సింగ్!*
*నీకు నూర్‌మియా గుర్తున్నాడా?*
*గోధుమరంగు శరీర ఛాయగల నూర్‌మియా*
*మరుగుజ్జు నూర్‌మియా*
*రామ్ గఢ్ మార్కెట్లో సుర్మా అమ్మే*
*అందరికంటే ఆఖరున తిరిగొస్తూ*
*కనిపించే నూర్‌మియా*
*నీకు అస్సలు జ్ఞాపకం లేదా*
*కేదార్‌నాథ్ సింగ్?*

*నీకు జ్ఞాపకముందా ఉర్దూ పాఠశాల*
*చింత చెట్లు గోరీల దొడ్డి*
*నువ్వు బట్టీపట్టిన ఎక్కాలు*
*19వ ఎక్కం వరకు*
*అన్ని ఎక్కాలూ జ్ఞాపకమేనా?*
*నీ పాత, మర్చిపోయిన పలకపై*
*కూడిక, తీసివేతలు చేసి తేల్చగలవా?*

*ఒకానొకరోజు అకస్మాత్తుగా నూర్‌మియా*
*నీ ఊరు విడిచి ఎందుకెళ్లిపోయాడో!*
*నీకు తెలుసా -*
*ఇప్పుడతను ఎక్కడున్నాడో*
*ఢాకాలో ఉన్నాడో*
*ముల్తాన్లో ఉన్నాడో చెప్పగలవా?*
*ప్రతి సంవత్సరం ఎన్ని ఆకులు రాలిపోతున్నాయో*
*పాకిస్తాన్‌లో*


*నువ్వు మౌనంగా ఉన్నావేం కేదార్ నాథ్ సింగ్*
*నీ లెక్కల పరిజ్ఞానం బలహీనమా!*

***(ఏప్రిల్ 21న కన్నుమూసిన జ్ఞానపీఠ పురస్కార గ్రహీత హిందీకవి కేదార్‌నాథ్ సింగ్‌కి నివాళిగా)***

❖

# నిశానినే.....,

**- మెరాజ్ ఫాతిమా**
**9000173860**



*చదువుకొన్నాననే అనుకొన్నా ఇన్నాళ్ళూ....,*
*చలించని, జ్వలించని అక్షరాన్ని నమ్ముకొన్నా....,*
*చస్....,*
*భూమిని శోదిస్తున్న గ్రహాంతర వాసిలా,*
*గిర గిర తిరుగుతూనే ఉన్నా..,*
*అరె భాయ్, డార్విన్ సిద్ధాంతం కోతి గురించి*
*చెప్పిందేగానీ....,*
*కులాన్నీ దానినంటుకొన్న కలాన్నీ గురించీ చెప్పిందా...?*

*.నీతి పాఠాలేవీ జాతి వైరాల గూర్చి చెప్పలేదే....,*
*నాతి కోసం జరిగిన యుద్ధాలు నీచ ప్రవృత్తిని*
*ఆపలేదే...,*
*ధర్మ జ్ఞానాన్నీ సైతం వాంఛల తరాజులో తూసి,*
*ధర్మాత్ముల అక్షయపాత్రలో ఉమ్మి ఊసి,*
*వ్యవస్థ మీద పైశాచికంగా విస్తరిస్తూ.....,*
*కులమంటాడొకడూ...., కులకమంటాడొకడు.*

*భూమి నాదని ఆక్రమిస్తూ.....,*
*మత మంటాడొకడూ...*
*మంట పెడతాడొకడు.*
*మస్తిష్కంలో మచ్చలా పడ్డ వికృత రూపం*
*ఈ నవ సమాజం,*
*కులాల కుళ్ళులో...మతాల మలినంలో....,.....*
*నా కలానికి అంటుకుంటున్న. నాలుగక్షరాలకు కత్తులు*
*కట్టి పోరుసలపలేని.*
*నిశానిని....అగోచర పోరులో నిశ్శబ్దంగా సంచరిస్తున్న*
*నిశాచరిని*

❖

# రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం శతవర్థంతి



రాజమహేంద్రవరంలో మున్సిపల్ స్టేడియం వెనుక గల గనిరాజు కళ్యాణ మండపంలో మే 27న జరిగిన కందుకూరి వీరేశలింగం శతవర్థంతి సంవత్సర ప్రారంభకార్యక్రమం. చిత్రంలో తెలకపల్లి రవి, సతీష్, గనారా, మంతెన సీతారాం, ప్రకాష్, కె. లక్ష్మయ్య, నాగార్జున, విజయభక్ష్, పవన్ తదితరులు

కందుకూరి వీరేశలింగం శతవర్థంతి సంవత్సర ప్రారంభ కార్యక్రమం మే 27న రాజమహేంద్రవరంలోని గనిరాజు కళ్యాణ మండపంలో సాహిత్య, సాంస్కృతిక, కళా, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ "కార్యశూరుడు వీరేశలింగం, కదం తొక్కి పోరాడిన సింగం' అని మహాకవి శ్రీశ్రీ వర్ణించినట్లు సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం మూఢాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడని అన్నారు. సాహిత్య, సాంస్కృతిక, కళా, సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యాన తొలుత కోటిపల్లి బస్టాండు వద్ద ఉన్న వీరేశలింగం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభా వేదిక వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సభలో తెలకపల్లి మాట్లాడుతూ బుల్లి, వెండి, రాజకీయ తెరలపై మూఢ నమ్మకాల ప్రచారం కన్పిస్తోందన్నారు. సాహితీ ప్రియులు, కవులు, కళాకారులు, ప్రజాశక్తి, ప్రజా సంఘాలు వీరేశలింగం వారసత్వాన్ని అందుకోవాలని కోరారు. దురాచారాలపై అగ్ని తరంగమని, వేమనకు కొనసాగింపు వీరేశలింగమని చెప్పారు.

సామాజిక కార్యకర్త మంతెన సీతారాం మాట్లాడుతూ వీరేశలింగాన్ని స్ఫూర్తిగా తీసుకుని మూఢాచారాలపై సామాజిక ఉద్యమాన్ని నిర్వహించాలన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు వొరప్రసాద్ మాట్లాడుతూ వీరేశలింగం భావాలు మూలపడటం వల్ల సమాజం అజ్ఞానం వైపు వెళ్తోందన్నారు. సమాజాన్ని విజ్ఞానం వైపుగా తీసుకెళ్లడానికి వీరేశలింగం రచనలు ఎంతో ఉపయోగపడ్తాయని అన్నారు. ఈనాటికీ మూఢనమ్మకాలను ప్రజల్లో వ్యాప్తిచేయడానికి స్వార్థశక్తులు ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. ఈ శతవర్థంతి సందర్భంగా వీరేశలింగం భావజాలాన్ని విస్తృతంగా ప్రజలకు చేర్చడానికి అందరూ కృషిచేయాలని కోరారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె.లక్ష్మయ్య మాట్లాడుతూ వీరేశలింగం రచనలను ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురిస్తోందని చెప్పారు. ప్రజాశక్తి రాజమహేంద్రవరం ఎడిషన్ మేనేజర్ టిఎస్.ప్రకాష్ మాట్లాడుతూ కందుకూరి ఆశయాలను, ఆస్తులను కాపాడుకునేందుకు ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరముందన్నారు. రచయిత్రి డాక్టర్ విజయభక్ష్ మాట్లాడుతూ అన్నికులాలకు, మతాలకు కందుకూరి తమ సంస్థల్లో, ట్రస్టులో స్థానం కల్పించారన్నారు. సభాధ్యక్షులు, రాజమహేంద్రి ఆలోచనా వేదిక నాయకులు పి.సతీష్ మాట్లాడుతూ అశాస్త్రీయ భావాలకు వ్యతిరేకంగా అందరూ కలిసి ఐక్యంగా కృషి చేయాలని అన్నారు. ప్రజానాట్యమండలి కార్యకర్తలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వేమన రూపకం ఆకట్టుకున్నాయి. ❖



విజయవాడలో అరసం ఆధ్వర్యంలో విశాలాంధ్ర కార్యాలయంలో మే 27న జరిగిన పెద్దిభొట్ల సుబ్బరామయ్య నివాళి సభ. చిత్రంలో ప్రసంగిస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ, కొండపల్లి మాధవరావు, శాంతిశ్రీ, గుమ్మా సాంబశివరావు, వల్లూరి శివప్రసాద్, ఈదుపుగంటి నాగేశ్వరరావు, సింగంపల్లి అశోక్‌కుమార్, కొత్తపల్లి రవి బాబు




విశాఖ సాహితీస్రవంతి ఆధ్వర్యంలో పౌరగ్రంథాలయంలో ఏప్రిల్ 22న ఆసిఫా హత్యాచార సంఘటనపై నిరసన గళం కార్యక్రమం. చిత్రంలో ప్రసంగిస్తున్న డా॥ మాటూరి శ్రీనివాస్, యల్లాప్రగడ రమాదేవి, నూనెల శ్రీనివాసరావు, పెంటకోట రామారావు, శంకర్




అనంతపురంలో ఎన్‌జివో హోంలో ఏప్రిల్ **29**న సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన ఇండస్ మార్టిన్ పుస్తకం 'కటికపూలు' ఆవిష్కరణ సభ. చిత్రంలో సింగమనేని నారాయణ, జి. లక్ష్మీనరసయ్య, ఇండస్ మార్టిన్, యండవల్లి భారతి, పొట్లూరి హరికృష్ణ తదితరులు.




అనంతపురంలో ఎన్‌జివో హోంలో ఏప్రిల్ **29**న సాహితీస్రవంతి ఆధ్వర్యంలో జరిగిన యండవల్లి భారతి పుస్తకం 'ఎడారిబతుకులు' ఆవిష్కరణ సభ. చిత్రంలో సింగమనేని నారాయణ, జి. లక్ష్మీనరసయ్య, ఇండస్ మార్టిన్, యండవల్లి భారతి, పి. కుమారస్వామి, పొట్లూరి హరికృష్ణ తదితరులు.



అనంతపురంలో ప్రెస్‌క్లబ్‌లో ప్రజాశక్తి బుక్‌హౌస్, సాహితీస్రవంతి సంయుక్తంగా ఏప్రిల్ **11**న జరిగిన తెలకపల్లి రవి రాసిన 'ప్రత్యేక హోదా – ప్రజా ఉద్యమం' పుస్తక ఆవిష్కరణ సభ. చిత్రంలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, పి. కుమారస్వామి, నల్లప్ప, జగదీష్, బాబూరావు, హిదయ్‌తుల్లా తదితరులు



హైదరాబాద్ లిటరరీ ఫెస్ట్‌లో కటుకోర్యుల కవితా సంపుటి 'అగ్నిశిఖ' ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో తెలకపల్లి రవి, ఎస్వీ సత్యనారాయణ, నందిని సిద్ధారెడ్డి, క్రాంతి శ్రీనివాసరావు, కటుకోర్యుల రమేష్, మువ్వా శ్రీనివాసరావు, కె. ఆనందాచారి , జి. యాదగిరి రావు తదితరులు



అనంతపురంలో ప్రెస్‌క్లబ్‌లో ఏప్రిల్ **22**న సాహితీస్రవంతి ఆధ్వర్యంలో వర్తమాన సాహితీ తరంగాలు పేరున జరిగిన ఆశావాది ప్రకాశరావు సాహిత్య సమాలోచన సభ. చిత్రంలో యేలూరి యెంగన్న, ఆశావాది ప్రకాశరావు, పి. కుమారస్వామి, కటకం కృష్ణవేణి, దాదా ఖలేందర్, చిట్రా రామ్మోహన్, మల్లిపూడి రవిచంద్ర, వీటూరి వెంకటేశ్వర్లు తదితరులు



అనంతపురంలో తాశీల్దార్ కార్యాలయంలో సాహితీస్రవంతి, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఏప్రిల్ **27**న ఆసిఫా ఉదంతంపై జరిగిన జన కవనం. చిత్రంలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, పి. కుమారస్వామి, దాముగట్ల హిదయ్‌తుల్లా, నల్లప్ప ఉన్నారు.



కాకినాడలో ఏప్రిల్ **29**న సాహిత్య, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో జరిగిన 'సంస్కృతి–సంక్షోభాలు– సంవాదాలు' సంకలనం ఆవిష్కరణ సభ. చిత్రంలో తెలకపల్లి రవి, చిరంజీవినీ కుమారి, సి. స్టాలిన్, పి.ఎ. దేవి, గనారా, రావు కృష్ణారావు, కట్టా కృష్ణారావు, మార్ని జానకిరాం తదితరులు ఉన్నారు.



కర్నూల్‌లో సాహితీస్రవంతి ఆధర్యంలో టౌన్ మోడల్ హైస్కూల్‌లో ఏప్రిల్ **29**న జరిగిన కటికపూలు ఆవిష్కరణ సభ. చిత్రంలో వై. జయరాజ్, జి. లక్ష్మీనరసయ్య, జంధ్యాల రఘుబాబు, కె. సురేష్, ఇండస్ మార్టిన్, డి. ఆనంద్‌బాబు, కెంగార మోహన్ తదితరులు

# దార్ల అబ్బాయి పేరున హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో గోల్డ్‌మెడల్

- ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు



ప్రముఖ సంఘసంస్కర్త కీ.శే. దార్ల అబ్బాయి గారు తూర్పుగోదావరి జిల్లా, చెయ్యేరు అగ్రహారంలో జన్మించారు.తన అసలు పేరు 'లంకయ్య' అయినప్పటికీ ఊరులో వాళ్ళంతా 'దార్ల అబ్బాయి' అని పిలిచేవారు. ఊరందరికీ తలలో నాలుకలా ఉండేవాడు. దానితో 'అబ్బాయి' అనే పేరే స్థిరపడిపోయింది. దార్ల అబ్బాయి నిరక్షరాస్యుడైనప్పటికీ,తన కుటుంబాన్ని ఉన్నత చదువులు చదివించి తన గ్రామానికి ఆదర్శంగా నిలిపారు. తన గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల వారికీ ఆదర్శంగా నిలిచి, నిరక్షరాస్యత, అంటరానితనం నిర్మూలనకు విశేషంగా కృషిచేశారు. బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించి, బాల్య వివాహాల్ని మానిపించారు. దళితులు మద్యపానం, పొగత్రాగడం వంటి వాటివల్ల సమాజంలో చిన్నచూపుచూస్తారని, వాటిని మాన్పించడానికి ఎంతగానో పాటుపడ్డారు. డా॥బి.ఆర్.అంబేద్కర్, డా॥బాబూ జగజ్జీవన్ రామ్ ల జయంతి, వర్ధంతుల సందర్భంగా ప్రజల్ని ఉత్తేజితుల్ని చేసే ప్రసంగాలు చేసేవారు. దళితుల్ని సమైక్యపరచడానికీ, వారిని చైతన్యవంతుల్ని చేయడానికి ఈ కార్యక్రమాల్ని చక్కటి మార్గంగా మలుచుకునేవారు. వారి శ్రీమతి పెదనాగమ్మ కూడా భర్తకు ఎంతగానో తన సహకారాన్ని అందించేవారు. గ్రామీణప్రాంతాల్లో స్త్రీ ప్రసూతి కార్యక్రమాల్లో ఈమె తన సహాయ సహకారాల్ని అందించేవారు. దేవాలయ నిర్మాణాలకు తమ వంతు సహాయాన్ని చేసేవారు. భారతదేశం స్వాతంత్ర్యం సాధించేనాటికి పదేళ్ళప్రాయం. అంటే ఈయన 1937 ప్రాంతంలో జన్మించారు. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా పాఠశాలలు మూసేసారనీ, గాంధీజీ పిలుపుమేరకు ఆ చిన్న వయసులోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని ఆ ఊరి ప్రజలు చెప్తారు. ఆయన మార్చి 30, 2009 న పరమపదించారు. నేటికీ ఆయన స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది. దార్ల అబ్బాయి, శ్రీమతి పెదనాగమ్మగార్ల పేరుతో ప్రతి యేడాదీ ఒక గోల్డ్ మెడల్ (గోల్డ్ కోటెడ్, సిల్వర్ ప్లేట్)ని తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదులో ఎం.ఏ., తెలుగు చదువుతున్న విద్యార్థులకు ఇవ్వాలని ట్రస్టు కోరికను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు వారు పరిశీలించి, అంగీకరించారు. ప్రతి యేడాదీ ఒక గోల్డ్ మెడల్ ని ఎం.ఏ., తెలుగు లో భారతీయ సాహిత్య శాస్త్రం (Indian Poetics), సాహిత్య విమర్శ (Principles of Literary Criticism) సబ్జెక్టులను చదివేవారిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఇవ్వడానికి అకడమిక్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ యేడాది నుండి బంగారు పతకాన్ని ఇస్తున్నట్లు 2018–19 ప్రవేశప్రకటన ప్రాస్పెక్టస్ (గోల్డ్ మెడల్ సీరియల్ నెం: 46) ప్రకటించింది. ఈయన పేరుతో బంగారుపతకాన్ని ప్రకటించడానికి అంగీకరించినందుకు, ప్రజల్లో ఆయన స్ఫూర్తిని, చైతన్యాన్ని నిరంతరం గుర్తు చేసుకొనే అవకాశం కల్పించడం అరుదైన అవకాశంగా భావిస్తున్నాం. విశ్వవిద్యాలయం అధికారులకు ధన్యవాదాలు.

**(రచయిత– దార్ల అబ్బాయి, శ్రీమతి పెదనాగమ్మ మెమోరియల్స్ ట్రస్టు చైర్మన్)**


# కొమ్మవరపు విల్సన్ రావు కవితా సంపుటికి పురస్కారం

పల్లా నరసింహులు స్మారకార్థం ఏర్పాటుచేసిన పల్లా జాతీయ కవితా పురస్కారం 2018 'దేవుడు తప్పిపోయాడు' కవితా సంపుటికి గాను కొమ్మవరపు విల్సన్‌రావుకు లభించిందని యువ సాహితి వ్యవస్థాపక అధ్యక్షులు డా॥ పల్లా కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పురస్కారానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలనుండి 23 కవితాసంపుటాలు వచ్చాయని తెలిపారు. జూన్ 6 న కడప జిల్లాలోని ప్రొద్దుటూరులో శ్రీ చౌడేశ్వరిదేవి కల్యాణమండపంలో జరిగే సాహితీ సదస్సులో ప్రముఖ కవులు నరాల రామారెడ్డి, డా. ఉమ్మడి శెట్టి రాధేయ, డా. ఎన్. రామచంద్ర, తెలుగు రక్షణ వేదిక జాతీయ అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ, యోగి వేమన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఎన్. ఈశ్వర రెడ్డి, డా. కొమ్మిశెట్టి మోహన్ సమక్షంలో యువ సాహితి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పల్లా కృష్ణ ఈ పురస్కారంతో కొమ్మవరపు విల్సన్ రావుని 5116 రూపాయల నగదు బహుమతితో పాటు మెమెంటో శాలువాతో సత్కరించనున్నట్లు తెలిపారు. ❖

# పాఠకుడిగా నా స్పందన

- డా. హనుమంతరాజు, 9441130264

సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ సంచిక చూసిన తరువాత ఒక బాధ్యత గల్గిన పాఠకుడిగా నా స్పందనను తెలియజేయకుండా ఉండడం తప్పని ఈ లేఖని వ్రాస్తున్నాను. అయోమయంగా, భయంగా, జుగుప్సగా ఉన్నటువంటి మన వాతావరణాన్ని (రజకీయ, సామాన్య, ఆర్థిక) కొంతవరకు మర్చిపోవటానికి మంచి సాహిత్య పఠనం కొంచెం హాయినిస్తుంది కదా అటువంటి కథలు, వ్యాసాలు, ప్రచురిస్తున్న ఈ పత్రికకు సలాము చేస్తూ, ఒక పాఠకుడిగా నా స్పందనను తెలియజేస్తున్నాను. ఇది వ్రాస్తున్న సమయంలో ఒక ప్రక్క ఒక కార్పొరేటు సినిమా ఆడియో, వీడియో రిలీజ్, మరొక వైపు అంగాంగ ప్రదర్శన చేస్తున్న నటుల యొక్క శరీర ఊపులతో మొదలవుతున్న ఐపిల్ క్రికెట్ ప్రారంభం జరగుతున్నది. ఆ కార్పొరేటు సినిమా (మహేష్‌బాబు) కమ్యూనిస్టు సినిమా అని, బాగుంటుందని, స్వయంగా నా పిల్లలు కూడా అంటూంటే నాకు నవ్వు వచ్చింది. కమ్యూనిష్టు, పూలే అంబేద్కర్, థెరిస్సా లాంటి వాళ్ళ ఫొటోలు, పాటలు కూడా ఫక్తు సినిమా రాజకీయానికి, వ్యాపారానికి వాడుకుంటూ చివరికి నకిలీకి, అసలికి తేడా లేకుండా చేస్తున్నారు. కులాన్ని వివాహానికి, ఓటుకు కాకుండా హీరో కుల సంఘాలకు, సరదాగా, సినిమా చూడటానికి కూడా గజ్జిగా వాడుకుంటున్న సమాజానికి మంచి సాహితయం అవసరమని, అట్లాంటి సాహిత్యాన్ని తెస్తున్న ఇట్లాంటి పత్రికలలోకి ఇంకా, ఇంకా వెళ్ళి యువ పాఠకులకు చేరాలని నా ఆకాంక్ష. కాని ఈ కోరిక తీరదని, దీనికి ఎవరో వస్తారని కాకుండా, మనమే నడుం కట్టాలని సహపాఠకుని సమాజాన్ని వేడుకుంటున్నాను.




ఇకపోతే ఈ సంచికలో అన్ని వ్యాసాలు, కథలు చాలా బాగున్నాయి. నేను దాదాపు 5-6 సం.ల నుండి రెగ్యులర్‌గా ఈ పత్రికను చదువుతున్నాను. మొదటిగా ఈ సంచికలో సుబ్రహ్మణ్య భారతి గురించి వ్రాసిన 'రాధాకృష్ణ శర్మగారు' 'సుబ్రహ్మణ్య భారతి ప్రతి రచనలో దేశాభిమానం, మానవతాదృష్టి కనిపిస్తాయని, ఆయన మామూలు కవులవలె ఊహా ప్రపంచంలో విహరించకుండా, యదార్థ ప్రపంచాన్ని గుర్తించాడని, ఆయన దేశాన్ని, బానిసల నుంచి రక్షించడానికి ఎన్నో రచనలు చేశాడని" వ్రాశారు. ఇంకా ఆనాటి కాలంలో ప్రపంచంలో ఏమూల ఏ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా ఎంతో ఆనందించాడని పేర్కొన్నారు.

రెండవదిగా మా గుంటూరువాసి డా. కడియాల రామమోహన్‌రాయ్ గారి ఇంటర్వ్యూ చాలా బాగుంది. వారి నాన్ననగారు హేతువాది, నాస్తికులని, ఆయన ద్వారా మార్క్సిజం చదివి చిన్నతనంలో కమ్యూనిష్టు వైపు మొగ్గానని వ్రాశారు. ప్రస్తుతం ఉన్న విమర్శకులలో పాపినేని శివశంకర్, రాయ్‌గారు, తెలకపల్లి రవిగారు కాకుండా అస్తమించిన కొడవటిగంటి కుటుంబరావు గారు, అద్దేపల్లిరావు మొదలగు ఉత్తమ విమర్శకులలో ఈయన ఒక్కడు కదా. ఆయన చివరిగా "రచయితలు, రచనలు ఏ మంచికి హాని చేస్తాయో, ఏ చెడ్డకు సాయం పడతాయో'' పరిశీలించుకుని రచనలు చెయ్యాలని సూచించారు.

ఇంకొక వ్యాసంలో డా.విజయ్‌బక్షి గారు వీరేశలింగం గారి గురించి వ్రాస్తూ ఆయన తాను రచనలు చేసేటప్పుడు వాటి శాశ్వతత్వానికంటే, అప్పటి తాత్కాలిక ప్రయోజనానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చారని వ్రాశారు. ఇంకా వీరేశలింగం గారి రచనలు, వ్యాసాలు, నాటకాలు, ఏవైనా సంస్కరణ మార్గం వైపుకి దారితీసేవని వ్రాసారు. ఆ సంస్కరణ భాస్కరుని కాలంనాటి మూఢవిశ్వాసాలు, దురాచారాలు, వేశ్యాలోలత్వం, బాల్యవివాహాలు ఇంకా ఇప్పటికీ మనం చూస్తునే ఉన్నాం.

విజయలక్ష్మి గారి, బ్రౌన్ గారి రచనలు, ఆయన మన తెలుగు, సంస్కృత భాషలకు చేసిన సేవలను ఆమె విశ్లేషణలో పేర్కొన్నారు. బ్రౌన్ తెలుగువాడు కాకపోయినా తెలుగుభాష ఉన్నంతవరకు ఆయనను మనం మర్చిపోకూడదని తెలిపారు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారు అనంతపుర వాస్తవ్యుడైన జగదీష్ గురించి ఎంతో విషయాన్ని చెప్పారు. జగదీష్ గారు మానవత్వాన్ని అన్వేషించి, మానవత్వాన్ని కలవరించి, పలవరించారని వ్రాశారు. ఇంకా జాషువాగారి ఏ కవితలోనైనా అస్పృశ్యత దాగియున్నట్లు, జగదీష్ కవితలో మానవత్వం ఉంటుంది అని ఉదహరించడం చాలా నిజం. ఇంకోమాటగా రాచపాళెం గారు యువతను రాజకీయ ప్రయోజనాలకు ఉ



*కర్నూలోని లలిత కళాసమితిలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఏప్రిల్ **30**న జరిగిన శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం. ఈ సందర్భంగా అసిఫా ఉదంతంపై జనకవనం జరిగింది. చిత్రంలో పత్తి ఓబులయ్య, డా॥ వి. పోతన్న, ఎస్.డి.వి. అజీజ్, జంధ్యాల రఘుబాబు, కెంగార మోహన్, గౌరెడ్డి హరిశ్చంద్రా రెడ్డి, యాగంటీశ్వరప్ప, సుధీర్‌రాజు, శేషాద్రి రెడ్డి తదితరులు ఉన్నారు.*



*గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అన్నమయ్య కళావేదిక, బృందావన్ గార్డెన్స్‌లో మే **18**న జరిగిన సోమేపల్లి వెంకటసుబయ్య కవితా సంపుటి 'మట్టి పొరల్లోంచి' ఆవిష్కరణ సభ. చిత్రంలో డా॥ పాపినేని శివశంకర్, డా॥ వి. నాగరాజ్యలక్ష్మి, చిటిపోతు మస్తానయ్య, గుళ్ళపల్లి సుబ్బారావు, సోమేపల్లి వెంకటసుబ్బయ్య, గుమ్మా సాంబశివరావు, ఎస్.ఎం. సుభాని ఉన్నారు.*



*విజయనగరంలో జిల్లా పరిషత్ సమావేశంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఏప్రిల్ **29**న జరిగిన ఇల్ల ప్రసన్నలక్ష్మి కవితా సంపుటి 'నిన్ను నీవు గెలిచాక' ఆవిష్కరణ సభ. చిత్రంలో చాగంటి తులసి, డా॥ డివిజి శంకర రావు, చీకటి దివాకర్, పి.ఎస్. శ్రీనివాస్, బొల్లోజు బాబా, ఇల్ల ప్రసన్నలక్ష్మి తదితరులు*



*విజయనగరంలో జిల్లా పార్వతీపురంలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో ఏప్రిల్ **30**న శ్రీశ్రీ జయంతి రోజు జరిగిన మల్లిపురం జగదీశ్ కథా సంపుటి 'గురి' ఆవిష్కరణ సభ. చిత్రంలో డా॥ డివిజి శంకర రావు, మేడిపల్లి రవికుమార్, గంటేడ గౌరునాయుడు, అట్టాడ అప్పలనాయుడు, చీకటి దివాకర్, మల్లిపురం జగదీష్ తదితరులు*

పయోగించుకున్నంతగా, దేశ నిర్మాణంలో వాడుకోలేరని బాధపడ్డారు. ఈ మాటను వినే యువత ఈనాడు మనకు కనపడరు. ఈ విధంగా ఈ ఏప్రియల్ సంచికలో వచ్చిన "దేవుడు తప్పిపోయాడు" కవిత్వంపై వచ్చిన ప్రశంస బాగుంది. తనచుట్టూ ఉన్న సమస్యలను వ్రాయడంలో విల్సన్‌రావు ధిట్ట అనీ శ్రీ మోహనరావు పేర్కొన్నాడు.

జ్వాలాముఖి గారి గురించి వ్యాసంలో "ఆనాటి నుంచే అన్ని విషయాలకు భయపడుతున్న యువతను, ప్రతి సమస్యను ధైర్యంగా "లెటజ్ ఫేసిట్" అనే వాయిసిచ్చాడని ద్వానాశాస్త్రిగారు వ్రాశారు. ఇంకా బలహీనులకు తెలివి రానంతవరకే బలవంతుల రాజ్యం అని, బలహీనులకు తెలివివస్తే వాళ్ళ ఆటలు సాగవని జ్వాలాముఖి అభిప్రాయంగా పేర్కొన్నారు. కాని ఈనాటికి కూడా అది నిజం కాలేదని మనం తెలుసుకోవాలి.

ఈ రకంగా ఈ సంచికలో ఇంకా విజయ్‌గారి కవిత్వం, శ్రీశ్రీపై సింగంపల్లి అశోక్‌కుమార్ గారి విశ్లేషణ ఎంతో బాగుంది. చివరిగా ప్రసాద్‌గారు "ప్రమాదం" అనే కథలో సమాజంలో ఇప్పుదున్న సమస్యలను బాగా ఎత్తిచూపారు. మనదేశంలో స్వాములు, స్కాములు గురించి కోరికలు తీర్చని దేవుళ్ళకంటే క్రికెట్ ఆటగాళ్ళు, సినిమావాళ్ళకు ఉండే క్రేజ్ గురించి బాగా వ్రాశారు. టీవి ఛానల్లపై బాగా చురకలు వేశారు. ఏమి తినాలో, ఎలా తినాలో చెప్పేవి కొన్ని, ఊపిరి ఎట్లా తీసుకొని, ఎక్కువ రోజులు ఎట్లా బతకాలో కొన్ని అని రాశారు.

ఈ విధంగా ఈ సంచిక గురించి ఎంత వ్రాసినా తక్కువే. కాబట్టి ఉడతాభక్తిగా ఈ వ్యాస కర్తలకు నా నమస్కారాలు తెలుపుతూ ఈ లేఖను వ్రాస్తున్నాను. నేను గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా చేస్తున్నాను. కానీ నా ఆకాంక్ష కొరకు పత్రికలో వచ్చే సాహిత్యాన్ని పూర్తిగా అర్థం కాకపోయినా చదువుతుంటాను. ❖

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

## కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి ప్రారంభ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు

కందుకూరి పై వడ్డి ధర్మారావు రాసిన గేయాన్ని ఆలపిస్తున్న నిశ్చలం సురేష్ బృందం




వేదిక మీద రూపకం ప్రదర్శన దృశ్యాలు








సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి, జనరల్ ఎడిటర్ పాల్గొని మే 27న రాజమహేంద్రవరంలోని కందుకూరి వీరేశలింగం మ్యూజియం సందర్శించడం జరిగింది. పురావస్తు శాఖ ఈ మ్యూజియం పరిరక్షణ కేంద్రం. ముఖ్యమైన వాళ్ళ సందర్శకులను ఆహ్వానిస్తున్నారు. అలాగే ఆయన స్థాపించిన కళాశాల, పురమందిరం, వీరేశలింగం రచనలు చదివి చూడటం జరిగింది.





కందుకూరి విగ్రహం వద్ద పురావస్తు శాఖ శాఖ ఏర్పాటుచేసిన వివరాలతో కూడిన ఫలకాలు



కందుకూరి వాడిన కుర్చీ. వెనుక ఉన్న బల్ల కింద ఒక రంధ్రం ఉంది. ఆయన రాసినవి ఆ బల్లలో వేసి ఆ రంధ్రం ద్వారా కింద ఉన్న ప్రింటింగ్ ప్రెస్‌కు అందేవారు.



కందుకూరి వాడిన దుప్పటితో ఉన్న ఆయన ప్రతిమ వద్ద రవి, తెలకపల్లి రవి, కొండ్రుపాటి, ఎవరు




డిసెంబర్ 11, 1881 న జరిగిన తొలి వితంతు వివాహ దృశ్యం. ఈ వివాహానికి కందుకూరి, ఎ.పి.తో ఉన్న వంటి పోలీసులు రక్షణగా నిల్చారు.



కందుకూరి వీరేశలింగం రచనల అచ్చుకి ప్రతులు



కందుకూరి ఉత్తర ప్రత్యుత్తరాలు. వీటిలో వివాహాలు జరిపిస్తున్నారు. వితంతువులను వివాహం చేసుకుంటామంటూ రాసిన ఉత్తరాలు వంటివి ఉన్నాయి



కందుకూరి వాడిన లాంతరు ఆయన కుర్చీకి పైన తగిలించి ఉంది.



కందుకూరి రాజ్యలక్ష్మి, వీరేశలింగం దంపతుల చిత్రాలు

SHAITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 1st &2nd of Every Month ▪ Date of Publication: 27.05.2018




If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059